10-5Pg1exHMNWJQE.qxd:10-5Pg1exHMNWJQE.qxd 10/05/25 12:40 AM Page 1

: fb.com/vaartha Digital

WWW.VAARTHA.COM

epaper.vaartha.com

ఒంగోలు

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

10-5-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 98 పేజీలు: 12 వెల: 6.50

## ఐపిఎల్ వారం వాయిదా



### ఉద్రిక్తతలు పెరగడంతో బిసిసిఐ నిర్ణయం

**న్యూఢిల్లీ, మే 9:** భారత్ పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఇరు దేశాల మధ్య యుద్ధ మేఘాలు అలుముకోవడంతో ఐపిఎల్ 2025ను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు బిసిసిఐ అధికారికంగా ప్రకటించింది. దేశం తర్వాతే తమకు ఏదైనా అని ఈ సందర్భంగా బిసిసిఐ తేల్చి చెప్పింది. ప్రభుత్వం, భారత ఆర్మీ ఏ నిర్ణయం తీసుకున్నా తాము కట్టుబడి ఉంటామని బిసిసిఐ వెల్లడించింది. ఐపిఎల్ 2025ను వారం రోజుల పాటు అర్థాంతరంగా వాయిదా వేస్తున్నట్లు బిసిసిఐ అధికారికంగా ప్రకటించింది. దీనికి సంబంధించిన మిగతా అప్‌డేట్స్‌ను త్వరలోనే వెల్లడిస్తామని >>2



# దద్దరిల్లిన ఎల్వోసీ

## సమర 'సిందూర'ం

వరుసగా రెండోరోజున కూడా పాక్ బరితెగించింది. అయితే 100పైగా డ్రోన్లను కూల్చివేసి భారత్‌సైనికులే తమసత్తా మరోసారి నిరూపించారు. కాశ్మీర్ సహా నాలుగు రాష్ట్రాలలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితుతు నెలకొన్నాయి.





## చీకటిపడగానే డ్రోన్లతో విజృంభించిన పాక్

- 20 కేంద్రాలను టార్గెట్ చేసిన దాయాది దేశం
- ఎక్కడికక్కడ డ్రోన్లను కూల్చివేసిన భారత్ సైన్యం
- సరిహద్దు రాష్ట్రాల్లో బ్లాకౌట్
- ప్రజలను అప్రమత్తం చేస్తూ సైరన్ల మోత
- తాను ఉన్న ప్రాంతంలో కూడా పేలుళ్ల శబ్దాలు వినిపించాయన్న సిఎం ఒమర్
- సరిహద్దుల్లో ప్రజలు బంకర్లలోకి వెళ్లాలన్న కేంద్రం
- తాజా పరిణామాలను ప్రధానికి వివరించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, త్రివిధ దళాధిపతులు

**న్యూఢిల్లీ, మే 9:** సరిహద్దుల్లో భీకర దాడులు కొనసాగుతున్నాయి. పాక్ క్షిపణి సామర్థ్యాలను వ్యూహాత్మక దాడులతో ధ్వంసంచేస్తుండటంతో దాయాది పాక్ భారత్‌పై కుట్రపూరిత దాడులతో పేట్రేగిపోతోంది. అయితే భారత్‌వద్ద ఉన్న అత్యాధునిక రక్షణ వ్యవస్థలతో అవన్నీ తేలిపోతున్నాయి. సుమారు 500కిపైగా డ్రోన్లతో సరిహద్దుల్లో దాడులుచేసిందని సాక్షాత్తూ రక్షణశాఖ అధికారులే వెల్లడించారు. 36 ప్రాంతాలను లక్ష్యంగాచేసుకుని ఈ డ్రోన్లను ప్రయోగిస్తే పాక్‌డ్రోన్లు అన్నింటినీ సమర్థవంతంగా భారత్ సేనలు తిప్పికొట్టాయి. శుక్రవారం రాత్రి చీకటిపడిన వెంటనే మళ్లీ దాడులు ప్రారంభించిన పాక్ దాడులను అక్కడికక్కడే తిప్పికొడుతోంది. రాజస్థాన్‌లోని జైసల్మేర్, పోఖ్రాన్ ప్రాంతాల్లోకి దూసుకువచ్చిన డ్రోన్లను భారత్‌సేనలుకూల్చివేసాయి. అలాగే జమ్ముకాశ్మీర్‌లోని కుప్వారా, పూంచ్,రాజౌరి,సాంబా సెక్టార్‌లలో డ్రోన్ల దాడులు ముమ్మరం చేయడంతో భారత్ >>2



ప్రధాని మోదీతో రాజ్‌నాథ్, త్రివిధ దళాధిపతుల భేటీ

## పాక్ కాల్పుల్లో తెలుగు జవాన్ మురళీనాయక్ వీరమరణం



మురళీ నాయక్(ఫైల్)

### బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి సవిత

### అండగా ఉంటామని సిఎం చంద్రబాబు భరోసా

**గోరంట్ల, మే 9 ప్రభాతవార్త:** ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో గోరంట్ల మండలం కల్లితాండ గ్రామానికి చెందిన వీరజవాన్ మురళీ నాయక్ వీరమరణం పొందడంపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత విచారం వ్యక్తంచేశారు. బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. గోరంట్ల మండల కేంద్రంలో మురళీ నాయక్ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. పాకిస్తాన్ తో జరుగుతున్న యుద్ధంలో గోరంట్ల మండలం కల్లితాండ గ్రామానికి చెందిన వీర జవాన్ మురళీ నాయక్ వీరమరణం పొందారు. విషయం తెలుసుకున్న వెంటనే కల్లితాండ గ్రామానికి వెళ్లి మురళీ నాయక్ తల్లి దండ్రులను మంత్రి శుక్రవారం పరామర్శించారు. కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న మురళీ నాయక్ తల్లిదండ్రులు శ్రీరాములునాయక్, జ్యోతిభాయిని చూసి మంత్రి భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. తేరుకున్నాక మురళీనాయక్ తల్లిదండ్రులను ఓదార్చారు. ప్రభుత్వంతో పాటు దేశమంతా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. తమ ఏకైక బిడ్డయుద్ధంలో వీరమరణం చెందడంతో మురళీనాయక్ తల్లిదం >>2



శుక్రవారం అమరజవాన్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మంత్రి సవిత

## తిరుమల,తిరుపతిలో హై అలర్ట్

### రేణిగుంట విమానాశ్రయంలో విస్తృత తనిఖీలు

**తిరుమల,మే 9ప్రభాతవార్తప్రతినిధి:** భారత్-పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ప్రపంచ ప్రఖ్యాత పుణ్యక్షేత్రం తిరుమలతో బాటు తిరుపతి నగరంలో భద్రతను మరింత హైఅలర్ట్‌చేశారు. తిరుమల ఆలయంతోబాటు ఇక్కడకు వస్తున్న యాత్రికుల భద్రత కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారు.శుక్రవారం మధ్యాహ్నం తిరుమలలోని కమాండ్ కంట్రోల్‌రూమ్‌లో టిటిడి సివిఎస్ఒ వి.హర్షవర్ధన్‌రాజు, తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్, విజిలెన్స్ అధికారులు, ఆక్టోపస్ అధికారులు అత్యవసరంగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తిరుమల ఆలయంతో బాటు తిరుమల అంతటా పూర్తిస్థాయిలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, వస్తున్న ప్రతి యాత్రికునిపై మరింత నిఘాఉంచాలని ఆదేశించారు. ఆలయం పరిసరాల్లో అదనపు భద్రత బలగాలను మొహరింపజేశారు. శుక్రవారం సాయంత్రం ఆక్టోపస్ బలగాలు, తిరుమల పోలీసులు జిఎన్‌సి టోల్‌గేట్ ప్రాంతంలో కవాతు నిర్వహించారు. ఏదేని ఉపద్రవం ఎదురైనా భక్తులను కాపాడటం, భక్తులు కూడా సురక్షితంగా ఉండేలా చేపట్టారు.

**రెండురోజులు వరుసగా మరింత హైఅలర్ట్ :**భారత్ పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పుణ్యక్షేత్రం తిరుమలకు ఉన్న ఘాట్‌రోడ్డుమార్గంతోబాటు రెండు కాలినడక మార్గాల్లో తిరుపతి జిల్లా పోలీసుయంత్రాంగం, ఆక్టోపస్ బలగాలు గట్టి నిఘా ఉంచాయి. హైఅలర్ట్ జోన్‌గా ప్రకటించి తనిఖీలు చేపడుతున్నాయి. ప్రత్యేక బృందాలతో యాత్రికులు బసచేసే గోగర్భమ్‌డ్యామ్ సమీపంలోని మఠాలలో, వసతిసముదాయాలు, విశ్రాంతి గృహాల్లో ఏకకాలంలో క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. ఈ ప్రక్రియ 24గంటలూ అణువణువూ నిశితంగా పరిశీలించి, యాత్రికుల పేరుతో గదుల్లో దిగిన, బసచేస్తున్న వారి వివరాలు, ఆధార్‌కార్డులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. తిరుమల పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది బృందాలుగా విడిపోయి మెట్లమార్గంలో యాత్రికులను, వారి లగేజీలను తనిఖీ చేస్తున్నారు. కొండకు వస్తున్న వారెవరు, వారి లగేజీలను నిశితంగా పరిశీలించిన తరువాత అనుమతినిస్తున్నారు. తిరుమల ఆర్టీసి బస్టాండుతోబాటు అతిథిగృహాల్లో బసచేసిన వారి వివరాలను తెలుసుకుంటున్నారు. ఆయా విశ్రాంతి గృహాలు, అతిథిగృహాల్లో మేనేజర్లు, సిబ్బందికి పోలీసులు స్పష్టమైన సూచనలు, జాగ్రత్తలు చేస్తున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో తిరుమల డిఎస్పీ >>2

## జూలై 10న 'హంద్రీ' నీరు విడుదల



శుక్రవారం సభలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

### ఆధునీకరణ పనుల పూర్తికి రూ. 3,873 కోట్లు

### 'తల్లి వందనం' పిల్లలందరికీ ఇస్తాం

### దేశంలో ఉగ్రవాదాన్ని ఉపేక్షించే ప్రసక్తిలేదు

### ఛాయాపురం సభలో సిఎం చంద్రబాబు

**అనంతపురం, మే 9 ప్రభాతవార్త బ్యూరో:** రాయలసీమను రతనాల సీమగా మారుస్తానని,వచ్చే జూలై 10న హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా నీటిని విడుదల చేస్తామని, ఈ సీజన్లోనేహంద్రీ నీవా ద్వారా 40టీఎంసీల నీటిని తేవాలని ఆలోచన చేస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. హంద్రీ నీవా ప్రాజెక్టులో ఫేజ్ 1, 2 కింద 554 కి.మీ. మేర కాలువ లైనింగ్, వెడల్పు పనులకు రూ.3,873 కోట్లు ఖర్చు చేస్తున్నామని,, పనులు ప్రారంభించి ఇప్పటికే 37 శాతం పనులు పూర్తి చేసినట్లు సీఎం తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యంతో ఐదేళ్లు హంద్రీనీవా పనులు ఆగిపోయాయని, ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే హంద్రీ నీవా పనులను శరవేగంగా పూర్తి చేస్తోందని , పోలవరంబనకచర్ల పూర్తయితే సీమలో కరువు అనే మాట వినబడదని, రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరు అందుతుందని సీఎం చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలం చాయాపురంలో హంద్రీనీవా సుజల స్రవంతి పథకం కింద కాలవ వెడల్పు పనులను క్షేత్రస్థాయిలో సీఎం పరిశీలించారు. అనంతరం చాయాపురంలో నిర్వహించిన ప్రజావేదికలో పాల్గొన్నారు. దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన మురళీ నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని సీఎం చంద్రబాబు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన సభలో ప్రజలను ఉద్దేశించి సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడారు. సీఎం మాటల్లోనే.మనందరి ప్రియతమ నేత ఎన్టీఆర్ కల హంద్రీనీవా.ఆనాడు రాయలసీమకు నీరు లేదు. ఎడారిగా మారిపోతుందని అందరూ చేతులెత్తేశారు. అలాంటి పరిస్థితుల్లో నమ్మకం కల్పించిన వ్యక్తి ఎన్టీఆర్. ఆనాడు కృష్ణా జలాలను బచావత్ అవార్డు ప్రకారం కేటాయించేవారు. మిగులు జలాలు వాడుకునే అవకాశం ఏపీకి ఉందని భావించిన ఎన్టీఆర్ హంద్రినీవా, గాలేరు, నగరి, తెలుగుగంగ వంటి ప్రాజెక్టులు తెచ్చి సీమ దశదిశా మార్చే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత నేను ముఖ్యమంత్రి అయ్యాక సీమకు ఏం చేయాలో అన్నీ చేశాను. రాయలసీమ రాళ్ల సీమ అని చాలామంది అన్నారు. రతనాలసీమ చేస్తానని ఆరోజు చెప్పాను. మొన్నటి ఎన్నికల్లో కూటమికి జిల్లా వాసులు పట్టం కట్టారు అని వెల్లడించారు. నీరు ఉంటేనే ఏదైనా సాధ్యం . నీటి వనరుల కోసం హంద్రినీవాను వెడల్పు చేస్తానని చెప్పిన గంటలో జీవో ఇచ్చాను. అదే సమయంలో 37 శాతం పనులు పూర్తి చేశాను. 2014లో మేం గెలిచాక సీమ ప్రాజెకక్టులపై దృష్టి పెట్టాం. కియా పరిశ్రమను ఏపీకి రమ్మంటే నీళ్లు ఎక్కడున్నాయో చెప్పమన్నారు. ఆరునెలల సమయం తీసుకుని గొల్లపల్లిప్రాజెక్టు పూర్తిచేసి ఐదేళ్లలోనే కరువు జిల్లాకు కియా వచ్చేలా చేశాం. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో ఒక్క రూపాయి ఖర్చు పెట్టారా, ఒక్కరోడ్డుకైనా మట్టి వేశారా, గుంటలు పూడ్చారా, కాల్వల్లో గంప మట్టి తీశారా అలాంటి ప్రభుత్వాల వల్ల ప్రజలకు ఒరిగేది ఏమీఉండదు. ఈ సీజన్లోనే హంద్రీనీవా ద్వారా 40 టీఎంసీలు తేవాలని చూస్తున్నాం. 2014-19మధ్య కాలంలో >>2

## డిప్యూటీ కలెక్టర్‌కు ఎమ్మార్వోగా డిమోషన్

### సుప్రీం కోర్టు సంచలన తీర్పు

**విజయవాడ,మే9,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన డిప్యూటీ కలెక్టర్ విషయంలో సుప్రీం కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. డిప్యూటీ కలెక్టర్‌ను ఎమ్మార్వోగా డిమోషన్ చేస్తూ సుప్రీం తీర్పునిచ్చింది. డిప్యూటీ కలెక్టర్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. తాము చట్టానికి అతీతులమన్న భావనను ప్రభుత్వ అధికారులు తగ్గించుకోవాలని వ్యాఖ్యలు చేసింది. >>2

## సిఎం చంద్రబాబుకు పటిష్ట భద్రత

**విజయవావ.మే9,ప్రభాతవార్తప్రతినిధి:** ఆపరేషన్ సిందూర్ తరువాత వివిధ ప్రాంతాల్లో చేపట్టిన భద్రతా చర్యలు, ప్రజలు, సంస్థల రక్షణ, వీఐపీల భద్రతపై ఉన్నతాధికారులు హైలెవల్ రివ్యూ చేశారు. ప్రస్తుత పరిస్థితులు,తీసుకోవాల్సిన చర్యలపై డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, ఇంటిలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్రలడ్డాతో పాటు ఉన్నతాధికారులు సమీక్షకు హాజరయ్యారు. ఇందు >>2

## లిక్కర్ స్కాం దర్యాప్తు ముమ్మరం

### వాస్తవాలు కూపీ లాగుతున్న ఇడి

### కేసులో 33మంది నిందితులు

**విజయవాడ,మే 9,ప్రభాతవార్త ప్రతినిధి:** మద్యం కుంభకోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అడుగుపెట్టడం సంచలనంగా మారిన నేపథ్యంలో ఆ సంస్థ దూకుడు పెంచింది,నిజాలు రాబట్టేందుకు పలు దిశలో కూపీలాగుతుంది.ఇప్పటికే ప్రాథమిక విచారణ జరిపిన ఈడీ అధికారులు మనీ లాండరింగ్ చట్టం(పీఎంఎల్ఏ) కింద అభియోగాలు మోపింది. తదనుగుణంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు(ఈసీఐఆర్) నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేసులో 33 మందిని నిందితులుగా చేర్చారు. వైకాపా ప్రభుత్వం పెద్దల తరపున మద్యం కుంభకోణంలో అన్నీ తానై వ్యవహరించిన రాజ్ కెసిరెడ్డితో పాటు వైకాపా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి,ఆ పార్టీ నేత విజయసాయిరెడ్డి,జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం సిఎంఒ కార్యదర్శిగా పనిచేసిన విశ్రాంత ఐఎఎస్ అధికారి ధనుంజయరెడ్డి,జగన్ ఓఎస్డీ కృష్ణమోహనరెడ్డి,భారతి సిమెంట్స్ పూర్తి కాలపు డైరెక్టర్ గోవిందప్ప బాలాజీతో పాటు ఏపీఎస్‌బీసీఎల్ పూర్వపు ఎండీ డి.వాసుదేవరెడ్డి, ఏపీఎస్‌బీసీఎల్ ప్రత్యేకాధికారి సత్యప్రసాద్, ఎస్‌పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ పూర్వపు డైరెక్టర్ సజ్జల శ్రీధర్‌రెడ్డి,మద్యం ముడుపుల వసూళ్ళలో కీలకంగా వ్యవహరించిన రాజ్ కెసిరెడ్డి తోడల్లుడు ముప్పిడి అవినాష్‌రెడ్డి,వీరి అనుచరులు బూనేటి చాణక్య,టి.కిరణ్‌కుమార్‌రెడ్డి,సైఫ్ అహ్మద్‌తో పాటు మద్యం ముడుపుల సొత్తు రూటింగ్ కోసం వినియోగించిన పలు డొల్ల సంస్థల యాజమాన్యాలను నిందితులుగా ఈడీ చేర్చింది. వీరందరికీ నోటీసులిచ్చి విచారించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. దేశ చరిత్ర లోనే ఇది అతి పెద్ద మద్యం కుంభకోణం కావడంతో పాటు సరఫరా కంపెనీలు,డిస్టలరీల నుండి వసూలు చేసిన దాదాపు రూ.3200 కోట్ల ముడుపులను కల్పిత, ఊహాజనిత కంపెనీల ద్వారా వివిధ దశల్లో రూటింగ్ చేసి అంతిమ లబ్దిదారుకు చేర్చినట్లు ప్రాథమికంగా ఈడి గుర్తించింది.మద్యం కుంభకోణం కేసులో దర్యాప్తును ముమ్మరం చేసిన ఈడీ అధికారులు దీనికి సంబంధించిన సమగ్ర వివరాలివ్వాలని కోరుతూ రెండు రోజుల కిందట సిట్ అధిపతి ఎస్‌వీ రాజశేఖరబాబుకు లేఖ రాశారు. సీఐడీ తొలుత నమోదు చేసిన ఎఫ్ఐఆర్ సర్టిఫైడ్ ప్రతులు,ఈ కేసులో నిందితులు, అనుమానితులు, సంబంధమున్న ఇతర వ్యక్తులు, సంస్థల బ్యాంకు ఖాతాల వివరాలు,ఆస్థుల సమాచారం అందివ్వాలని లేఖలో కోరారు. ఇప్పటి వరకు అరెస్ట్ అయిన నిందితులు,వారి రిమాండు రిపోర్టులు,అభియోగ పత్రం దాఖలు చేసుంటే దాని ప్రతిని సమర్పించాలని అడిగారు. వాటితో పాటు ఈ కేసు దర్యాప్తులో ఉపయోగపడే అవసరమైన ఇతర పత్రాలు,సమాచారం ఉంటే అందివ్వాలని లేఖలో పేర్కొన్నారు. ఈడీ కోరిన వివరాల్ని సిట్ అధికారులు అందించినట్లు తెలిసింది. వాటి ఆధారంగా ఈడీ మనీ లాండరింగ్‌కు సంబంధించి లోతుగా వివరాలు ఆరా తీస్తుంది.బ్యాంకు ఖాతాలు,ఆస్థుల సమాచారాన్ని పరిశీలిస్తోంది. కుంభకోణానికి >>2

## భద్రత పెంచాలని కోరిన జగన్

మాజీ సీఎం పిటిషన్ విచారణ వేసవి తరువాతకు వాయిదా 2లో

## గురుకుల ప్రవేశ పరీక్ష ఫలితాల్లో కర్నూలు, అనకాపల్లి టాప్



### ఫలితాలు విడుదల చేసిన మంత్రి బాల వీరాంజనేయస్వామి

**విజయవాడ,మే9,ప్రభాతవార్తప్రతినిధి:** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకాలల ప్రవేశ పరీక్ష -2025 ఫలితాలు విడుదలయ్యాయి. శుక్రవారం ఉదయం మంత్రి డాక్టర్ బాల వీరాంజనేయస్వామి ఈ ఫలితాలను విడుదల చేశారు. ఐదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాల కోసం సాంఘీక సంక్షేమ శాఖ ఈ ప్రవేశ పరీక్షలను నిర్వహించింది. ఐదవ తరగతి ప్రవేశ పరీక్షల ఫలితాల్లో కర్నూలు జిల్లా నుంచి ఇద్దరు మొదటి, మూడో ర్యాంకు సాధించగా అనకాపల్లికి చెందిన విద్యార్థి రెండవ ర్యాంక్ సాధించారు. 5వ తరగతి ప్రవేశ పరీక్షలో.మొదటి ర్యాంక్ కడవల సుమతి (కర్నూలు జిల్లా), రెండవ ర్యాంక్ వియ్యపు శరత్ (అనకాపల్లి జిల్లా), మూడవ ర్యాంక్ బోయా విద్యా (కర్నూలు జిల్లా) లభించాయి. ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్షల్లో విశాఖ జిల్లాకు చెందిన విద్యార్థి మొదటి ర్యాంకు, కర్నూలు జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు రెండు, మూడు ర్యాంకులను సాధించారు. మొదటి ర్యాంక్ రఘుపతి గీతిక (విశాఖజిల్లా), రెండవ ర్యాంక్ ఈపూరు సుహ్రుతి (కర్నూలు జిల్లా ), మూడవ ర్యాంక్ పింజరి హసీనా (కర్నూలుజిల్లా) లభించాయి. ఫలితాలు విడుదల సందర్భంగా మంత్రి డోలా వీరాంజనేయస్వామి మాట్లాడుతూ. గురుకుల పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెరిగిందన్నారు. గురుకులాల్లో భవిష్యత్తులో సీట్లు పెంచాలని సీఎం చంద్రబాబు నాయుడు ప్రణాళికాబద్ధంగా వెళ్తున్నారని తెలిపారు. గురుకుల పాఠశాలల్లో చదివే విద్యారులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థులకు కాస్మొటిక్ కిట్స్ కూడా అందిస్తున్నామని తెలిపారు. గురుకులాల్లో మెకానైజ్డ్ సిస్టం ఇంప్లిమెంట్ చేస్తున్నామన్నారు. కార్పొరేట్‌కు ధీటుగా >>2

10-5pg2exHMNWJQE.qxd:10-5pg2exHMNWJQE.qxd 10/05/25 12:37 AM Page 1





శుక్రవారం చాయాపురం సభకు హాజరైన ప్రజలు

# జూలై 10న 'హంద్రీ' నీరు విడుదల

>> ఇక్కడ ఇరిగేషన్ కోసమే రూ. 70వేల కోట్లు ఖర్చు చేశాం. ఒక్క రాయలసీమలోనే రూ. 12,441 కోట్లు ఖర్చు చేశాం అని సీఎం వెల్లడించారు. హంద్రినీవాలో రూ.4,200 కోట్లు ఖర్చు చేశాం. 10మీటర్ల నుంచి 16.5 మీటర్ల వెడల్పు చేశాం. 40 టీఎం సీ నీరు తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ సీజన్ లోనే పనులు పూర్తి చేస్తాం. 23 నుంచి 34 ప్యాకేజీలు పనులు పూర్తయ్యాయి. గొల్లపల్లి, మడకశిర బ్రాంచ్ కెనాల్ పూర్తిచేశాం. చెర్లోపల్లి , జీడిపల్లి ప్రాజాక్టులు పూర్తిచేశాం. హంద్రీనీవా ప్రాజెక్టు కోసం 512 ఏజెన్సీ లు పనిచేస్తున్నాయి. మొత్తంగా 1040 మిషన్లు పనిచేస్తున్నాయి అని సీఎం తెలియజేశారు.మొన్నటి వరకూ పుట్టపర్తి చుట్టుపక్కల నీరు కనిపించేది కాదు. ఇప్పుడు ఎక్కడ చూసినా నీరు కనిపిస్తుంటే ఆనందంగా ఉంది. ఒకప్పుడు ఇక్కడి జనం దిగాలుగా ఉండేవారు. ఇప్పడు హుషారుగా ఉన్నారు. నీరు అందడంతోనే మీలో ధైర్యం వచ్చింది. అందుకు హంద్రినీవానే కారణం అని తన ప్రసంగంలో సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. గత ఐదేళ్లలో డ్రిప్ , మైక్రో ఇరిగేషన్ పథకాలు ఇవ్వలేదు. దేశంలోనే 90 శాతం డ్రిప్ ఇరిగేషన్ కు సబ్సిడీ ఇచ్చేది ఏపీ ప్రభుత్వమే అని సీఎం వెల్లడించారు. పోలవరంబనకచర్ల పూర్తయితే రాష్ట్ర ముఖచిత్రం మారిపోతుంది. 2 వేల టీఎంసీల నీరు గోదావరి నుంచి సముద్రంలోకి పోతోంది. అందులో 300 టీఎంసీ నీరు మనం తెచ్చుకోగలిగితే రాష్ట్రమంతా సస్యశ్యామలం అవుతుంది. ప్రతి ఎకరాకు నీరు అందుతుంది. రైతులు బంగారం పడిస్తారు. ప్రాజెక్టు కోసం రూ. 81 వేల కోట్లు కావాలి. సంకల్పం ఉంటే అదే దారి చూపుతుంది. పోలవరం నుంచి బనకచర్ల వరకూ నీరు తెస్తే నా జీవితం సార్థకమవుతుంది అని సీఎం చంద్రబాబు వెల్లడించారు.దేశాన్ని రక్షించే సమర్థ నాయకుడు మోదీదేశాన్ని రక్షించే శక్తి ప్రధాని మోదీకి ఉందని ఇటీవల అమరావతి సభలో నేను చెప్పాను. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ తో టెర్రరిస్టులను హతం చేసింది. పాకిస్తాన్ మనపై దాడులు చేస్తూ కవ్వింపు చర్యలకు దిగుతోంది. దేశ రక్షణలో భాగంగా మన తెలుగుబిడ్డ మురళీ నాయక్ ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధించింది. అతని ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను. మురళీ నాయక్ కుటుంబానికి అండగా ఉంటాం. ఎందరో యువకులు రక్షణశాఖలో చేరుతున్నారు. సైన్యానికి మనమంతా అండగా ఉండాలి. వారి పోరాటానికి మద్దతివ్వాలి. ప్రపంచంలో హింసకు తావులేదు. ప్రగతిలో పోటీ పడాలని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ తల్లి వందనం ఇస్తాం. రాష్ట్రంలోని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. 63 లక్షల మందికి పింఛన్లు అందిస్తున్నాం. ఇందుకోసం రూ. 33 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. ప్రతి కుటుంబానికి ఇల్లు, మంచినీటి కుళాయి , మరుగుదొడ్లు, కరెంటు, దీపం కింద గ్యాస్ కనెక్షన్లు ఇవ్వాలన్నదే నా లక్ష్యం. ఇప్పటికే 200కు పైగా అన్నాక్యాంటీన్లు ఏర్పాటు చేశాం. దీపం 2 పథకం కింద 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. మత్స్యకారులకు రూ. 20 వేలు వేశాం. 16 వేలకు పైగా టీచరు పోస్టులు భర్తీ చేయబోతున్నాం. రైతులకు అన్నదాత సుఖీభవ కింద ఏడాదిలో మూడు విడతల్లో రూ. 20 వేలు పెట్టుబడి సాయం అందిస్తాం. తల్లికి వందనం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికీ రూ. 15 వేలు అందిస్తాం. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరులకు ప్రభుత్వ సేవలు అందిస్తున్నాం. భద్రత విషయంలోనూ కఠినంగా వ్యవహరిస్తున్నాం. ఆడబిడ్డల జోలికొస్తే నేరస్థుల పనిపడతాం. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి. త్వరలో హెల్త్ డిజిటల్ కార్డులు అందుబాటులోకి తెస్తాం. గుంతల రోడ్లు గత పాలకుల ఎలా పాలించారో చెప్పాయి. రాష్ట్రంలో కూటం ప్రభుత్వం వస్తానే రోడ్లలో గుంతలన్నీ పూడ్చామని సీఎం చంద్రబాబు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్,జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడు, ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, జిల్లా ఎస్పీ పి.జగదీష్, జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ,అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్,అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ,కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు,గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఏడిసిసి బ్యాంక్ అధ్యక్షులు ముంటిమడుగు కేశవరెడ్డి, టిడిపి నేతలు ఆలం నర్స నాయుడు, శ్రీధర్ చౌదరి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## హంద్రీ నీవా కాలువ విస్తరణ పనులు పరిశీలించిన సిఎం చంద్రబాబు

**అనంతపురం, మే 9, ప్రభాతవార్త బ్యూరో:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అనంతపురం జిల్లా పర్యటనలో కొద్దిసేపు అధికారులకు గుండెల్లో రైలు పరిగెత్తించారు. ప్రజా ప్రతినిధులు కూడా లేకుండా హంద్రీ నీవా ఎస్.ఈ స్వరూప్ కుమార్‌ను పక్కన పెట్టుకొని కాలవ వెడల్ పనులను సీఎం పరిశీలించడం, ప్రత్యేకంగా వివరాలుతెలుసుకోవడం చర్చనీయాంశంగా మారింది. సాంకేతిక నిపుణులతో డ్రోన్ల సహాయంతో కూడా కాలవ విస్తరణ పనులు స్వయంగా తెలుసుకుని సీఎం వారితో మాట్లాడడం గమనించదగ్గ విషయం కొద్దిసేపు జిల్లా మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, తదితర ఎమ్మెల్యేలు కలిసి హంద్రీ నీవా విస్తరణ పనులను సమీక్షించారు. తనదైన శైలిలో సిఎం చంద్రబాబు కాలువ పనులను పరిశీలించడం ప్రత్యేకంగా చెప్పవచ్చు.

# కర్నూలు, అనకాపల్లి టాప్

>> విద్యను అందించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు కెరీర్ కౌన్సిలింగ్‌లు ఇప్పించి భవిష్యత్తుకు పునాదులు వేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి డోలా వీరాంజనేయస్వామి వెల్లడించారు. విద్యతో పాటు విద్యార్థుల ఆరోగ్యం, సంరక్షణ పట్ల కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యా ప్రమాణాలు ఉ సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు.ప్రతి పాఠశాలలో పారిశుధ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యవిద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కోసం ప్రతి వారం ఒక పీరియడ్ బోధించేలా చర్యలు ఉచిత నీట్ కోచింగ్ సెంటర్లు 10కి పెంచుతున్నాం. పేదింటి బిడ్డలు డాక్టర్లు, ఇంజనీర్లు అవ్వాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమన్నారు. రాష్ట్రంలోని వంద పాఠశాలల్లో రూ. 10 కోట్లతో అధునాతన కిచెన్ లను అప్ గ్రేడ్ చేసి విద్యార్థులకు పరిశుభ్రమైన, నాణ్యమైన భోజన వసతికి వెకనైజేషన్ ఆఫ్ కిచెన్ కు చర్యలు తీసుకున్నామని తెలిపారు. అలాగే ప్రతి విద్యార్థికి రెండు జతల నైట్ డ్రెస్ లు అందిస్తున్నామన్నారు. అంతేకాకుండ రాష్ట్రంలో 3ఎక్సలెన్స్ సెంటర్‌లు ఉండగా వాటిని 10కి పెంచుతున్నామన్నారు. పదవ , ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఎక్సలెన్స్ సెంటర్‌ల ద్వారా వారికి మరింత మెరుగైన, ఉత్తమమైన శిక్షణ అందించనున్నామన్నారు. సమావేశంలో సెక్రటరీ వి. ప్రసన్న వెంకటేష్, అడిషనల్ సెక్రటరీ కె. సునీల్ రాజ్ కుమార్, జాయింట్ సెక్రటరీ ఎన్. సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ కలెక్టర్‌కు ఎమ్మార్వోగా డిమోషన్

>> హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘించినందుకు అమరావతి, విజయవాడ , తీహార్.. ఏ జైలుకు వెళ్లాలో డిప్యూటీ కలెక్టరే నిర్ణయించుకోవాలని సూచించింది. ఉద్దేశపూర్వకంగా ఉత్తర్వులను పాటించకపోవడంతో డిప్యూటీ కలెక్టర్‌కు ఏపీ హైకోర్టు రెండు నెలల జైలుశిక్ష విధించింది. ఏపీ హైకోర్టు ఉత్తర్వులను సుప్రీంకోర్టులో సవాలు చేశారు డిప్యూటీ కలెక్టర్. ఈ పిటీషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. 2013 డిసెంబర్ 11న గుంటూరులో ఒక ప్రాంతంలో ఆక్రమణలను తొలగించవద్దని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను డిప్యూటీ కలెక్టర్ ధిక్కరించారు. అప్పట్లో తహసీల్దార్‌గా ఉన్న సదరు అధికారి హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘించి 2014లో ఆక్రమణలు తొలగించారు. దీంతో ప్రస్తుతం డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన సదరు తహసీల్దార్‌కు ఏపీ హైకోర్టు రెండు నెలల జైలు శిక్ష విధించింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ డిప్యూటీ కలెక్టర్ సుప్రీంను ఆశ్రయించారు.దీనిపై గత విచారణ జరిపింది ధర్మాసనం. విచారణలో డిప్యూటీ కలెక్టర్‌పై తీవ్రస్థాయిలో జస్టిస్ బీఆర్ గవాయ్‌మండిపడ్డారు. న్యాయస్థానం తీర్పును గౌరవించాలని, అహంభావంతో వ్యవహరించడం సరికాదని మందలించింది.

# మురళీనాయక్ వీరమరణం

>> డ్రులు శ్రీరాములు నాయక్, జ్యోతిభాయి కడుపు కోత వర్ణాతీతమన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన మురళీ నాయక్‌ను సూర్య చంద్రులు ఉన్నంత వరకూ గుర్తించుకుంటామన్నారు. మురళీ ప్రాణ త్యాగం వృథా కానివ్వబోమని, శత్రువును చిత్తుగా ఓడించి తీరుతామని తెలిపారు. పాకిస్తాన్ జరుగుతున్న ధర్మయుద్ధంలో కేంద్ర ప్రభుత్వానికి, సైనికులకు రాజకీయాలకతీతంటా అండగా ఉండాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు.వీర జవాన్ తల్లిదండ్రులు విషాదంలో ఉన్నా తమ బిడ్డ దేశం కోసం ప్రాణాలు అర్పించడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. బాధిత కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. తాను కూడా సొంతంగా రూ.5 లక్షలు చెక్కు ను అందజేసినట్లు మంత్రి సవిత తెలిపారు. మురళీ నాయక్ ధైర్య సాహసాలు భవిష్యత్తు తరాలకు తెలియాలనే లక్ష్యంతో గోరంట్ల మండలం ప్రధాన సర్కిల్ లో ఆయన విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. మురళీ నాయక్ తల్లిదండ్రులను సీఎం చంద్రబాబునాయుడు ఫోన్ లో పరామర్శించినట్లు మంత్రి సవిత తెలిపారు. మురళీ ధైర్య సాహసాలను చూసి దేశం గర్విస్తోందని, అన్ని విధాలా అండగా ఉంటామని సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చినట్లు వెల్లడించారు. మురళీ నాయక్ మృతదేహం శనివారం బెంగుళూరు నుంచి స్వగ్రామానికి వస్తుందని, ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తామని మంత్రి సవిత తెలిపారు. అంతకుముందు మురళీనాయక్ చిత్ర పటానికి మంత్రి సవిత నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్, బిజెపి మండల అధ్యక్షులు లక్ష్మీ నారాయణ, నియోజకవర్గ కన్వీనర్ బొట్టు శ్రీనివాసులు, జనసేన మండల అధ్యక్షులు సంతోష్ కుమార్, జిల్లా కార్యదర్శి సురేష్, టిడిపి మండల సీనియర్ నాయకులు బాలకృష్ణ చౌదరి, మాజీ సర్పంచ్ నరేష్, నిమ్మల శ్రీధర్, నాగేనాయక్, మాజీ సర్పంచ్ సుధాకర్ రెడ్డి, సుబ్బారెడ్డి, పచ్చ అశోక్, చింత భాస్కర్ రెడ్డి, చింత రామచంద్రారెడ్డి, జయరాం, మెడికల్ స్టోర్ శ్రీనివాసులు, పసుపులేటి శ్రీనివాసులు, షణ్ముఖ, లక్ష్మీరామ్ నాయక్, మాజీ సర్పంచ్ రవి నాయక్, జనసేన నేత గాజుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# దద్దరిల్లిన ఎల్వోసీ

>> భద్రతా బలగాలు కూడా అందుకు ధీటుగా తిప్పికొడుతున్నాయి. అమెరికానుంచి కొనుగోలుచేసిన ఎఫ్16 యుద్ధవిమానాలను భారత్ తాను రష్యానుంచి కొనుగోలుచేసిన ఎస్400 వ్యవస్థతో కూల్చి వేయడంతో పాక్ వెన్నులో వణుకుపుడుతోంది. ఇప్పటికే ఇస్లామాబాద్‌ను టార్గెట్‌చేసి దాడులు చేయడంతో పాక్ ప్రధాని షెహబాజ్‌షరీఫ్‌సైతం అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అలాగే కరాచి పోర్టుపైనా ఐఎన్ఎస్ విక్రాంత్ సాయంతో భారత్ దాడులుచేసింది. లాహోర్‌పైనా మనవద్ద ఉన్న హార్పర్ డ్రోన్లతో ఎడతెరిపి లేకుండా దాడులుచేయడంతో పాక్‌సేనలు తోకముడిచాయి. ఇక శుక్రవారంచూస్తే రాజస్థాన్‌లోని జైలస్మేర్, పోఖ్రాన్‌ప్రాంతాలతోపాటు పంజాబ్‌లోని పఠాన్‌కోట్, యూరి, ఫిరోజ్‌పూర్‌ప్రాంతాలు పాక్ లక్ష్యంగా చేసుకుంది. అలాగే హర్యానాలోని పంచకుల, అంబాలా ప్రాంతాలపైకి కూడా పాక్‌డ్రోన్లు దూసుకురావడంతో భారత్ దళాలు వెంటనే అప్రమత్తం అయి బ్లాక్‌ఔట్ ప్రకటించి తమ కార్యాచరణను ఉధృతం చేసాయి.ఎక్కడికక్కడే పాక్ డ్రోన్లను కూల్చివేసారు.ప్రత్యేకించి జమ్ముకాశ్మీర్‌లోని రాజౌరి, పూంచ్, కుప్వారా, నౌషేరా,నౌగామ్,సాంబాసెక్టార్లలో పాక్ డ్రోన్లుముంచుకురావడంతో సరిహద్దు భద్రతా దళాలు వెంటనే అప్రమత్తం అయ్యాయి.సాంబా సెక్టార్‌మీదుగా చొరబడేందుకు ప్రయత్నించిన ఏడుగురిని మన భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. పాకిస్థాన్‌తో సరిహద్దును పంచుకుంటున్న నాలుగు రాష్ట్రాల్లో భద్రతా చర్యలను పెంచేసారు. రాజస్థాన్, జమ్ముకాశ్మీర్, పంజాబ్, గుజరాత్ లలో మరింతగా భద్రతను కట్టుదిట్టంచేసారు. పగటివేళల్లోనే సైరన్లు మారుమోగడంతోప్రజలంతా ఇళ్లనుంచి బయటికి రాలేదు. రాత్రి కావడంతోనే ఈ సరిహద్దుల్లో మొత్తం విద్యుత్‌సరఫరాను నిలిపివేసి బ్లాకౌట్‌ప్రకటించడంతో భద్రతా బలగాలు ప్రతిదాడులను ముమ్మరంచేసాయి. ఫిరోజ్‌పూర్‌లోని జనావాసాలపై పాకిస్థాన్‌డ్రోన్ దాడులుచేయడంతో క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించారు. ఇక దేశవ్యాప్తంగా కీలక విమానాశ్రయాలన్నింటినీ మూసివేసారు. అలాగే అంతర్జాతీయ సంస్థలు, శ్రీహరికోట ఇస్రో వంటి అంతరిక్ష పరిశోధనా సంస్థలవద్ద భద్రతను మరింతగా పెంచారు. హోంశాఖ ఇప్పటికే సిఐఆర్ఎఫ్ సంస్థలను భద్రతాపరంగా ఎలాంటి రాజీ పడవద్దని హెచ్చరించడంతో ఈ సంస్థలవద్ద భద్రతను మరింత కట్టుదిట్టంచేసారు. దేశంలోని సరిహద్దు ఉన్న నాలుగు రాష్ట్రాల్లో మొత్తం 28కిపైగా ఎయిర్‌పోర్టులుమూసివేసారు. ఢిల్లీలో కూడా విమానసర్వీసులు నిలిపివేసారు. మొత్తం 130 విమానసర్వీసులను రద్దుచేసారు. దాడులు ముమ్మరం అవుతున్నందున వైద్యరంగంలో విశిష్టసేవలు వినియోగించుకు నేందుకు కేంద్ర ఆరోగ్యమంత్రి జెపినడ్డా తన మంత్రిత్వశాఖ పరిధిలో ఎయిమ్స్ వైద్యులు, సిబ్బంది ఉద్యోగులకు సెలవులు రద్దుచేసారు. ఆరోగ్యకారణాలపై మినహా ఎలాంటి సెలవులు ఇవ్వకూడదన్న ఆదేశాలు జారీ అయ్యాయి. ఇప్పటికే సెలవుల్లో ఉన్నవారిని వెంటనే విధుల్లో చేరాలని ఆదేశం చారు. ఈనెల 15వ తేదీ వరకూ సరిహద్దు రాష్ట్రాల్లోని ఎయిర్‌పోర్టులన్నింటినీ మూసివేస్తున్నట్లు కేంద్ర పౌరవిమానయాన శాఖప్రకటించింది. ఉత్తర, పశ్చిమ భారత్‌లోని ఎయిర్‌పోర్టులు కేంద్రఉత్తర్వులు వెలువడేంతవరకూ మూతపడ్డాయి. భారత్‌పాక్ దాడులనేపథ్యంలో అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు కేంద్ర హోంశాఖ మార్గదర్శకాలు జారీచేసింది. సివిల్ డిఫెన్స్ చట్టంలోని 11వ నిబంధనను ఉపయోగించాలని కోరింది. ఈ నిబంధనప్రకారం సైరన్‌వంటివి కొనుగోలు చేసుకోవచ్చు. అవసరం అనుకుంటే అత్యవసర అధికారాలు వినియో గించుకోవాలని సూచించింది. ఇదిలా ఉంటే పాకిస్తాన్‌కు మద్దతు ప్రకటించిన తుర్కియే, అజర్‌బైజాన్‌లకు ప్రయాణసేవలను నిలిపివేసినట్లు ట్రావెల్ సంస్థలు వెల్లడించాయి. తదుపరి ఉత్తర్వులు వెలువడేంతవరకూ ఈసేవలు నిలిపివేత అమలులో ఉంటుందని వెల్లడించాయి. తాజాగా గుజరాత్ తీరప్రాంతంలోనే కాకుండా ఇతర ప్రాంతాల్లోకూడా డ్రోన్లు, బాణాసంచా కాల్చడంపై నిషేధం విధించారు. వేడుకల్లోకూడా ఈనిషేధం అమలవుతుందని, ఈనెల 15వరకూ అందరూ పాటించాలని గుజరాత్ సీఎం భూపేంద్రపటేల్ తెలిపారు. దేశరాజ ధాని ఢిల్లీలో శుక్రవారం సైరన్లుమారుమోగాయి. ఒక్కోసైరన్ ఐదుకిలోమీటర్ల పరిధివరకూ వినిపిస్తున్నది. పలుప్రాంతాల్లో ఇప్పటికే అత్యవసర సైరన్ టెస్టింగ్ పూర్తిచేసిన అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీచేసారు. **ప్రధానిమోడీ సమీక్ష:** కాగా రెండురోజులుగా జరుగుతున్నదాడులపై ప్రధానిమోడీ అధ్యక్షతన అత్యవసర సమావేశంజరిగింది. శుక్రవారం ప్రధాని నివాసంలోజరిగిన భేటీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్, త్రివిధ దళాల అధిపతులు, జాతీయభద్రతా సలహా దారు అజిత్‌ధోబాల్‌లు పాల్గొన్నారు. దాడుల్లో భారత్ విజయవంతం కావడంపై ప్రధాని సంతృప్తి వ్యక్తంచేసారు. మరోపక్క రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ త్రివిధ దళాలు అధిప తులు,సిడిఎస్‌లతో భేటీఅయి ప్రస్తుతపరిస్థితి, భవిష్యత్ వ్యూహాలను సమీక్షించారు. ఇప్పటికే స్వతంత్ర నిర్ణయాలు తీసుకునేందుకు త్రివిధదళాలకు అనుమతినిచ్చారు. మరోపక్క కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అధ్యక్షతన కూడా కీలక సమావేశంజరిగింది.ఈ సమావేశంతర్వాత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాం తాల్లో తీసు కోవాల్సిన జాగ్రత్తలు సూచిస్తూ నోటిఫికేషన్ జారీచేసారు.అత్యవసరంగా సైరన్లు కొనుగోలుచేయాలని ఆదేశించారు.

# ఐపిఎల్ వారం వాయిదా

>> పేర్కొంది. ఐపిఎల్ 2025 న్యూ షెడ్యూల్, వేదికలపై పరిస్థితుల ఆధారంగా సమాచారం అందిస్తామని తెలిపింది. ఐపిఎల్ భాగస్వామ్యులు, ఫ్రాంఛైజీలతో చర్చించిన తర్వాతే ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సెల్ ఈ నిర్ణయం తీసుకుంది. క్లిష్ట పరిస్థితుల్లో బిసిసిఐ దేశం కోసం కచ్చితంగా నిలబడుతుంది. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న సైనికుల ధైర్యానికి, సేవకి బిసిసిఐ సెల్యూట్ చేస్తోంది. క్రికెట్‌ని దేశం మొత్తం ఆదరిస్తున్నప్పటికీ.. దేశం తర్వాతే మాకు ఏదైనా. దేశ భద్రతే మాకు చాలా ముఖ్యం. దేశానికి ఏది కావాలో అది చేయడానికి మేము ముందుంటాం అని బిసిసిఐ ప్రెస్‌నోట్‌లో పేర్కొంది. మార్చి 22న ప్రారంభమైన ఐపిఎల్ 2025 మే 25 వరకు కొనసాగాల్సి ఉంది. కానీ భారత్‌పాక్ ఉద్రిక్తతల దృష్ట్యా ప్లే ఆఫ్స్‌కు ముందే ఈ సీజన్ వాయిదా పడింది. వారం రోజులు అని బిసిసిఐ చెబుతున్నప్పటికీ.. అప్పటి పరిస్థితులను బట్టి ఐపిఎల్ నిర్వహించే దానిపై స్పష్టత వస్తుంది. యుద్ధ మేఘాలు ఇలానే ఉంటే ఐపిఎల్ 2025 మరింత వాయిదా పడే అవకాశాలు కూడా ఉన్నాయి. క్రికెట్ విశ్లేషకుల ప్రకారం ఇంగ్లండ్‌ఇండియా టెస్టు సిరీస్ తర్వాత తిరిగి ఐపిఎల్ 2025 కొనసాగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## కేంద్రమంత్రి రామ్మోహననాయుడికి వై-ప్లస్ భద్రత

**విజయవాడ,మే 9,ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడికి భద్రత పెంచారు. ఆయనకు ప్రస్తుతం వైకేటగిరి భద్రత ఉండగా దాన్ని ఇప్పుడు వై-ప్లస్ కేటగిరీకి మార్చారు. దాంతో రాష్ట్ర పోలీసుల తరపున ఇద్దరు గన్‌మెన్‌లతోపాటు మరో ఇద్దరు సీఆర్‌పీఎఫ్ అధికారులు కలిపి మొత్_ంగా ఆయన వెంట నలుగురు సిబ్బంది భద్రతగా ఉండనున్నారు. ఆ మేరకు కేంద్ర ప్రభుత్వం నియమించిన చీఫ్ సెక్యూరిటీ అధికారి,సీఆర్‌పిఎఫ్ కమాండో విధుల్లో చేరారు.

# భద్రత పెంచాలని కోరిన జగన్

**విజయవాడ,మే9,ప్రభాతవార్తప్రతినిధి:** జెడ్ ప్లస్ కేటగిరీ భద్రతపై ఏపీ హైకోర్టును ఆశ్రయించిన జగన్‌కు శుక్రవారం హైకోర్టు విచారణలో నిరాశే ఎదురయింది. తనకు ప్రాణహాని ఉందని పిటీషన్‌లో పేర్కొన్న మాజీ సీఎం ఇరువర్గాల వాదనలు విన్న కోర్టు తదుపరి విచారణ వేసవి తర్వాతకు వాయిదా చేసింది. తనకు జెడ్ ప్లస్ కేటగిరీ భద్రతను పునరుద్ధరించాలని, ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించాలని కోరుతూ ఆయన గురువారం ఏపీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం.తదుపరి విచారణను వేసవి తర్వాతకు వాయిదా వేసింది. పార్టీ ఎంపీలు,సీనియర్ నేతలు తన భద్రత విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పలు దఫాలు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు.

# తిరుమల,తిరుపతిలో హై అలర్ట్

>> కె.విజయశేఖర్ నేతృత్వంలో సిఐలు, ఎస్ఐలు, ఆక్టోపస్ బలగాలు, విజిలెన్స్ సిబ్బంది భారీసంఖ్యలో బృందాలుగా విడిపోయి బాంబుడిస్పోజల్ టీమ్స్, పోలీసు జాగిలాలు, ప్రత్యేక పోలీసు బృందాలు తనిఖీలు చేస్తున్నారు. తిరుమల అంతటా ఏకకాలంలో వందలసంఖ్యలో భద్రతా బలగాలు వేలాదిమంది యాత్రికుల కదలికలపై, లగేజీలపై డేగకన్నేసి తనిఖీలు కొనసాగిస్తున్నారు. యాత్రికులు కూడా పోలీసులకు సహకరించాలని, ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, అనుమానాస్పద వస్తువులు ఉన్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరుతున్నారు.



శ్రీహరికోట వద్ద భద్రత సిబ్బంది

# ఇస్రో కేంద్రాల వద్ద హై అలర్ట్

**శ్రీహరికోట (తడ), మే 9 ప్రభాతవార్త:** ఆపరేషన్ సింధూర్ ఒకవైపు కొనసాగుతుంటే మరోవైపు భారత్ ఇస్రో కేంద్రాల వద్ద హై అలర్ట్ ప్రకటించింది. పాకిస్తాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలోని అన్ని ముఖ్యమైన ఇస్రో కేంద్రాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఇస్రో ప్రధాన కార్యాలయం బెంగళూరుతో పాటు అంతరిక్ష ప్రయోగ కేంద్రం శ్రీహరికోట, తిరువనంతపురం, అహ్మదాబాద్ తదితర కేంద్రాల్లో భద్రతదళ సంఖ్యను పెంచారు. ప్రతి కేంద్రంలో ముఖ్యమైన ప్రాంతాల్లో స్కానింగ్, వాహన తనిఖీలు మరింత కట్టుదిట్టం చేశారు. దేశ భద్రతను కాపాడేందుకు కేంద్రప్రభుత్వం తీసుకుంటున్న ముందస్తు చర్యల్లో భాగంగా ఇస్రో కేంద్రాల వద్ద హై అలర్ట్ ప్రకటించడంతో అక్కడ పనిచేసే ఉద్యోగులు, శాస్త్రవేత్తలు సైతం అప్రమత్తంగా ఉంటున్నారు.

## ఢిల్లీలో ఎపి భవన్ స్పెషల్ కమిషనర్‌గా అర్జా శ్రీకాంత్

**విజయవాడ మే 9 ప్రభాతవార్త ప్రతినిధి:** డా.అర్జా శ్రీకాంత్ ను కూటమి ప్రభుత్వం ఢిల్లీ ఆంధ్రప్రదేశ్‌కు భవన్‌కు స్పెషల్ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.సాంస్కృతిక శాఖ పూర్వ సంచాలకులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నైపుణ్య అభివృద్ధి శాఖ సీఐవోగా అర్జా శ్రీకాంత్ గతంలో వ్యవహరించారు. ఆయనకు ఈ పదవిలో రెండేళ్లుకొనసాగుతారు. ఇక నుంచి ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ భవన్‌కు వచ్చే పార్లమెంట్ సభ్యులు, మంత్రులు, ఇతర అధికారులకు సంబంధించిన వ్యవహారాలు ఆయన చూసుకుంటారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చే వివిధ స్కీమ్స్‌ను పర్యవేక్షించి సకాలంలో రాష్ట్రానికి అందేలా చూసే బాధ్యతను అర్జాకు అప్పగించారు. ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనకు సంబంధించి వ్యవహారాలు కూడా చూసుకుంటారు. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో స్కిల్ డెవలప్మెంట్ విభాగం ద్వారా ఎందరో నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగాల బాట పట్టించి మంచి గుర్తింపు పొందారు. అంతకు ముందు సాంస్కృతిక శాఖ ద్వారా కళాకారులకు ప్రోత్సహించి దేశ విదేశాల్లో తెలుగు సాంస్కృతిక పరిమళాలు వెదజల్లారు. తన సొంత ఊరును దత్తత తీసుకుని అద్భుతంగా అభివృద్ధి చేశారు. ముఖ్యంగా వెనకబడిన యానాదులు, ఎరుకల వారి అభివృద్ధికి విశేష కృషి చేశారు. లాక్ డౌన్ సమయంలో కోవిడ్ నోడల్ అధికారిగా అప్పటి ముఖ్యమంత్రి వైయస్ జగన్ ప్రత్యేకంగా అర్జా శ్రీకాంత్‌ను నియమించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన వేలాది వలస కార్మికులను వారి సొంతూళ్లకు పంపించడంలో విశేష కృషి చేసి అభినందనలు అందుకున్నారు.

## ఢిల్లీ ఏపీ భవన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**విజయవాడ,మే9,ప్రభాతవార్తప్రతినిధి:** భారత్, పాకిస్తాన్‌లమధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రాబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఢిల్లీ లోని ఏపీ భవన్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. పాకిస్తాన్‌తో సరిహద్దు గల రాష్ట్రాలలో ఉన్న లేదా ఆ రాష్ట్రాలకు వెళుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల సౌకర్యార్థం ఈ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని సీఎం వెల్లడించారు. జమ్మూ కాశ్మీర్, లడక్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లో ఉన్న లేదా రాష్ట్రాలకు వెళుతున్న ఆంధ్రులు సమాచారం, సహాయం కొరకు నిరంతరం (24గంటలు)పనిచేసే కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చునని సీఎం చంద్రబాబునాయుడు తెలిపారు. కంట్రోల్ రూమ్‌సంప్రదించాల్సిన వివరాలు ఇలా ఉన్నాయి. **01123387089, 9871999430, 9871999053,** అదనపు సమాచారం లేదా సహాయం కొరకు ఎం.వి.ఎస్. రామారావు, డిప్యూటీ కమిషనర్ **98719 90081**, వి. సురేష్‌బాబు లైజన్ ఆఫీసర్ **9818395787.** ఈ నెంబర్లు నుంచి రోజంతా ఎప్పుడు ఫోన్ చేసిన తగిన సహకారం,సహాయత లభిస్తాయి.

# లిక్కర్ స్కాం దర్యాప్తు ముమ్మరం

>> పాల్పడ్డ ముఠా,అత్యధికంగా ఆర్డర్లు కట్టబెట్టిన మద్యం డిస్టలరీలు,సరఫరా కంపెనీల నుండి ముడుపులు తీసుకోవడమే కాకుండా కొన్ని డిస్టలరీలను గుప్పిట్లో పెట్టుకొని,వాటికి రూ.,వేల కోట్లను ఏపీఎస్‌బీసీఎల్ ద్వారా చెల్లించింది. ఆ తర్వాత ఆ డిస్టలరీల నుండి కల్పిత కంపెనీలు,అసలు ఉనికిలోనే లేని సంస్థథల ఖాతాల్లోకి భారీగా డబ్బు జమచేసింది. దీని వెనుక భారీగా మనీ లాండరింగ్ జరిగింది.ఈ నిధుల రూటింగ్‌ను ఎలా చేశారు? కల్పిత సంస్థల ఖాతాల నుండి సొత్తు ఎన్ని అంచెల్లో చివరికి ఎక్కడికి చేరింది? ఎవరికి చేరిందనే దానిపై దానిపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. అంతిమ లబ్దిదారును తేల్చనుంది. ప్రధానంగా ముడుపుల సొమ్మును హైదరాబాద్, బెంగుళూరుల్లో స్థిరాస్థి రంగంలో పెట్టుబడులు పెట్టడంతో పాటు భారీగా బంగారం రూపం లోకి మార్చినట్లు సిట్ దర్యాప్తులో గుర్తించింది. ఈ నేపథ్యంలో ఎక్కడి నుండి ఏ స్థాయిలో ముడుపులు వచ్చాయి. వాటిని ఏయే మార్గాల ద్వారా రూటింగ్ చేసి, స్థిరాస్థి సంస్థల ఖాతాల్లోకి మళ్లించారు?అనే దానిపై ఈడీ లోతుగా దర్యాప్తు చేస్తోంది.కొల్లగొట్టిన సొత్తును నేరుగా కాకుండా వివిధ దశల్లో,అనేక అంచెల్లో(మల్టీ లేయర్) అంతిమ లబ్ధిదారుకు చేరవేసేందుకు ఈ ముఠా డొల్ల కంపెనీలు, అస్మదీయ సంస్థలను ముం దుపెట్టి కథ నడిపించింది.ఓల్విక్ మల్టీవెంచర్ ప్రైవేటు లిమిటెడ్, క్రిపాటి ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేటు లిమిటెడ్,నైస్న మల్టీవెంచర్స్ ప్రైవేటు లిమిటెడ్,ట్రిఫెర్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేటు లిమిటెడ్, విక్సో ఎంటర్‌ప్రైజెస్, డీ కార్డ్ లాజిస్టిక్స్ ప్రైవేటు లిమిటెడ్, బాలాజీ ట్రేడింగ్,రుచిత జ్యుయలర్స్,మలీష్కా గోల్డ్ అండ్ జ్యూయలరీ,సన్ హాక్ ల్యాబ్స్, ఈషాన్వీ ఇన్‌ఫ్రా తదితర అనేక సంస్థలను అడ్డం పెట్టుకున్నట్లు సిట్ ఇప్పటికే తేల్చింది. ఈ నేపథ్యంలో ఆయా ఖాతాలన్నింటిపైనా ఈడీ దృష్టి పెట్టనున్నది,

# సిఎం చంద్రబాబుకు పటిష్ట భద్రత

>>లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సెక్యూరిటీ విషయంలో పటిష్ట చర్యలకు డీజీపీ ఆదేశించారు. మరింత పటిష్టంగా సీఎం చంద్రబాబు భద్రతా చర్యలు ఉండాలని ఇంటలిజెన్స్ అండ్ సెక్యూరిటీ వింగ్ అధికారులకు డీజీపీ తెలిపారు.సెక్యురిటీ ప్రొటోకాల్స్ పూర్తి స్థాయిలో అమలు చేయాలని, ఎక్కడా రాజీ పడవద్దని అధికారులకు సూచించారు. జన సమూహంలోకి ముఖ్యమంత్రి వెళుతున్న సమయంలో పాటించాల్సిన నిబంధనలు, ప్రత్యేక ఏర్పాట్లపై దృష్టి పెట్టాలని జిల్లా ఎస్పీలకు ఆదేశాలు జారీ చేశారు. భద్రతా చర్యల విషయాన్ని ఉన్నతాధికారులు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. సామాన్య ప్రజలు, కార్యకర్తలకు ఇబ్బంది కలగకుండా అవసరమైన మేర భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు సీఎం సూచించారు.

## వారం - వర్జ్యం

తేది : 10-05-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్ల పక్షం
త్రయోదశి సా.5.30
చిత్త రా.3.15
వర్జ్యం ఉ.9.33-11.21
దు.తె.5.39-ఉ.7.18
శుభసమయం :ఉ.7.50-8.30
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** నూతన పరిచయాలు పెరుగుతాయి. ఆత్మయుల నుండి శుభ ఆహ్వానాలు అందుతాయి.

**వృషభం :** ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. భూవివాదాలు తీరి నూతన ఒప్పందాలు చేసుకుంటారు.

**మిథునం:** వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.ఉద్యోగాలలో ఉత్సాహ వంతంగా ఉంటుంది. వస్తు, వస్త్రాల లాభాలు.

**కర్కాటకం:** సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి.

**సింహం:** పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**కన్య :** వ్యాపారాలలో ఒడిదుడుకులు ఎదురైన అధిగమిస్తారు. ఉద్యోగాలలో ఒత్తిడులు ఎదురై చికాకులు పెడతాయి.

**తుల :** పాతబాకీలు వసూలవుతాయి. పనులలో విజయం సాధిస్తారు. ఆస్తి వివాదాలు పరిష్కరించుకుంటారు.

**వృశ్చికం:** శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు. వృత్తి, వ్యాపారాలు మరింత విస్తరిస్తారు. వస్తులాభం.

**ధనుస్సు:** ఉద్యోగాలలో చికాకులు తొలుగుతాయి. సంతానం నాకు నూతన ఉద్యోగ, విద్యావకాశాలు పొందుతారు.

**మకరం:** ఆత్మీయులతో కలిసి ఆనందంగా గడుపుతారు. విందు, వినోదాలు, శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

**కుంభం:** వివాదాలకు దూరంగా వుండండి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి, వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**మీనం :** ఉద్యోగాలలో గందరగోళం తొలుగుతుంది. ఋణబాధలు ఎదురై చికాకులు పెడతాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



## తెలుగు జవాను మురళీ నాయక్ వీర మరణాన్ని జాతి మరచిపోదు

### - డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్

**విజయవాడ.మే9,ప్రభాతవార్తప్రతినిధి:** ఆపరేషన్ సిందూర్ లో వీర మరణం పొందిన జవాన్ మురళీ నాయక్ గారి త్యాగాన్ని భారత జాతి ఎన్నడూ మరచిపోదని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు.ఆ మేరకు డీ.సీఎంవో కార్యాలయం నుంచి ఆయన ఒక ప్రకటన విడుదల చేసారు.జమ్ము కశ్మీర్ సరిహద్దుల్లో శత్రు మూకలతో పోరాడి వీర మరణం పొందిన భారత జవాన్ మురళీ నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. శ్రీ సత్యసాయి జిల్లా కల్లి తండాకు చెందిన ఈ యువ జవాన్ దేశ రక్షణకు అంకితమై, సమర భూమిలో అమరులయ్యారు. ఈ వీరుడి తల్లితండ్రులు జ్యోతి బాయి, శ్రీరామ్ నాయక్‌లకు ఇతర కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను. రాష్ట్ర ప్రభుత్వ అన్ని విధాలా ఆ కుటుంబానికి భరోసా ఇస్తుందన్నారు. నాయక్ కుటుంబాన్ని తప్పని సరిగా తాను కలుసుకుంటానన్నారు. యుద్ధంలో అయిదుగురు శత్రుమూకలను మట్టుపెట్టిన మురళీనాయక్ నేటి తరానికి ఆదర్శనీయం., స్ఫూర్తిదాయకం కావాలన్నారు.

# చిరుధాన్యాలు ఆరోగ్యకరం



చిరుధాన్యాల స్టాల్స్‌ను పరిశీలిస్తున్న డిఆర్‌డిఏ పిడి

**- ముగిసిన శిక్షణా కార్యక్రమం**
**-హాజరైన 9 జిల్లాల మిల్లెట్స్ ఉత్పత్తుల రైతులు**

**.తొట్టంబేడు, మే 9 ప్రభాతవార్త** చిరుధాన్యాలు అంటే తెలుగులో మిల్లెట్స్ అని పేర్కొనవచ్చును ఇవి భారతదేశంలోని అనేక ప్రాంతాల్లోముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణాలో ప్రధాన ఆహారంగా ఉన్న చిన్న పోషకమై ధాన్యాల సమూహాన్ని సూచిస్తుంది ఈ చిరుధాన్యాలు వాటి ఆరోగ్య ప్రయోజనాలకు ప్రసిద్ధిచెందాయి. మరియు బియ్యానికి ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయంగా ప్రజాధరణ పొందుతున్నాయి. వీటికి సంబందించి తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణంలోని విస్తరణ శిక్షణ కేంద్రం(ఈటిసి)లో 9 జిల్లాలైన కడప, కర్నూలు, చిత్తూరు, అన్నమయ్య, సత్యసాయి, అనంతపురం, తిరుపతి, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన చిరుధాన్యాల ఉత్పత్తి దారులు రైతులు, ప్రాసెసర్లు, సెర్ప్ అధికారులు హాజరయ్యారు. రెండు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం నాటితో ముగిసింది. కార్యక్రమానికి డిఆర్‌డిఏ పిడి టిఎన్.శోభన్‌బాబు అధ్యక్షత వహించారు. చిరుధాన్యాలైన రాగులు, సజ్జలు, జొన్నలు, జొన్న ఖారీ, కొర్రలు, ఉడలు, అరికెలు, సామెల్లో పోషక విలువలకు ప్రసిద్ధిచెందిన మిల్లెట్స్ అని అన్నారు. ఈసందర్భంగా డిఆర్‌డిఏ పిడి టిఎన్.శోభన్‌బాబు మాట్లాడుతూ నేటి ప్రపంచంలో పాలిషింగ్ బియ్యం, ఇతర కల్తీ పదార్థాలు తీసుకోవడం వల్ల ప్రజలు పలురకాల ఇబ్బందులు ఎదుర్కొ వడంతో పాటు వ్యాధులకు గురవుతున్నా రనానరు. చిరుధాన్యాలతో ఆరోగ్య ప్రయోజనాలు సమృద్ధిగా ఉంటాయని తెలిపారు. చిరుధాన్యాలు ఫైబర్, ప్రొటీన్, ఐరన్, కాల్షియం, మరియు ఇతర ముఖ్యమైన ఖనిజాలు వంటి పోషకాలతో నిండి ఉంటాయన్నారు. ఇవి జీర్ణక్రియకు ఎంతో సహాయపడి మలబద్ధకాన్ని నివారిస్తుందన్నారు. రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుందన్నారు. ఇది మధుమేహం ఉన్న వారికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అంతేకాకుండా చిరుధాన్యాలలో కేలరీలు తక్కువగా మరియు ఫైబర్ ఎక్కువగా ఉంటాయి. ఇది కడుపు నిండిన భావనను పెంపొందించడానికి మరియు బరువు తగ్గడానికి సహాయపడుతుందన్నారు. చిరుధాన్యాలు ముఖ్యంగా రాగులు, బలమైన ఎముకలకు అవసరమైన కాల్షియం యొక్క మంచి మూలం అన్నారు. రెండు రోజుల పాటు జరిగిన శిక్షణ తరగతుల్లో 9 జిల్లాలకు చెందిన సుమారు 90 మంది శిక్షణా కార్యక్రమానికి హాజరవగా 40రకాల స్టాల్స్ ను ఏర్పాటు చేశారు. చిరుధాన్యాలతో తయారుచేసిన వంటకాలను రుచి చూపించారు. అంతేకాకుండా పాత్రికేయులకు కూడా అందించి రుచిచూశారు.

జి-20 సదస్సుకు హాజరైన వారికి చిరుధాన్యాల రుచికర ఆహారం:-

ఇటీవల హైదరాబాదులో జరిగిన జి-20 సదస్సుకు హాజరైన ప్రతినిధులకు మిల్లెట్స్ బ్యాంకు సీఈఓ విశాల్‌రెడ్డి, అంతర్జాతీయ న్యూట్రిషన్ స్పెషలిస్టు హిమాంసులు హాజరై వారికి చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహారపదార్థాలను తయారు చేసి అందరి మన్ననలు పొందారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని వీటిని తయారు చేయడంతో ఎక్కువ ఆదాయం పొందవచ్చన్నారు. ముఖ్యంగా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే చిరుధాన్యాల ఉత్పత్తులను ఎంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఏ పిడి శోభన్‌బాబు, ఈటిసి ప్రిన్సిపల్ నాగపద్మజ, అడిషనల్ డైరెక్టర్ సరళ, ప్రాజెక్టు మేనేజర్ బి.శ్రీనివాస్, జెపిఈ.మూర్తి, డిపిఎం లక్ష్మీహుడ్, టి.ధనంజయరెడ్డి మరియు వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన మహిళలు హాజరయ్యారు.

# సిబిఐ విచారణకు హాజరైన సజ్జల, అవినాశ్

## టిడిపి కార్యాలయంపై దాడి కేసు



మీడియాతో మాట్లాడుతున్న వైకాంగ్రెస్‌పార్టీ నేత సజ్జల

**విజయవాడ,మే 9,ప్రభాతవార్త ప్రతినిధి:**వైకాంగ్రెస్ పార్టీ నేతసజ్జల రామకృష్ణారెడ్డి సిఐడీ విచారణకు హాజరయ్యారు.వైకాపా ప్రభుత్వ హయాంలో మంగళగిరి టిడిపి కార్యాలయంపై జరిగిన దాడికి సంబంధించి ఆయనపై కేసు నమోదైంది.ఈ క్రమంలో గుంటూరు సిఐడీ ప్రాంతీయ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. సజ్జలతో పాటు దేవినేని అవినాష్ విచారణకు వచ్చారు. సిఐడీ కార్యాలయం వద్దకు మాజీ మంత్రులు అంబటి రాంబాబు,విడదల రజని,ఎంఎల్‌సీ లేళ్ళ అప్పిరెడ్డి వచ్చారు. కోర్టు రోడ్డు వద్దే సజ్జల వాహనాన్ని పోలీసులు నిలిపివేశారు. దీంతో అక్కడి నుండి సిఐడి కార్యాలయానికి ఆయన నడుచుకుంటూ వచ్చారు. విచారణ నేపథ్యంలో అక్కడ పోలీసులు మొహరించారు.విచారణ అనంతరం రాష్ట్రంలో కూటమి సర్కార్ పథకం ప్రకారం వ్యవస్థీకృత టెర్రరిజాన్ని సృష్టిస్తోందని వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర సమన్వయకర్త, పీఏసీ కన్వీనర్ సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. అసమర్థ పాలనతో ఎన్నికల హామీలను అమలు చేయలేక ప్రజల దృష్టి మళ్ళించేందుకు ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెడ్‌బుక్ రాజ్యాంగంతో తప్పుడు కేసులు పెట్టి వైయస్ఆర్‌సీపీని భయపెట్టాలనుకోవడం చంద్రబాబు అవివేకమని అన్నారు. ఇంకా ఆయనేమన్నారంటే...టీడీపీ కార్యాలయంపై దాడి కేసు ఆరోపణలపై పోలీసుల దర్యాప్తునకు సహకరించాలనే ఉద్దేశంతో బాధ్యతగల పౌరుడిగా సీఐడీ కార్యాలయానికి రావడం జరిగింది. దాడి జరిగిన సమయంలో నేను ఉప ఎన్నికల ప్రచారంలో ఉన్నాను. ఈ విషయం గతంలో విచారణకు హాజరైనప్పుడే చెప్పడం జరిగింది. ఈరోజు కూడా విచారణ సందర్భంగా నన్ను అడిగినప్పుడు మళ్లీ ఇదే విషయం చెప్పాను. దానికి సంబంధించిన ఆధారాలు గతంలోనే పోలీసులకు కూడా అందజేయడం జరిగింది. మీ సూచనల ప్రకారమే జరిగిందా అని అడినప్పుడు.. కోట్ల మంది ప్రజాభిమానం ఉన్న జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు టీడీపీ నాయకుడు పట్టాభిలాగా ఆయనను అసభ్యంగా దూషించడంపై చాలా ఆవేదన కలిగింది. ఆక్రోశం వచ్చింది. అంత అసభ్యకరంగా చెప్పలేని రీతిలో మాట్లాడినప్పుడు దీనికోసమా రాజకీయాల్లో ఉన్నాం అనే బాధ కలిగింది.దాడులకు ప్రతిదాడులే పరిష్కారం అని మాత్రం ఎప్పటికీ మేం అనుకోలేదు.

## కౌలు రైతుల సంక్షేమానికి కొత్త చట్టం చేయాలి

### సిఎంకు సిపిఐ నేతల విజ్ఞప్తి



సిఎం చంద్రబాబుకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నేతలు

**అమరావతి, మే9.,:** రాష్ట్రంలో కౌలు రైతుల సంక్షేమం కోసం సమగ్రమైన నూతన కౌలుచట్టాన్ని తీసుకురావాలని సీపీఐ నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబును సచివాలయంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ఆ పార్టీ నేతలు జల్లి విల్సన్, ముప్పాళ్ల నాగేశ్వరరావు కలిసి పలు సమస్యలపై వినతి పత్రం అందించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి,మాజీఎంఎల్ఏ రామకృష్ణ నేడు మీడియాకు వివరించారు.రాష్ట్రంలో అకాల వర్షాలకు తడిసి రంగుమారిన ధాన్యాన్ని మద్దతు ధర ప్రకారమే కొనుగోలు చేయాలని, వర్షాలకు దెబ్బతిన్న ఉద్యాన పంటలకు అందించే పరిహారాన్ని పెంచాలని సీఎం చంద్రబాబును సీపీఐ నాయకులుకోరారు. ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టే అన్నదాత పథకాన్ని సొంతభూమి లేని కౌలు రైతులకు కూడా వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలకు సేవలందిస్తున్న ఆర్డీటీకి విదేశాల నుంచి వచ్చే నిధుల వినియోగానికి సంబంధించిన ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్‌ను కేంద్రం నిలిపేసిందని, దీని పునరుద్ధరణకు చొరవ తీసుకోవాలని కోరారు. సీపీఐ నేతలు తన దృష్టికి తీసుకొచ్చిన అంశాలపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు.

## అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణను ఫోన్లో పరామర్శించిన సిఎం చంద్రబాబు



అంబికా లక్ష్మీనారాయణ( ఫైల్ ఫోటో)

**అనంతపురం, మే 9, (ప్రభాతవార్త బ్యూరో)** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఫోన్ లో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ని పరామర్శించి ధైర్యంగా వుండాలని,గాయపడిన మీ బావ మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ కు తీసుకు వెళ్ళాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లు ప్రభుత్వమే చేస్తుందని సీఎం తెలియజేసినట్లు ఎంపీ ప్రత్యేకంగా మీడియా కు తెలియజేశారు. రేపు ఉదయం రెండు చార్టెడ్ ఫ్లైట్స్ డెహ్రాడూన్ కు పంపుతామని ఒక దాంట్లో బాడీ ని,మరొకదాంట్లో పేషంట్ ని తీసుకొని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ కి రావాలని సీఎం సూచించారు. ఈ సందర్భంగా ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో అండగా నిలిచిన రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్ర బాబు నాయుడుకు సర్వదా రుణ పడి ఉంటామని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మి నారాయణ ఇతర కుటుంబ సభ్యులు తెలియజేశారు.. ఇటీవల పర్యాటక ప్రాంతాలు చూసేందుకు వెళ్లిన సందర్భంగా డెహ్రాడూన్ లో హెలికాప్టర్ కూలిన సంఘటనలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సోదరి చనిపోగా ఆయన బావ తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే.. ఈ సంఘటనపై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా ఫోన్లో ఎంపీ తో మాట్లాడడం గమనించదగ్గ విషయం..

### తెలుగు జవాన్ మురళీనాయక్ త్యాగం మరువలేనిది :హోంమంత్రి వంగలపూడి

**విజయవాడ,మే9,ప్రభాతవార్తప్రతినిధి:** దేశం కోసం ప్రాణాలను తృణప్రాయంగా వదిలేసిన తెలుగు జవాన్ మురళీనాయక్ త్యాగం మరువలేనిదిఅని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. ప్రాణం కన్నా దేశమే గొప్పదన్న ధీరత్వంతో వీరోచితంగా పోరాడిన నాయక్ త్యాగం మరువవలేనిదన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితాడకు చెందిన జవాన్ మురళీనాయక్ యుద్ధభూమిలో మరణించారన్న వార్త దిగ్భ్రాంతికి గురి చేసిందని హోంమంత్రి అన్నారు.జవాన్ మురళీ నాయక్ మృతికి ప్రగాఢ సంతాపం తెలుపుతున్నానన్నారు.అమర జవాన్ మురళీనాయక్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# జెసి ప్రభాకర్ సిఎం మధ్య ఆసక్తికర చర్చ

### జెసి అస్మిత్‌కు ఫ్రీ హ్యాండ్ ఇవ్వాలన్న సిఎం చంద్రబాబు

### సిఎంకు వెండి పళ్లెం బహూకరించిన జెసి



సిఎంకు వెండి పళ్ళెం బహుకరిస్తున్న జేసీ ప్రభాకర్ రెడ్డి, జేసీ అస్మిత్ రెడ్డిలు

**అనంతపురం, మే 9, (ప్రభాతవార్త బ్యూరో)** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం అనంతపురం జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు ఒక ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలం చాయాపురం గ్రామం వద్ద హంద్రీనీవా ప్రధాన కాలవ విస్తరణ పనులు పరిశీలించేందుకు ముఖ్యమంత్రి వచ్చారు. ఈ సందర్భంగా ఛాయాపురంలో ఏర్పాటుచేసిన హెలిపాడ్ లో సీఎంకు పలువురు జిల్లా నేతలు స్వాగతం పలికే సమయంలో తాడపత్రి మాజీ ఎమ్మెల్యే అయిన తాడపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, ప్రస్తుత తాడపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డిలు సీఎంకు వెండి పళ్లెం ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఎవరు చేయని విధంగా వినూత్న రీతిలో ముఖ్య నేతలకు వెండి పళ్లెం బహూకరించడం జెసి ప్రభాకర్ రెడ్డి తరచూ చేస్తుంటారు. అందులో భాగంగా సీఎం పర్యటనలో జెసి ప్రభాకర్ రెడ్డి, ఆయన కుమారుడు కలిశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా జేసీ ప్రభాకర్ రెడ్డితో మాట్లాడుతూ ఇక జేసీ అస్మిత్ కు ఫ్రీ హ్యాండ్ ఇవ్వకూడదా అంటూ నవ్వుతూ ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా అన్ని అభివృద్ధి కార్యక్రమాలు అస్మితే చూసుకుంటున్నారు నేను కూడా మిమ్మల్ని కలుద్దామని వచ్చానంటూ తాడపత్రి మున్సిపల్ చైర్మన్ జేసి ప్రభాకర్ రెడ్డి సీఎంతో వ్యాఖ్యానించినట్లు సమాచారం. మున్సిపల్ చైర్మన్ హోదాలో జేసీ ప్రభాకర్ రెడ్డి ఇక్కడికి వచ్చాడంటూ ఓ టిడిపి నేత సీఎంతో అన్నట్లు తెలియ వచ్చింది.

## తెలుగు జవాన్ మురళి నాయక్ కుటుంబాన్ని ఫోన్‌లో ఓదార్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**అనంతపురం, మే 09 :(ప్రభాతవార్త బ్యూరో)** దేశ సేవలో ప్రాణాలర్పించిన శ్రీ సత్య సాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల మండలం పుడగుండ్లతండా గ్రామానికి చెందిన వీర జవాన్ మురళి నాయక్ మరణం పట్ల ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మురళి నాయక్ తల్లిదండ్రులు జ్యోతిబాయి, శ్రీరామ్ నాయక్‌లతో ముఖ్యమంత్రి ఫోన్‌లో మాట్లాడి తన హృదయపూర్వక సంతాపాన్ని తెలియజేశారు. 25 ఏళ్ల చిన్న వయసులోనే మాతృభూమి కోసం ప్రాణాలర్పించిన మురళి త్యాగాన్ని దేశం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని ఆయన మృతుని కుటుంబానికి హామీ ఇచ్చారు. ధైర్యవంతుడైన కొడుకును కోల్పోయిన బాధను ఏ మాటలు తగ్గించలేవని అంగీకరిస్తూనే, ఈ క్లిష్ట సమయంలో తల్లిదండ్రులు ధైర్యంగా ఉండాలని ముఖ్యమంత్రి కోరారు.

## ఇంజినీరింగ్ ఎక్సలెన్స్‌ను ముందుకు తీసుకెళ్లడానికి కియాతో ఒప్పందం




కియా మోటార్స్‌తో తిరుపతి ఐఐటి ఒప్పదం చేసుకుంటున్న దృశ్యం

**శ్రీకాళహస్తి, మే 9 ప్రభాతవార్త** సాంకేతిక రంగంలో తనకంటూ ప్రత్యేక శైలిని ప్రదర్శించుకుంటున్న తిరుపతి ఐఐటి మరో అడుగు ముందుకేసింది. ఇంజనీరింగ్ ఎక్సలెన్స్‌ను ముందుకు తీసుకెళ్ళడానికి కియా మోటార్స్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈమేరకు శుక్రవారం ఒప్పందాలపై ఇరువర్గాలు సంతకాలు చేశాయి. దేశంలోని ప్రముఖ మాస్ ప్రీమియం కార్ల తయారీ సంస్థ అయిన కియా ఇండియా, ఇంజనీరింగ్ ఎక్సలెన్స్‌ను పెంపొందించడం, పరిశోధన-నేతృత్వంలోని ఆవిష్కరణలను ప్రోత్సహించడం మరియు ఆటోమోటివ్ మరియు ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ రంగాల్లో భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న ప్రతిభను పెంపొందించడం లక్ష్యంగా తిరుపతి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీతో అవగాహన ఒప్పందం సంతకం చేసింది. ఈముఖ్యమైన భాగస్వామ్యంలో భాగంగా తిరుపతిలోని ఐఐటిలో విద్యా మౌళిక సదుపాయాలు, సహకార పరిశోధన కార్యక్రమాలు మరియు విద్యార్థుల అభివృద్ధి చొరవలకు మద్దతు ఇవ్వడానికి కియా ఇండియా ఐదు సంవత్సరాల కాలంలో(2025-2029) రూ.35కోట్లు పెట్టుబడిని పెట్టింది. ఈ సహకారం సంస్థను అధునాతన తయారీ, ఎలక్ట్రికల్ మొబిలిటీ మరియు స్థిరమైన ఆటోమోటివ్ టెక్నాలజీలో ప్రముఖ అత్యుత్తమ కేంద్రంగా స్థాపించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ అవగాహన ఒప్పందం సహకారానికి సమగ్రమైన చట్టాన్ని వివరిస్తుంది. ఇందులో విద్యార్థుల కోసం ప్రీ ప్లేస్‌మెంట్ ఆఫర్‌లతో ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టడం ద్వారా పరిశ్రమ-విద్యాసంబంధ ఏకీకరణను సులభతరం చేయడం మరియు కియా ఇండియాలో వృత్తిపరమైన వృద్ధికి విద్యార్థులకు అర్థవంతమైన అవకాశాలను అందించడం వంటివి ఉన్నాయి. అదనంగా విద్యాపరమైన మెరిట్ మరియు ఆర్థిక అవసరాల ఆధారంగా ఎం.టెక్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు మరియు ఆర్థిక సహాయం అందించబడుతాయి. అధునాతన విద్య మరియు వనరులకు సమాన ప్రాప్యతను నిర్ధారిస్తాయి. తిరుపతి ఐఐటిలో క్రాస్ డిసిప్లీనరీ ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి రూపొందించబడిన అత్యాధునిక సహకార స్థలం అయిన అంకితమైన మేకర్స్ లాబొరేటరీని సృష్టించడం ఈ భాగస్వామ్యం యొక్క ముఖ్యాంశం. ఈ సౌకర్యం విద్యార్థులు క్రియాత్మక నమూనాలను సంభావితం చేయడానికి , రూపొందించడానికి మరియు అభివృద్ధి చేయడానికి వీలు కల్పిస్తుంది.

### 'వందేమాతరం'నినాదాన్ని సామాజిక మాధ్యమ ఖాతాల డిపీగా పెట్టుకోవాలి - మంత్రి లోకేష్

విజయవాడ,మే 9,ప్రభాతవార్త ప్రతినిధి:భారత ప్రభుత్వానికి మద్దతుగా 'వందేమాతరం'నినాదాన్ని సామాజిక మాధ్యమ ఖాతాల డిపీగా పెట్టుకోవాలని ప్రజల్ని,విద్య,ఐటీ శాఖల మంత్రి లోకేష్ కోరారు. దేశ సమగ్రతను దెబ్బతీయడానికి శత్రుశేశం కుట్రలు పన్నుతున్న వేళ అందరూ కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలవాలని ఎక్స్‌లో గురువారం ఆయన విజ్ఞప్తి చేశారు. అందుకు సంకేతంగా డీపీ పెట్టుకోవాలని,వందేమాతరం అని నినదించాలని పిలుపునిచ్చారు. వందేమాతరం లోగోను ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

### జనాభా ఆధారంగా పంచాయితీల పునర్వర్గీకరణ

**విజయవాడ,మే 9,ప్రభాతవార్త** ప్రతినిధి:ఆంధ్రప్రదేశ్ జనాభా ఆధారంగా గ్రామ పంచాయితీల పునర్వర్గీకరణ చేపట్టారు.ఇందుకు వీలుగా కలెక్టర్ల నుండి ప్రభుత్వం ప్రతిపాదనలు కోరింది. ప్రతిపాదిత గ్రేడ్ల వారీగా జిల్లాలో మొత్తం పంచాయితీలను వర్గీకరించింది.ఈ నెల 16 లోగా నివేదికలు పంపాలని పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కలెక్టర్లకు సూచించింది. ఆదాయం ఆధారంగా 2008లో పంచాయి తీలను వర్గీకరించడంతో పరిపాలన, ప్రజలకు సేవల పరంగా ఇబ్బందులు తలెత్తాయి. ఇప్పుడు జనాభా ఆధారంగా పునర్వర్గీకరణ చేపట్టాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. పంచాయితీలను స్పెషల్ గ్రేడ్‌తో పాటు 1 నుండి 3 గ్రేడ్లుగా విభజించాలని యోచిస్తోంది. ఇందుకు సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని కలెక్టర్లకు పంపింది. ఈ నెల 13న జిల్లా,డివిజనల్ పంచాయితీ అధికారులు,డిప్యూటీ ఎంపీడీవోలతో సమావేశాలు నిర్వహించి చర్చించాలని సూచిం చింది. కలెక్టర్ల నుండి వచ్చిన నివేదికలపై రాష్ట్ర స్థాయి అధి కారుల కమిటీ సమీక్షించి ప్రభు త్వానికి నివేదించనుంది. దీనిపై ఉన్నత స్థాయిలో చర్చ తర్వాత క్యాబినెట్ ఆమోదానికి పెట్టనున్నారు.

## మసులా బీచ్ ఫెస్టివల్ కు పకడ్బందీ ఏర్పాట్లు

**విజయవాడ,మే9,ప్రభాతవార్తప్రతినిధి:** మచిలీపట్టణంలో త్వరలో జరగబోయే మసులా బీచ్ ఫెస్టివల్ కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు.ఆయన కలెక్టరేట్లోని తన చాంబర్లో జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావుతో కలిసి బీచ్ ఫెస్టివల్ కు చేయవలసిన ఏర్పాట్లు, బందోబస్తు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. రేఖా చిత్రపటాన్ని పరిశీలించి ప్రదర్శనశాలలు, ఫుడ్ కోర్టులు, పార్కింగ్, బీచ్ కబాడీ, పడవ పందాలు వంటి క్రీడల నిర్వహణ, పారిశుద్ధం, జనసమూహ నిర్వహణ, తాగునీటి ఏర్పాట్లు, వైద్య శిబిరాలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలపై వారు చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ఖ్యాతిని మరింత ఇనుమడింప చేసేవిధంగా మసుల బీచ్ ఫెస్టివల్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ ఉత్సవాలకు లక్షలాది మంది ప్రజలు తరలి వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎలాంటి అసౌకర్యాలు, అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రధానంగా కార్యక్రమాలన్నీ సాయంత్రం నుంచే మొదలయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో కార్యక్రమం జరిగే ప్రాంతంతో పాటు రహదారుల వెంబడి విద్యుత్ దీపాలు ఎక్కువ మొత్తంలో ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట్ల సీసీ కెమెరాలు, పోలీస్ అవుట్ పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు.సముద్ర తీరం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ఎన్ డి ఆర్ ఎఫ్, ఎస్ డి ఆర్ ఎఫ్ బృందాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, సముద్రంలో నిర్దేశిత దూరం వరకు రక్షణ వలయాలను ఏర్పాటు చేయాలన్నారు. ఉత్సవాలను తిలకించడానికి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమృద్ధిగా తాగునీటిని ఏర్పాటు చేయడంతో పాటు, పెద్ద మొత్తంలో మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్యం నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.మసుల బీచ్ ఉత్సవాలలో పాల్గొనేందుకు వచ్చే క్రీడాకారులు, ఇతర ప్రముఖులకు కావలసిన వసతి సదుపాయాలు, అతిథి గృహాల ఏర్పాట్లకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో సహాయ కలెక్టర్ ఫరీన్ జైద్, డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, బందరు డిఎస్పి చప్పిడి రాజా, బందరు ఆర్డిఓ కే స్వాతి, మెప్మా పీడీ సాయిబాబు, తహసిల్దార్ హరినాథ్, ఈవెంట్ ఆర్గనైజర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎల్సీగా ప్రమాణం చేసిన కావలి గ్రీష్మ

**విజయవాడ,మే9,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన మండలి సభ్యురాలుగా ఇటీవల ఎంపికైన కావలి గ్రీష్మ ఎంఎల్సిగా ప్రమాణం చేశారు. శుక్రవారం రాష్ట్ర అసెంబ్లీ భవనంలోని శాసన మండలి అధ్యక్షులు చైర్మన్ కొయ్యే మోషన్ రాజు వారి చాంబరులో ఆమెతో శాసన మండలి సభ్యురాలుగా ప్రమాణం చేయించారు. అనంతరం శాసన మండలి నియమనిబంధనలకు సంబంధించిన కిట్ ను చైర్మన్ మోషేన్ రాజు ఎంఎల్సి గ్రీష్మకు అందించారు. ఈకార్యక్రమంలో గ్రీష్మ తల్లి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకరు రాష్ట్ర శాసన సభ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర,శాసన మండలి సభ్యురాలు గ్రీష్మ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రీష్మ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో దుష్టపాలన అంతమయి చంద్రబాబు నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు.ఆయన నేతృత్వంలో పనిచేసే అవకాశం లభించిందన్నారు. ప్రభుత్వ విధానాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకుని వెళ్తానన్నారు.



ఎంఎల్సీగా గ్రీష్మ మండలి అధ్యక్షులు చైర్మన్ మోషన్ రాజు సమక్షంలో సంతకం చేస్తున్న దృశ్యం

## దక్షిణాది నుంచి తూర్పు వెళ్లే రైళ్లు నెలాఖరు వరకు పొడిగింపు

**గుంతకల్లు రైల్వే,మే 9,ప్రభాతవార్త** ప్రస్తుత వేసవి సీజన్‌లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలుగు రాష్ట్రాల మీదుగా దక్షిణాది రాష్ట్రాల నుంచి తూర్పు వెళ్లే రైలు సర్వీసులను జూన్ వరకు పొడిగించినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. షాలిమార్ నుంచి చెన్నై సెంట్రల్ వెళ్లే నెంబర్ 02841ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 19నుంచి జూన్ 30వరకు పొడిగించారు. ఈ రైలు ప్రతి సోమవారం సాయంత్రం 6.30గటలకు షాలిమార్ నుంచి బయలుదేరి మంగళవారం రాత్రి 11.30గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో చెన్నై సెంట్రల్ నుంచి షాలిమార్ వెళ్లే నెంబర్ 02842ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 21నుంచి జూలై 7వరకు పొడిగించారు. ఈ రైలు ప్రతి బుధవారం తెల్లవారుజామున 4.30గంటలకు చెన్నై సెంట్రల్ నుంచి బయలుదేరి గురువారం రాత్రి 11.20గంటలకు షాలిమార్ చేరుకుంటుంది. మార్గమధ్యలో ఈ రైళ్లు తెలుగు రాష్ట్రాల్లో విజయనగరం,దువ్వాడ,రాజమండ్రి, విజయవాడ,గూడూరు స్టేషన్లతో పాటు పశ్చిమ బెంగాల్,ఒరిస్సా రాష్ట్రాలలోని ముఖ్యమైన స్టేషన్లలో నిలుస్తాయి. అలాగే సాంత్రగచ్చి నుంచి యశ్వంత్‌పూర్ వెళ్లే నెంబర్ 02863 ఏసి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 22నుంచి జూన్ 26వరకు ప్రతి గురువారం మధ్యాహ్నం 12.50గంటలకు సాంత్రగచ్చి నుంచి బయలుదేరి శనివారం తెల్లవారుజామున 12.55గంటలకు యశ్వంత్‌పూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో యశ్వంత్‌పూర్ నుంచి సాంత్రగచ్చి వెళ్లే నెంబర్ 02864ఏసీ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈనెల 24నుంచి జూన్ 28వరకు ప్రతి శనివారం తెల్లవారుజామున 4.30గంటలకు యశ్వంత్‌పూర్ నుంచి బయలుదేరి ఆదివారం మధ్యాహ్నం 1.25గంటలకు సాంత్రగచ్చి చేరుకుంటుంది. ఈ రైళ్లు మార్గమధ్యలో పలస,శ్రీకాకుళం, విజయనగరం, కొత్తవలస ,పెందుర్తి,దువ్వాడ, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు,నరసరావుపేట, మార్కాపురం, గిద్దలూరు, నంద్యాల,డోన్, గుత్తి, అనంతపురం, ధర్మవరం, హిందూపురంలతో పాటు పశ్చిమ బెంగాల్,ఒరిస్సా రాష్ట్రాలలోని ముఖ్యమైన స్టేషన్లలో నిలుస్తాయి.

వార్త

తమకు తెలీనిదానిని తెలుసనే విధంగా వ్యవహరించేవారు తమకు తెలిసిన విషయాల్ని గురించి కూడా తెలీనివారుగా పరిగణించబడతారు.

-తిరువళ్లువర్

# సముచిత నిర్ణయం

న్యాయవ్యవస్థకు చెదలు పట్టున్నాయని సందేహం వచ్చినప్పుడల్లా దాని మానమర్యాదలు కాపాడాల్సిన బాధ్యత ఆ వ్యవస్థ అత్యున్నత నిర్వాహకుల మీదనే ఉంటుంది. ఈ మధ్యనే ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో పెద్దఎత్తున కరెన్సీ కట్టలు తగులబడిఉండగా పోలీసులకు చిక్కాయి. అది జరిగిన వెంటనే ఆ జడ్జి దోషమెంత? అంత పెద్ద మొత్తంలో అంత డబ్బు ఆయన ఇంట్లోకి ఎలా వచ్చింది? ఎక్కడి నుంచి వచ్చింది? అన్న అంశాలపై దేశమంతటా చర్చనీయాంశమైనా సదరు న్యాయమూర్తిని సస్పెండ్ చేయకుండా కేవలంఅలహాబాద్ హైకోర్టుకు బదలీ చేయడం పట్ల ఎన్నో అనుమానాలు వ్యక్తమయ్యాయి. సందేహ లబ్ధి కింద సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా వెంటనే తీసుకున్న నిర్ణయాలపై అలహాబాద్ హైకోర్టు బార్అసోసియేషన్ సభ్యులు స్పందిస్తూ ఆ బదిలీపై విమర్శలు కూడాచేశారు. తమ హైకోర్టు ఏమీ 'చెత్త బుట్ట' కాదని యశ్వంత్‌వర్మను తమ హైకోర్టుకు పంపవద్దని నిరసన వ్యక్తం చేశారు. అయినా వర్మ అలహాబాద్ హైకోర్టులోనే పనిచేయాల్సి వచ్చింది. ఇలాంటి న్యాయమూర్తులు తమకు వద్దనే వద్దంటూ బార్ అసోసియేషన్ సుప్రీం కొలీజియానికి అభ్యర్థన పంపుకున్న విషయం విదితమే. తాజాగా జస్టిస్ యశ్వంత్ వర్మపై వచ్చిన నగదు కట్టలు అభియోగాలను సుప్రీంకోర్టు కమిటీ ధృవీకరించగా సుప్రీం చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా కోరగా దాన్ని వర్మ తిరస్కరించినట్లు సమాచారం. ఈ యేడాది మార్చి 14న వర్మ అధికారిక నివాసంలో అగ్ని ప్రమాదంలో భారీ ఎత్తున నగదు కట్టలు బయటపడ్డాయి. కొందరు బయట వ్యక్తులు అగ్ని మాపక ప్రమాదాన్ని నిరోధించే ప్రయత్నంలో కాలుతున్న నోట్ల కట్టలుకనపడగా పోలీసులకు సమాచారం అందించారు. ఈ అంశంపై ఆదిలోనే సీరియస్ నిర్ణయమేమీ తీసుకోకపోవడం విమర్శలకు గురైనా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా నిదానించి ఇద్దరు హైకోర్టు న్యాయమూర్తులు, జస్టిస్ అనుశివరామన్‌లతో కమిటీ నియమించింది. 50 మంది సాక్షుల వాంగ్మూలాన్ని నమోదు చేసిన అనంతరం న్యాయమూర్తిపై వచ్చిన అభియోగాలను నిర్ధారిస్తూ నివేదిక సమర్పించింది. తనపై వచ్చిన ఆరోపణలను వర్మ ఖండిస్తూనే ఉన్నారు. అభియోగాల నేపథ్యంలో బదిలీ చేసినప్పటికీ వర్మకు బాధ్యతలే కేటాయించలేదు. కాగా కమిటీ నివేదికతోపాటు న్యాయమూర్తి వర్మ సమాధానాన్ని జతపరచి రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి పంపారు. ఈ అంశంలో ఒక విధానాన్ని అనుసరించడం ద్వారా ప్రధాన న్యాయమూర్తి న్యాయవ్యవస్థ ప్రతిష్టను కాపాడే ప్రయత్నం చేస్తున్నట్లు విశదం. నివేదిక తర్వాత సిజెఐ జస్టిస్ యశ్వంత్ వర్మను రాజీనామా కోరగా ఆయన తిరస్కరించారు.

నిజానికి చెప్పాలంటే యశ్వంత్‌వర్మ ఉదంతం తర్వాతనే ఒక్కసారిగా హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల ఆస్తిపాస్తుల వివరాలను స్వచ్ఛందంగా సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో నెలరోజుల్లోగా పొందుపరచాలని సుప్రీంకోర్టు ఫుల్ బెంచ్ సమావేశంలో తీర్మానించింది. అంటే విశ్వసనీయత, పారదర్శకతతో కూడిన న్యాయవ్యవస్థను రూపొందించాలన్న తపన నేపథ్యంలోనే ఇదంతా జరిగింది. న్యాయమూర్తుల ఆస్తుల వెల్లడి ప్రక్రియ అంతకు ముందే ఉన్నా మళ్లీ ఆ వెబ్‌సైట్ పునరాగమనం సంతోషదాయకమే. కాగా రెండు రోజుల క్రితమే ఈ మేరకు న్యాయమూర్తులందరూ సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో తమ ఆస్తుల వివరాలు పొందుపరిచారు. రాబడి కన్నా ఆస్తులు ఎక్కువగా ఉన్న సందర్భాల్లో ఇతర ఉద్యోగుల వలె న్యాయమూర్తులు కూడా సంబంధిత విచారణలను ఎదుర్కోవల్సిందే. యశ్వంత్ వర్మ ఇంట్లో కి ఆ నగదు కట్టలు ప్రత్యక్షం వెనుక ప్రస్తుతంమనముందు ఎలాంటి సమాధానాలూ లేకున్నా, సాక్షాత్తూ, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి తాను పరిశీలించిన అంశాలను అవిశ్వాస తీర్మాన ప్రక్రియ కోసం రాష్ట్రపతి, ప్రధానికి ఇచ్చారంటే జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంటిలోని నోట్ల కట్టల లోగుట్టు సభ్య సమాజానికి తెలియాల్సిందే. అవి అవిశ్వాస తొలగింపు ప్రక్రియలో కానీ తెలిసే అవకాశం లేదు. న్యాయవ్యవస్థ ప్రజాస్వామ్య మూలస్తంభాలుగా చెప్పబడే వాటిలో ఒక విశిష్టస్థానంలో ఉంది కనుక అందులోని భాగస్వాములంతా చట్ట, న్యాయ పరిధిలో వ్యవహరించాల్సిందే. లేదంటే వారి మీద ఇలాంటి అభియోగాలే వస్తాయి. వాటిని ఎంతటివారైనా ముందుకొచ్చి నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాల్సిందే. ఇలాంటి అభియోగాలు వచ్చిన సందర్భాలలో న్యాయమూర్తిగా వైదొలగాలని, లేక స్వచ్ఛందంగా పదవీ విరమణ చేయడం, ఇవేమీ కానప్పుడు అవిశ్వాస తీర్మాన ప్రక్రియ ఒక్కటే శరణ్యమని న్యాయవ్యవస్థ విధి విధానాలు చెబుతున్నాయి. ఇంతక్రితం ఇలాంటివి మూడు సందర్భాల్లో న్యాయమూర్తులు తొలగింపు కోసం అభిశంసన తీర్మానాలు చేపట్టబడినవి. దేశంలో అభిశంసనను ఎదుర్కొన్న తొలి న్యాయమూర్తి జస్టిస్ సౌమిత్రా సేన్ కోర్టు రిసివర్ హోదాలో రూ.33.22 లక్షల దుర్వినియోగం చేశారన్న కమిటీ నివేదికపై అభిశంసన తీర్మానాన్ని ఎదుర్కొన్నారు. ప్రక్రియ పూర్తికాకుండానే రాజీనామా చేశారు. ఆదాయ వనరులకు మించి ఆస్తుల కూడబెట్టారన్న అభియోగాలపై పి.డి. దినకరన్ 2011లో అభిశంసన ప్రక్రియకు ముందే రాజీనామా చేశారు. 1993లో సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామస్వామిని ఆర్థిక అక్ర మాలకు పాల్పడ్డారు. ఆరోపణలపై ఆయనను దోషిగా తేల్చారు. అయితే తీర్మానం విఫలమైంది. తర్వాత న్యాయమూర్తిగా కొనసాగారు. వాస్తవాలు బయటకు పూర్తిస్థాయిలో రాకపోవడంతో పరువు దక్కింది.

సమకాలికులు ఎప్పుడూ వ్యక్తి ప్రతిభ కన్నా, వ్యక్తినే ఎక్కువగా పొగుడుతారు. ఆ తర్వాత తరంవారే ప్రతిభను గౌరవిస్తారు.



కోల్టన్

ఒక పని అంటే గాని, లేదా దానివల్ల కలిగే ఫలితాలంటే కానీ భయపడి ఆ పని చేయడాన్ని మానుకోవడం చాలా చిన్నతనం.



మహాత్మాగాంధీ

# ఉరితాడుగా మారుతున్న ఉపాధి

ప్రజాస్వామ్య పద్ధతిలో రైతులతో ఎన్నిక కావాల్సిన మార్కెట్ పాలక మండళ్లలో నామినేషన్ పద్ధతిల్లో నింపుతున్నారు. కొందరు రాజకీయ నాయకులకు పునరావాస కేంద్రాలుగా మారిపోయాయి. దీంతో అవి రైతుల అభ్యున్నతి కంటే వ్యాపారుల, దళారుల సంక్షేమానికి ఎక్కువ ప్రయోజనం చేకూర్చేలా పనిచేస్తున్నాయనే ఆరోపణలను కొట్టివేయలేము. ఇలాంటి సమస్యలెన్నో వ్యవసాయమే జీవనాధారంగా బతుకీడుస్తున్న అన్నదాతలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. చివరగా ఒక్కమాట ఎన్ని పథకాలు పెట్టినా సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందినా, మనిషి బతకడానికి ఆహారం తప్పనిసరి. ఇంత పెద్ద జనాభాకు కావాల్సిన పంటలు అన్నదాతల 'చెమట'పుణ్యమేనని గుర్తుంచుకోవాలి. రైతులు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవడం ఏ కోణంలో చూసినా దేశానికి క్షేమం కాదు.

దామెర్ల సాయిబాబ

భూమిని నమ్ముకున్నవారు ఎన్నటికీ చెడిపోరనేది పాత కాలపు నమ్మకంగా మారిపోయింది. గ్రామాల్లోఉంటూ భూమిపైనే ఆధారపడుతూ వ్యవసాయమే ఏకైక జీవనాధారంగా బతకడం ఒక శాపంగా పరిణమిస్తున్న దురదృష్టపు రోజులు దాపురించాయి. రైతు సంక్షేమమే తమ ధ్యేయమని వారి అభ్యున్నతికి ఏమి చేయడానికి అయినా వెనుకాడమని రాజకీయ పార్టీల నేతలు ఎంతగా చెబుతున్నా రైతులకు చేయూత నిచ్చేందుకు ఎన్ని కార్యక్రమాలు చేపడుతున్నా వ్యవసాయదారుల పరిస్థితి ఏమాత్రం మారడం లేదు. ఒకపక్క ప్రకృతి సహాయ నిరాకరణ, మరొకపక్క తోటి మానవుడు చేస్తున్న దోపిడీ, మోసాలతో రోజురోజుకు అన్నదాతలు కృంగిపోతున్నారు. విత్తే దగ్గర నుంచి విక్రయించేవరకు అన్నీ కష్టనష్టాలే. పంటల సాగులో పడుతున్న కష్టాల మాట అటుంచి పండించిన పంటలను అమ్ముకోవడంలో కూడా రైతులకు గగనమైపోతున్నది. ఎన్నో ఆటుపోట్లు తట్టుకొని, ఉత్పత్తులు ఇంటికి చేరితే, 'హమ్మయ్య' అనుకునే రైతులు నేడు అవి అమ్ముకోవడం కాదు కదా చివరికి డబ్బులు చేతికి వచ్చేవరకు ఎన్నో ఇబ్బందుల పాలవుతున్నారు. వాణిజ్యపంటల సాగు ఒక జూదంలా మారిపోయింది. ఈ రాష్ట్రం, ఆ రాష్ట్రం అని కాదు అన్నిరాష్ట్రాల్లోనూ రైతుల పరిస్థితి ఇందుకు విరుద్ధంగా లేదు. అటు ఆర్థికంగానూ, మానసికంగానూ కృంగిపోతున్నారు. విశ్వాసం వ్యక్తికి అద్భుతమైన ఉత్తేజాన్ని ఇస్తుంది. కార్యోన్ముఖున్ని చేస్తుంది. ఎన్ని అపజయాలు ఎదురైనా, మరెన్ని ఎదురుదెబ్బలు తగిలినా విశ్వాసం ఉన్న వ్యక్తి తొణకడు, బెదరడు. ముందుకు సాగిపోతూనే ఉంటాడు. విశ్వాసం సన్నగిల్లితే ఏ చిన్న ఎదురు దెబ్బతగిలినా తట్టుకోలేడు. తనకుతానుగా సమిధైపోతాడు. అందుకే విశ్వాసం అనేది మానవ జీవన పోరాటంలో ఎంతో ముఖ్యమైంది. ఆ విశ్వాసం దెబ్బతినే దేశవ్యాప్తంగా రైతులు ఆత్మాభిమానాన్ని చంపుకోలేక తమను ఆదుకునేవారు లేరనే నిరాశానిస్పృహలతో తమలో తాము కృంగికృశించి మరో గత్యంతరమార్గం కానరాక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఒకరు కాదు, ఇద్దరు కాదు వేలసంఖ్యలో ఆహుతైపోతున్నారు. ఎన్ని వాగ్దానాలు చేసినా ఈ మారణహోమం ఆగడంలేదు. గత రెండు నెలలుగా తెలుగు రాష్ట్రాలను వదలని వర్షాలు రైతులకు కడగండ్లు తెస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో విభిన్న వాతావరణం కొనసాగుతున్నది. ఒకపక్క మధ్యాహ్నం వరకు తీవ్ర ఎండలతో హడలెత్తించే వాతావరణం, ఆ తర్వాత సాయంత్రానికి ఈదురుగాలులు, వర్షాలు, కొన్ని ప్రాంతాల్లో వడగండ్ల వానలు కూడా బీభత్సం సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా వరి రైతుల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. కోట్లాది రూపాయలు విలువచేసే ఆరబోసిన ధాన్యం తడిసిముద్దయిపోతున్నది. ధాన్యం ఆరబోసిన రైతులు సాయంత్రం అవుతున్నదంటే గుండెల్లో దడ మొదలవుతున్నది. తెల్లవారేలోపు ఏ క్షణాన వరుణదేవుడు తన ప్రతాపాన్ని చూపుతాడోననే భయం అన్నదాతలకు కంటి మీద కునుకులేకుండాచేస్తున్నది. మరొకపక్క లారీల కొరత. సంచుల కొరత, ఎప్పుడు కాంటా (తూకం) పెడతారో తెలియని పరిస్థితుల్లో రైతులు పడుతున్న వేదన వర్ణనాతీతం. తడిసిన ధాన్యానాన్ని ఆరబోయడం సమస్యగా మారుతున్నది. ఇతర సదుపాయాల మాట దేవుడెరుగు. కనీసం మార్కెట్‌కు తెచ్చిన ధాన్యాన్ని వర్షం నుంచి కాపాడేందుకు టార్పాల్లిన్‌లను కూడా సరఫరా చేయలేని పరిస్థితుల్లో అధికార యంత్రాంగం ఉంది. ఆరుగాలం కష్టం చేసి అంతా తయారు చేసుకొని ధాన్యాన్ని మార్కెట్‌లో అమ్మకానికి కుప్పపోస్తే వర్షానికి అది కంటి ముందే నీటిపాలవుతుంటే తట్టుకోలేకపోతున్నారు. రైతులను ఇబ్బంది పెట్టవద్దని సకాలంలో ధాన్యాన్ని కొనాలని ప్రభుత్వం ఆదేశాలుఇస్తున్నా రకరకాల కారణాలతో పనులు కావడం లేదు. ఒకటి, రెండు రోజులు కాదు. ఇరవై, ముప్పై రోజులు కల్లాల్లో ధాన్యం ఆరబోసి కాపలాగాస్తున్న రైతులున్నారు. ఇక పెనుగాలులతోపాటు కురుస్తున్న అకాల వర్షాల దాటికి మొక్కజొన్న, బొప్పాయి, అరటి, మామిడి తదితర పంటలకు భారీ నష్టం వాటిల్లింది. ప్రధానంగా మామిడి, వరి రైతులకు కోలుకోలేని దెబ్బతగిలిందనే చెప్పొచ్చు. మండువేసవిలో కురుస్తున్న ఈ వర్షాల్లో మొన్న ఆదివారం ఒక్కరోజే ఆంధ్రప్రదేశ్‌లో ఏడుగురు రైతులు పిడుగుపాటుతో మరణించారు. ఇక ఉల్లిరైతుల పరిస్థితి గందరగోళంగా ఉంది. అహర్నిశలు కష్టపడి పండించిన పంటలు ఎలా అమ్ముకోవాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. నిన్న, మొన్నటివరకు యాభైనుండి, ఎనభై రూపాయల వరకు అమ్మిన ఉల్లిధర నేడు రైతుల వద్ద పది, పన్నెండు రూపాయల వరకే కొంటున్నారు. ఇందుకు పాలకుల అనాలోచిత విధానాలే కారణమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రపంచంలో నూటనలభై దేశాల్లో ఉల్లిపంట సాగు చేస్తున్నారు. దిగుబడులో సగం వాటా చైనా, భారత్‌లదే. ప్రపంచంలోని ఐదోవంతు పంట భారత్‌లోనే పండిస్తున్నారు. కానీ ధరలను నియంత్రించడంలోనే కాదు రైతుకు గిట్టుబాటు ధర ఇప్పించడంలో పాలకపెద్దలు విఫలమవుతున్నారు. దళారులదే ఇష్టారాజ్యం అవుతున్నది. మరొకపక్క ప్రపంచంలోనే దిగుబడుల్లో రెండోస్థానంలో ఉన్న భారత్ ఉత్పాదకతలో మాత్రం తొంభైవ స్థానంలో ఉంది. ఐర్లాండ్ హెక్టారుకు 67.33 టన్నులతో అగ్రస్థానంలో ఉంటే మన దేశంలో రైతులు పదిహేను టన్నులకు మించి పండించలేకపోతున్నారు. మరొకపక్క ఉల్లి వినియోగం భారత్‌లో యేడాదియేడాదికి పెరుగుతున్నది. దేశంలో తలసరి వార్షిక ఉల్లి వినియోగం 6.7 కిలోలని జాతీయ ఉల్లి, అల్లం పరిశోధనా సంస్థ గతంలో వెల్లడించింది. అయితే పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా 2050 నాటికి తలసరి వినియోగం 11.6 కిలోలకు పెరగవచ్చునని ఆ సంస్థ అంచనా వేసింది. కానీ పంట విస్తీర్ణం పెంచేందుకు నిర్దిష్టమైన, ప్రణాళికాబద్ధమైన చర్యలేమీ తీసుకోవడం లేదు. అధికార లెక్కల ప్రకారమే అప్పటికి దేశప్రజల అవసరాలు తీరాలంటే దాదాపు మూడు కోట్ల టన్నుల ఉల్లిపాయలను మన రైతులు పండించాలి. ఐరోపా, అమెరికా, దేశాల్లో వచ్చినంత ఉద్పాతకత మనదేశంలో రాకపోవడానికి రెండు ప్రధాన కారణాలున్నాయని మన వ్యవసాయ శాస్త్రవేత్తలు అంటున్నారు. దీర్ఘకాలికంగా సాగుచేసే హైబ్రీడ్ వంగడాలను ఆ దేశాల్లో రైతులకు తక్కువ ధరకు అందుతున్నాయి. పైగా ఆధునిక యంత్రాలను వాడడం వల్ల సాగు ఖర్చు కూడా ఆ దేశాల్లో తగ్గుతున్నది. మనదేశంలో అధిక దిగుబడులు ఇచ్చే హైబ్రీడ్ వంగడాలు సాధారణ రైతులకు అందుబాటులో లేవనే చెప్పొచ్చు. ఉన్నా అవి అధిక ధరలకు అమ్ముతున్నారు. ప్రోత్సాహకాలు కూడా అంతంత మాత్రమే. వీటన్నింటికంటే మించి ఉల్లిపాయల హోల్‌సేల్ వ్యాపార కేంద్రంగా ఉన్న మహారాష్ట్రలోని లాసవ్‌గామ్ మార్కెట్లోని ఈ గోల్‌మాల్ అంతా జరుగుతుందనే విమర్శలు చాలాకాలంగా ఉన్నాయి. రైతుల వద్ద ఉల్లి సరుకులున్నప్పుడు ధరలను నియంత్రించడం, ఆ తర్వాత దళారుల చేతిలోకి వెళ్లిన తర్వాత ఇష్టానుసారంగా పెంచుకునేందుకు అవకాశాలు ఇస్తున్నారనే ఆరోపణలు కొట్టివేయలేం. ఉల్లి పంటే కాదు, ఏ పంట ధర తీసుకున్నా రైతుల వద్ద పంటలున్నప్పుడు ధరలు పాతాళలోకానికి పడిపోవడం, అవి ఆ తర్వాత దళారుల చేతుల్లోకి చేరిన పిదప ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ప్రజాస్వామ్యపద్ధతిలో రైతులతో ఎన్నిక కావాల్సిన మార్కెట్ పాలకమండళ్లలో నామినేషన్ పద్ధతిల్లో నింపుతున్నారు. కొందరు రాజకీయ నాయకులకు పునరావాస కేంద్రాలుగా మారిపోయాయి. దీంతో అవి రైతుల అభ్యున్నతి కంటే వ్యాపారుల, దళారుల సంక్షేమానికి ఎక్కువ ప్రయోజనం చేకూర్చేలా పనిచేస్తున్నాయనే ఆరోపణలను కొట్టివేయలేం. ఇలాంటి సమస్యలెన్నో వ్యవసాయమే జీవనాధారంగా బతుకీడుస్తున్న అన్నదాతలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. చివరగా ఒక్కమాట ఎన్ని పథకాలు పెట్టినా సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందినా, మనిషి బతకడానికి ఆహారం తప్పనిసరి. ఇంత పెద్ద జనాభాకు కావాల్సిన పంటలు అన్నదాతల 'చెమట' పుణ్యమేనని గుర్తుంచుకోవాలి. రైతులు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవడం ఏ కోణంలో చూసినా దేశానికి క్షేమం కాదు. •

ఒక్క మాట

# పవన శక్తితో కార్బన్ ఉద్గారాల కట్టడి!

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

గాల్లో మండే శక్తిని ఇవ్వగల పదార్థాన్ని ఇంధనంగా నిర్వచిస్తాం. ఆది మానవుడి నుంచి నేటివరకు బొగ్గు, వంట చెరుకు, పెట్రోల్, డిసిల్, కిరోసిన్. వంట గ్యాసు లాంటి ఘన/ద్రవ/వాయు పదార్థాలను ఇంధనాలుగా వాడుతూ వస్తున్నాం. భూమి పొరల్లోంచి తవ్వి తీసిన బొగ్గు, పెట్రోలియం లాంటి ఉత్పత్తులను శిలాజ ఇంధనాలుగా పిలుస్తున్నాం. నేడు విద్యుత్ వినియోగమే ప్రజల జీవనాధారంగా మారిన వేళ శిలాజ ఇంధనాల కొరతతో పాటు వాటి వాడకం వల్ల జరుగుతున్న పర్యావరణ విధ్వంసం వల్ల తరిగే సాంప్రదాయ పునరుత్పాదకత సాధించలేని శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గిస్తూనే తరగని, సాంప్రదాయేతర, పునరుత్పాదక శక్తివనరుల పట్ల మానవ ఆలోచనలు వెళ్లవలసిన అగత్యం ఏర్పడింది. నేడు పునరుత్పాదక శక్తి వనరులుగా సౌర, పవన, అలల, జియోథర్మల్, హైడ్రో, బయోమాస్ లాంటివి నిలుస్తున్నాయి. గాలులు వీచినప్పుడు వచ్చే పవనాలతో గాలి మరలను లేదా విండ్ మిల్స్‌ను అమర్చి విద్యుత్తుశక్తిగా మార్చడం అనాదిగా జరుగుతూ వస్తున్నది. నెథర్‌లాండ్స్‌లో ప్రారంభమైన విండ్ మిల్స్ విప్లవం నేడు ప్రపంచ దేశాలన్నింటిలో ప్రవేశిస్తున్నది. పవన శక్తిని ఒడిసి పట్టే సునాయాస విండ్ మిల్స్ లేదా గాలి మరలకు విస్తృత ప్రచారం కలిపించడానికి ప్రతి ఏటా 10 మే రోజున జాతీయ విండ్ మిల్ లేదా గాలి మరల దినం" పాటించుట ఆనవాయితీగా మారింది. పర్యావరణ హిత, గ్రీన్, క్లీన్ ఎనర్జీగా లభిస్తున్న పవన శక్తిని విండ్ మిల్స్ ద్వారా గ్రామీణ, మునిసిపల్, ఇతర విభాగాల్లో విద్యుత్ లేదా ఇతర రూపాల్లో వాడడం కొనసాగుతున్నది. నాటి విండ్ మిల్స్‌కు సాంకేతిక సొబగులు అద్ది అత్యాధునిక విండ్ టర్బైన్స్‌ను కూడా రూపొందించి ముందుకు సాగడం జరుగుతోంది. సహజ పవన గమనాలకు అనుగుణంగా గతిశక్తిని గాలి మరలను అమర్చి పర్యావరణహిత, హరిత, శుద్ధ విద్యుత్తుశక్తిని ఉత్పత్తిచేయడం నేడు సర్వత్రా కనిపిస్తున్న దృశ్యాలు. భూతాపానికి గ్రీన్‌హౌజ్ వాయువుల ఉద్గారకాలను తగ్గించడం, కార్బన్ ఎమిషన్స్‌ను కట్టడి చేయడం, ఖర్చు తక్కువ కావడం, మేయింటెనెన్స్ సులభం కావడం, శక్తి అవసరాలను తీర్చడం, భూభాగానికి సహకరించడం, విండ్ మిల్స్ స్థాపన సులభం కావడం, ఉద్యోగాల కల్పన జరగడం లాంటి పలు ప్రయోజనాలు కలిగిన పునరుత్పాదక పవన శక్తి ఉత్పత్తితోపాటు వాడకాన్ని కూడా ప్రోత్సహించడం నేటి అవసరంగా మారింది. గాలి మరల వాడకంతో వన్యప్రాణుల సహజత్వానికి విఘాతం కలగడం, శబ్దకాలుష్యానికి కారణం కావడం, ఎత్తైన ప్రదేశాల్లో భూమి అనుకూలంగా ఉండడం లాంటి ప్రతికూలాలు ఉన్నప్పటికీ పనవ శక్తిని విద్యుత్ రూపంలోకి మార్చడం విధిగాజరగాలి. ప్రపంచవ్యాప్తంగా 80 శాతం అత్యధిక పవనశక్తిని ఉత్పత్తి చేస్తున్న ఐదుదేశాల్లో జర్మనీ, అమెరికా, డెన్మార్క్, స్పెయిన్, భారత్ ఉన్నాయి. భారత్‌లో పవనశక్తిని అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రాల జాబితాలో ఏపి, గుజరాత్, కర్ణాటక, ఎంపీ, మహారాష్ట్ర, రాజస్థాన్, తమిళనాడులు ముందున్నాయి. భారత పునరుత్పాదక శక్తి వనరుల మంత్రిత్వశాఖ లక్ష్యాల ప్రకారం 2030 నాటికి 30 జిడబ్ల్యూ పవన శక్తిని ఒడిసి పట్టడానికి ప్రణాళికలు రచిస్తున్నారు. విండ్ టర్బైన్స్ ద్వారా పవనంలో దాగిన గతి శక్తిని, తొలుత యాంత్రిక శక్తిగా మార్చడం, యాంత్రిక శక్తిని విద్యుత్తు శక్తిగా మార్చడం భారతంలో విస్తృతంగా జరుగుతున్నది. పర్యావరణ హిత, గ్రీన్, క్లీన్, తరగని, పునరుత్పాదక పవన శక్తిని వీడడం వల్ల ప్రత్యక్షంగా కార్బన్ ఉద్గారాలు తగ్గిపోయి ప్రతికూల వాతావరణ మార్పులు అదుపు చేయబడతాయి. సులభంగా, ఉచితంగా, విరివిగా అందుబాటులో ఉన్న పవన శక్తిని విద్యుత్‌గా మార్చడం వల్ల వ్యక్తిగత శక్తి స్వేచ్ఛ లభిస్తుంది. నేడు సోలార్ పవర్ ప్లాంట్ల వలె విండ్ పవర్‌ను వాడడం కూడా బహుళ ప్రచారంలోకి రావాలి. •

# ప్రజావాక్కు



## సంయమనం పాటించాలి

వివాహమైన హిందూ స్త్రీలకు సౌభాగ్య చిహ్నమైన నుదుటి మీది కుంకుమరేఖ కనుమరుగయితే జీవితం సముద్రమే. సమాజంలో అందరిలా తలెత్తుకు తిరగలేని పరిస్థితి అది. పెహల్గామ్ దాడిలో ఉగ్రవాదుల ఉన్మాద దాడిలో భర్తలను కోల్పోయిన వారిని పేపర్లలో, టి.వి.లలో చూస్తుంటే హృదయం ద్రవించక మానదు. వీరి సున్నిత హృదయా వేదన ఆపరేషన్ సింధూరమై ఉగ్రమూకలపై అగ్నివర్షం కురిపించి దాదాపు వందమందిని హతమార్చింది మన భారతదేశం. ఈదాడి కేవలం పాక్‌లోని తొమ్మిది ఉగ్రస్థావరాలపై మాత్రమే విరుచుకుపడింది. సంయమనం పాటించమనే అమెరికా తమ దేశంలో ఉగ్రదాడులు జరిగినప్పుడు ఈ సంయమనం పాటించగలిగిందా? గాయమైన వాడికేబాధఏమిటో తెలుస్తుంది.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## పాక్‌కు బుద్ధి చెప్పాలి

యుద్ధంచేయవలసిన అవసరం వచ్చినప్పుడు, గెలుస్తామా? ఓడిపోతామా? అని నిశ్చయించుకొని యుద్ధంలోకి దిగరు అనివార్యమైతేనే యుద్ధంలోకి దిగుతారు. యుద్ధం తర్వాత జరిగేది సంధి మాత్రమే. ఆ సంధి ముందుగా చేసుకుంటే యుద్ధం అనివార్యం అవుతుంది. కాశ్మీర్ విషయంలో చూస్తే ఆర్టికల్ 370రద్దుతో పాక్‌ఆక్రమిత కాశ్మీరుతోపాటు కాశ్మీరు అంతా కూడా ఒక సుందరమైన పర్యాటక రంగంగా తీర్చిదిద్ది భారతదేశానికి పర్యాటక రంగం ద్వారా ఆర్థిక పరిపుష్టి చేకూర్చాలని ప్రధాని మోడీ భావించారు. వారి ఆలోచనలు నూటికి నూరు శాతం నిజం. వారు చేసిన అకృత్యానికి భారతదేశం పాకిస్థాన్ కి బుద్ధి చెప్పవలసి వచ్చింది.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## రైళ్ల సంఖ్యను పెంచాలి

విజయవాడ నుంచి గుంతకల్లు మార్గంలో పగటిపూట చాలా తక్కువసంఖ్యలో రైళ్లనడుస్తున్నాయి. ఈ మార్గంలో ఎక్కువ రైళ్లు నడపవలసిన అవసరం ఉంది. చాలా మంది తరచు తమ పనుల నిమిత్తం విజయవాడకు వెళుతూ ఉంటారు. కావున అధిక రైళ్లు ఈ మార్గంలో నడపాలి. అలాగే పగటిపూట విజయవాడ నుంచి గుంతకల్లుకు ఎక్కువ సంఖ్య రైళ్లు నడుపుటకు చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం అరకొర రైళ్లు నడుపుతున్నారు.

-షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్

## మ్యాన్‌హోల్స్ మూతలు పెట్టాలి

దేశంలో అత్యధిక వేగవంతంగా విస్తరిస్తూ ఎన్నో రంగాల్లో ఉపాధి కల్పిస్తున్న నగరాల్లో హైదరాబాద్ ముందు ఉందని చెప్పడంలో అతిశయోక్తికాదు. ఉపాధి అవకాశాలు మెరుగుపడటంతో హైద్రాబాద్ నగరానికి వలసలు పెరిగి జనాభా పెరిగింది. జనాభా తగ్గట్టుగా గృహ వసతి లేక చాలా చోట్ల ఇరుకు గృహాల్లో నివసిస్తున్నారు. ఈ నగరంలో డ్రైనేజీ వ్యవస్థ జనాభాకు తగినట్లుగా నిర్మించుకోవలసివస్తోంది. నిజాం పాలనలో ఎన్నో తోటలు ఉండి పచ్చని ప్రదేశాలు కలిగిన ఉన్న నగరంగా ప్రసిద్ధిగాంచింది. కొద్దీ పాటి చిరువానకే ప్రజలు తల్లడిల్లుతున్నారు. పల్లపు ప్రాంతాల్లో డ్రైనేజి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం, మురికి కాల్వలమ్యాన్‌హోల్ మూత లూ లేకపోవడంవలన చాలామంది కొట్టుకొనిపోవడం జరిగింది. కావున వర్షాకాలంరాకముందే డ్రైనేజీలో పూడికతీసి, నీరుత్వరగా వెళ్లిపోయే విధంగా చర్యలు చేబడుతూ, మ్యాన్‌హోల్ మూతలూ ఉంచాలి.

-ఆళవందార్ వేణు మాధవ్, హైదరాబాద్

## వికలాంగులకు సౌకర్యాలు కల్పించాలి

విద్యాసంస్థలలోని వికలాంగులైన విద్యార్థుల యొక్క మరియు టీచింగ్ స్టాఫ్ అయినాటీచర్స్ మరియు లెక్చరర్స్ సమస్యలను తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ కొన్నింటికి మినహాయింపులు ఇవ్వాలి. మరికొన్నింటికి సౌకర్యాలు కల్పించాలి. వికలాంగులైన విద్యార్థులు చదువుకోవడానికి మామూలు విద్యార్థులతో పోటీ పడలేరు. జ్ఞాపకశక్తి తక్కువగా ఉంటుంది. వీరు పరీక్షలు రాయడానికి అరగంట సమయం అధికంగాఉంటుంది. వికలాంగులైన టీచింగ్ స్టాఫ్ రవాణా సౌకర్యాలతో సమయపాలన కొంత వేసులుబాటు ఇవ్వాలి. అంధులు టీచర్ లెక్చరర్స్‌ను చిన్న అక్షరాలు చూడలేరు. విద్యార్థుల సహకారం చాలా అవసరం. రిజల్ట్ కారణంగా కొంతమంది వికలాంగులైన టీచింగ్ స్టాఫ్ పై వివక్షత చూపుతున్నారు. షోకోజ్ నోటీసులు ఇస్తున్నారు.

-రాపాక రవీందర్, జనగాం

## ఉపాధి హామీని కొనసాగించాలి

ఉపాధి హామీపథకంలో భూమి అభివృద్ధి కార్యక్రమాన్ని కొనసాగించాలి. ఈ పనిని కొనసాగించడం వల్ల ఎక్కువ మందికి ఉపాధి హామీ పని దొరికే అవకాశం ఉంది. సాగు యోగ్యంగా తయారు అయిన తరువాత రైతులు భూమిలో పంటలు వేసుకుంటారు అటు తరవాత కూలీలకు కూడా పని దొరుకుతుంది. ఇంత బృహత్తరమైన పనిని చేయగలిగే పనుల జాబితా నుండి తీసివేయడం దుర్మార్గం.

-భారత అవినాష్, జనగామ

# తయారీ రంగ ప్రగతికి 'పీఎల్ఐ' ఓ దిక్సూచి

డి జె మోహన రావు

భారతదేశ ఆర్థిక వ్యవస్థ స్వయం సమృద్ధిని సాధించి, ప్రపంచ తయారీ రంగంలో తనదైన సుస్థిర స్థానాన్ని పొందడానికి దేశీయ తయారీ రంగాన్ని బలోపేతం చేయడం అత్యంత ముఖ్యం. ఈలక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం' (పీఎల్ఐ) ఒక వినూత్నమైన, శక్తివంతమైన ముందడుగు. 2020లో ప్రారంభించబడిన ఈ పథకం, కీలక పరిశ్రమలలో ఆవిష్కరణ, సామర్థ్యం, పోటీతత్వాన్ని ప్రోత్సహిస్తూ, భారత దేశాన్ని ప్రపంచ తయారీ కేంద్రంగా స్థాపించాలనే ప్రభుత్వ వ్యూహానికి మూలస్తంభంగా నిలుస్తోంది. ఇది స్వావలంబన వైపు ఒక వ్యూహాత్మక ముందడుగు. ఎలక్ట్రానిక్స్, వస్త్రాలు, ఫార్మా, ఆటోమొబైల్స్ వంటిరంగాలను లక్ష్యంగా చేసుకుని, అధిక ఉత్పత్తి, పెరుగుతున్న అమ్మకాల ఆధారంగా ఆర్థిక ప్రోత్సాహకాలను అందిస్తుంది. ఈ పనితీరు ఆధారిత విధానం దేశీయ, ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించడమేకాకుండా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించడానికి పరిశ్రమలను ప్రోత్సహిస్తుంది. ఇది భారత పరిశ్రమలలో నూతన ఉత్తేజాన్ని, పోటీతత్వాన్ని నింపి, 'ఆత్మనిర్భర్ భారత్' కలను సాకారం చేసే దిశగా నడిపిస్తోంది. పీఎల్ఐ పథకం వెనుక స్పష్టమైన, దీర్ఘకాలిక లక్ష్యాలున్నాయి. ప్రపంచస్థాయిమౌలిక సదుపాయాలు, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, ఎగుమతులను ప్రోత్సహించడం, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం, లక్షలాది ఉద్యోగఅవకాశాలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవడం. హైటెక్ పరిశ్రమలలో పెట్టుబడులు, దేశీయ సామర్థ్యాల బలోపేతం, ప్రపంచ పోటీతత్వం పెంపుపై దృష్టి పెడుతుంది. కీలక రంగాలైన ఎలక్ట్రానిక్స్, ఫార్మా, ఆటోమొబైల్స్, టెక్స్‌టైల్స్, ఆహార శుద్ధి, పునరుత్పాదక ఇంధన పరికరాలపై దృష్టి సారించడం ద్వారా భారతదేశాన్ని ప్రపంచస్థాయి ఉత్పత్తి కేంద్రంగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ సంకల్పం. అమ్మకాల పెరుగుదల ఆధారంగా ప్రోత్సాహకాలివ్వడంవల్ల నాణ్యత, సామర్థ్యంపై కూడా దృష్టి సారించేలా ప్రోత్సహిస్తోంది. 1.97 లక్షల కోట్ల భారీ కేటాయింపులతో పీఎల్ఐ పథకాలు 14 కీలక రంగాలపై దృష్టి సారిస్తాయి. దేశ తయారీ సామర్థ్యం, సాంకేతిక పురోగతి, ప్రపంచ మార్కెట్లలో స్థానాన్ని పెంచడానికి ఈరంగాలను వ్యూహాత్మకంగా ఎంచుకున్నారు. దేశీయ ఉత్పత్తిని బలోపేతం చేయడం, ఎగుమతులను విస్తరించడం, ఆత్మనిర్భర్ భారత్ విస్తృత దార్శనికతకు ఇవి దోహదపడతాయి. ప్రారంభించిన అనతి కాలంలోనే పీఎల్ఐ పథకం ఆశాజనకమైన ఫలితాలనుచూపింది. 1.97 లక్షల కోట్ల భారీ కేటాయింపులకు గాను, ఆగస్టు 2024 నాటికి 1.46 లక్షల కోట్ల వాస్తవ పెట్టుబడులు వచ్చాయి. ఇది త్వరలోనే 2 లక్షల కోట్లు దాటుతుందని అంచనా. ఈ పెట్టుబడులు 12.50 లక్షల కోట్ల అదనపు ఉత్పత్తి లేదా



అమ్మకాలకు దారితీశాయి. సుమారు 9.5 లక్షల ఉద్యోగాలు సృష్టించబడ్డాయి (త్వరలో 12 లక్షలకు పెరుగుతుందని అంచనా). ఎలక్ట్రానిక్స్, ఫార్మా, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి కీలక రంగాల వల్ల ఎగుమతులు 4లక్షల కోట్లను అధిగమించాయి. దేశీయ పరిశ్రమల వేగవంతమైన వృద్ధి, భారతీయ ఉత్పత్తుల ప్రపంచ పోటీతత్వం, ఉద్యోగ కల్పనలో పథకం విజయం స్పష్టంగా కనిపిస్తుంది. మొబైల్ ఫోన్ల తయారీలో విలువ జోడింపు కేవలం మూడేళ్లలో 20శాతానికిపెరిగింది. ప్రభుత్వం 2025-26లో కీలక రంగాలకు బడ్జెట్ కేటాయింపులను భారీగా పెంచింది. (ఎలక్ట్రానిక్స్, ఐటి, హార్డ్‌వేర్, ఆటోమొబైల్స్, టెక్స్‌టైల్స్ వంటివి), దేశీయ తయారీని బలోపేతం చేయడంలో నిబద్ధతను చూపింది. తయారీ, ఆర్థిక విస్తరణను ప్రోత్సహించడానికి ప్రభుత్వం సరళీకృత ఎఫ్డిఐ విధానాన్ని ప్రవేశపెట్టింది. చాలా రంగాలు ఇప్పుడు ఆటోమేటిక్ మార్గంలో 100శాతం ఎఫ్‌డిఐని అనుమతిస్తున్నాయి. 2019-2024 మధ్యబొగ్గు, కాంట్రాక్ట్ తయారీ, భీమా, టెలికాం, అంతరిక్ష రంగాలలో ముఖ్యమైన ఎఫ్‌డిఐ సంస్కరణలు అమలుచేశారు. ఈచర్యలు ప్రపంచ పెట్టుబడిదారులను ఆకర్షించడం, సామర్థ్యాలను పెంచడం, ఉత్పత్తిని పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఫలితంగా, తయారీ రంగంలో ఎఫ్‌డిఐ ఇన్‌ఫ్లో 2004-14తో పోలిస్తే 2014-2024 మధ్య69శాతం పెరిగి165 బిలియన్లకు చేరుకుంది. పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానం ద్వారా భారత్ ప్రముఖ తయారీ గమ్యస్థానంగా బలోపేతం అవుతోంది. ముఖ్యరంగాలలో పీఎల్ఐ గణనీయమైన విజయాలు సాధించింది. ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం నికర దిగుమతిదారు నుండి మొబైల్‌ఫోన్ల నికరఎగుమతిదారుగా మారింది. దేశీయ ఉత్పత్తి, ఎగుమతులు భారీగా పెరిగాయి, ఎఫ్డిఐ254శాతం పెరిగింది. ఫార్మారంగం వాల్యూమ్‌పరంగా మూడవ అతిపెద్ద శక్తిగా ఎదిగింది, ఎగుమతులు ఉత్పత్తిలో 50శాతం వాటా కలిగిఉన్నాయి. బల్క్‌డ్రగ్స్ తయారీద్వారా దిగుమతులపై ఆధారపడటం తగ్గింది. వైద్య పరికరాల సాంకేతిక బదలీతో స్థానికఉత్పత్తి సాధ్యమైంది. ఆటోమోటివ్ పీఎల్ఐ ద్వారా లక్ష్యాన్నిమించి 67,690 కోట్ల పెట్టుబడులను ఆకర్షించి, హైటెక్ ఉత్పత్తుల ఉత్పత్తిని పెంచింది. పున రుత్పాదక శక్తి రంగంలో సౌరఫోటో వోల్టాయిక్ మాడ్యూళ్ల తయారీ సామర్థ్యాన్ని పెంచి, ఉద్యోగాల సృష్టి, దిగుమతుల తగ్గింపులక్ష్యంగా పెట్టుకుంది (రెండవవిడత 65గిగావాట్స్). టెలికాం ఉత్పత్తులలో 60శాతందిగుమతి ప్రత్యామ్నాయాన్ని సాధించింది. భారత్‌ను 4జి, 5జి పరికరాల ప్రధాన ఎగుమతిదారుగా మార్చింది. డ్రోన్ రంగం టర్నోవర్ ఏడురెట్లు పెరిగి, పెట్టుబడులు, ఉద్యోగ సృష్టితో ప్రపంచ అగ్రగామిగా నిలిచింది. పీఎల్ఐ పథకం విజయవంతంగా ఉన్నప్పటికీ, ప్రగతిని నిలకడగా కొనసాగించడానికి కొన్నిఅంశాలపైదృష్టిపెట్టాలి. ప్రోత్సాహకాల పంపిణీ వేగవంతంగా, పారదర్శకంగా జరగాలి. ప్రయోజనాలు పెద్ద కంపెనీలకే కాకుండా, ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలకు అందాలి. అంతర్జాతీయ మార్కెట్లలో'మేడ్ ఇన్ ఇండియా'కు గుర్తింపు కోసం నాణ్యతా ప్రమాణాలపై రాజీపడకూడదు. తయారీ కేంద్రంగా కాకుండా, ఆవిష్కరణల కేంద్రంగా ఎదగడానికి పరిశోధనా అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి. •

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

ప్రకాశం
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## తోపుడుబండిని అందజేసిన మండవ

**ఒంగోలు, ప్రభాతవార్త**




సూర్య శ్రీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒంగోలు కర్నూలురోడ్‌కి చెందిన క్యాన్సర్ పేషెంట్ శెట్టి ప్రమీల జీవనోపాది నిమిత్తం మండవ నటరాజ్ ఆర్థిక సహకారంతో సమకూర్చిన పండ్ల తోపుడు బండిని సూర్య శ్రీ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మండవ మురళీకృష్ణ అందించారు. ఈ సందర్భంగా మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ వైద్య, వైద్యం, జీవనోపాధి నిమిత్తం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవ సలహాదారుడు మండవ సుబ్బారావు, ట్రస్ట్ కార్యదర్శి షేక్ సర్దార్ భాష తదితరులు పాల్గొన్నారు

## వెబ్‌సైట్‌లో మార్కుల జాబితా

**ఒంగోలు టౌన్, మే 5, ప్రభాతవార్త**

పదవతరగతి పబ్లిక్ పరీక్షల మార్కుల జాబితా డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.బిఎస్ఇ.ఎపి.జిఓవి.ఇన్ వెబ్‌సైట్ లో వుంచినట్లు డిఇఓ ఎ.కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత పాఠశాల హెచ్‌యంలు వారి పాఠశాల లాగిన్ ద్వారా మార్కుల జాబితాను డౌన్ లోడ్ చేసుకుని సంతకంచేసి విద్యార్థులకు అందజేయాలని తెలిపారు. మార్కుల జాబితాలో ఏమైనా తప్పులు ఉన్నచో అడ్మిషన్స్ రిజిస్టర్ నకలు, మార్కుల మెమోను ప్రధానోపాధ్యాయులు ధృవీకరించి ఈ నెల 25వతేదీలోగా ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కార్యాలయానికి పంపాలన్నారు.









# ఇళ్ల నిర్మాణాల్లో స్పష్టమైన పురోగతి ఉండేలా పర్యవేక్షించాలి: కలెక్టర్

**ఒంగోలు, ప్రభాతవార్త**

వారాంతపు లక్ష్యాలను నిర్ధేశించుకుని ఇళ్ల నిర్మాణాల్లో స్పష్టమైన పురోగతి ఉండేలా పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. శుక్రవారం ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాల్‌లో హౌసింగ్ పథకంపై సంబంధిత అధికారులతో ఆమెప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 12వ తేదీన సామూహికంగా





గృహ ప్రవేశ కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినందున జిల్లాలో లక్ష్యం మేరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని చెప్పారు. ముఖ్యంగా ఆప్షన్ 3, పీఎం జన్ మన్ ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. పీఎం జన్ మన్ ఇళ్ల నిర్మాణంలో పురోగతిని నేరుగా ప్రధానమంత్రి కార్యాలయం నుంచి పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకునేందుకు ప్రభుత్వం అదనంగా ఆర్థిక సహాయం చేస్తున్నందున ఈ డబ్బులను కేవలం ఇళ్ల నిర్మాణాలకే లబ్ధిదారులు ఉపయోగించుకునేలా చూడాలని అధికారులకు ఈ సందర్భంగా కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఇది కేవలం హౌసింగ్ డిపార్టుమెంట్ పని అంటూ ఎంపీడీఓలు తేలికగా తీసుకుంటే ఊరుకోనని ఆమె హెచ్చరించారు. మండల స్థాయి ప్రత్యేక అధికారులు కూడా ఈ విషయంపై మరింత దృష్టి సారించాలని కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, జడ్పీ సీఈఓ చిరంజీవి, మండలాల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, ఎంపీడీఓలు, హౌసింగ్ ఈఈలు, డీఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.

**చిన్నారుల ఆధార్ కార్డులు జారీలో నిర్లక్ష్యం తగదుః**

ఆరేళ్లలోపు చిన్నారులకు ఆధార్ కార్డులు జారీ చేసేలా చూడడంలో నిర్లక్ష్యం తగదని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. సంబంధిత అధికారులతో శుక్రవారం ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాల్లో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి చిన్నారికి ఆధార్ కార్డు ఉండాలనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సైతం ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించి సమీక్షిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ దృష్ట్యా జనన ధృవీకరణ పత్రం ఉన్న చిన్నారులకు తక్షణమే ఆధార్ కార్డుల జారీ కోసం వివరాలను నమోదు చేయించాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు.

**దుర్భలమైన చిన్నారుల గుర్తింపు సర్వేను పకడ్బందీగా చేపట్టాలిః**

దుర్భలమైన(వర్నరబుల్) చిన్నారుల గుర్తింపు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. ఇలాంటి పిల్లల సమగ్ర ఎదుగుదలే లక్ష్యంగా జిల్లాలో బంగారు బాల్యం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు ఆమె చెప్పారు. శుక్రవారం సంబంధిత అధికారులతో ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాల్‌లో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బంగారు బాల్యం కార్యక్రమ లక్ష్యాన్ని పునరుద్ఘాటించారు. ఇందుకోసం దుర్భలమైన పిల్లల వివరాలను సేకరించేందుకు సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా మొబైల్, వెబ్ యాప్‌ను రూపొందించినట్లు ఆమె చెప్పారు. ఈ సమావేశంలో మండలాల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, సీడీపీఓలు పాల్గొన్నారు.






# బాబుపై గురువుల గుర్రు





**ఒంగోలు, ప్రభాతవార్త**

ఏరుదాటేదాక ఓడ మల్లన్న.. ఏరు దాటేక బోడి మల్లన్న అనే చందంగా సీఎం చంద్రబాబు వ్యవహార శైలి ఉందని ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. ఎన్నికల సమయంలో కూటమి నేతలు తమను ఆశల పల్లకిలో విహరింపచేశారని, అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది కావస్తున్నా నేటికి ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై నోరుమెదపడం లేదని ధ్వజమెత్తారు. తమకు న్యాయబద్ధంగా అందాల్సిన ఐఆర్, పీఆర్సీ, పెండింగ్ డీఎల్‌ను మాత్రమే అడుగుతున్నామని, అంతకు మించి ఎలాంటి గొంతెమ్మ కోర్కెలు, బోనస్‌లు అడగడం లేదని ఉపాధ్యాయులు అంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ 11 నెలల కాలంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెన్షనర్లకు జీతాలు ఇవ్వడం మినహా ఇంకా ఎలాంటి ఆర్థిక ప్రయోజనం చేకూర్చలేదని మండిపడ్డారు. విడుదల చేసిన నిధుల్లో 2300 కోట్లు సీపీఎస్ మ్యాచింగ్ గ్రాంట్‌కే సరిపోయిందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న డీఎఫ్, పీఎల్‌ఎఫ్‌లు విడుదల చేయడం తప్ప ఐఆర్, పీఆర్సీల ఊసే ఎత్తడం లేదని ఉద్యోగ విరమణ చేసిన వారికి న్యాయంగా అందాల్సిన డబ్బులు కూడా ప్రభుత్వం చెల్లించడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్) ఉద్యోగులను ఓటీఎస్ పరిధిలోకి తీసుకొస్తామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు స్పష్టమైన హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దీనిపై బాబు సర్కారు నేటికి నోరు మెదపడం లేదని అన్నారు. అలివిగాని హామీలతో ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు తాము ఉద్యమకార్యాచరణతో ముందుకు సాగుతున్నట్లు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తెలిపారు. సీపీఎస్ రద్దు కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనల బాట పట్టామని వారు వివరించారు. తమ న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం శుక్రవారం వారు ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అలాగే ఈనెల 12నజిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద ధర్నాకు యూటీఎఫ్ పిలుపునిచ్చింది. అలాగే ఈనెల 15వ రాష్ట్ర వ్యాప్తంగా డీఈఓ కార్యాలయం ఎదుట నిరసనలు చేపట్టనున్నట్లు యూటీఎఫ్ నాయకులు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు చెప్పినట్లు 17వజీవోను తక్షణమే రద్దు చేయాలి, ఫౌండేషన్ స్కూల్ ఆలోచనను మానుకోవాలని అన్నారు. ట్రాన్స్‌ఫర్, ప్రమోషన్లలో ఏదైనా పాఠశాలలో 50శాతం కంటే ఎక్కువ మంది ఉపాధ్యాయులు రిలీవ్ అవ్వాల్సి వస్తే నూతన డీఎస్సీ ఉపాధ్యాయులు వచ్చే దాకా అబౌవ్ 50శాతం వారు వేచి ఉండాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం 1 నుండి ఐదో తరగతి వరకు ప్రాథమిక పాఠశాలలు,1 నుండి 8వ తతరగతి వరకు ప్రాథమి కోన్నత పాఠశాలలు, 1 నుండి 5వరకు ఉన్న మోడల్, ప్రైమరీ స్కూళ్లు, 6 నుండి 10వరకు ఉన్న ఉన్నత పాఠశాలలను యధాతథంగా కొనసాగించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జనార్ధన్‌రెడ్డి, వెంకటరావులు పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలు, 12వ పీఆర్సీ, మూడు డీఏలు తక్షణమే విడుదల చేయాలని సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ, బదిలీలు, పదోన్నతుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, ఐఆర్, పీఆర్సీ, పెండింగ్ డీఏలను ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు.

## కరెంటు అంతరాయం

**కొత్తపట్నం, మే 9, ప్రభాతవార్త**



కొత్తపట్నం మండలం మడనూరు33/11 కెవి.విద్యుత్తు సబ్స్టేషన్ నందు మరమ్మత్తుల నిమిత్తం శనివారం ఉదయం 10 గంటలనుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని కొత్తపట్నం ఏఈ చంద్రకాంత్ తెలియజేశారు. మడనూరు, సబ్స్టేషన్ పరిధిలోని ఇంటి సర్వీసులు ఆక్వా సర్వీసులు మరియు అగ్రికల్ సర్వీసులకు అంతరాయము ఏర్పడుతుందని ఆయన తెలియజేశారు ఈ సబ్ స్టేషన్ నందుగల ఈతముక్కల, రాజుపాలెం ,వజ్జి రెడ్డిపాలెం, గమల్లపాలెం, గ్రామాలలో విద్యుత్ సరఫరా అంతరాయం జరుగుతుందని ఆయన తెలియజేశారు.

## ఉర్దూ పోస్టులను కొనసాగించాలి

*- ఉర్దూ భాష అభివృద్ధికి సహకరించాలి*

*- ముస్లిం ఐక్యవేదిక డిమాండ్*

**ఒంగోలు టౌన్, మే 9, ప్రభాతవార్త**

పాఠశాల పునర్నిర్మాణ ప్రక్రియలో భాగంగా విద్యాశాఖలో సంస్కరణలు ప్రతికూల ఫలితాలు తెస్తున్నాయని అనిపిస్తోంది. ఉర్దూ పాఠశాలలు నిర్వీర్యం కాకుండా చూస్తామన్న హామీ ఉన్నప్పటికి అందుకు భిన్నంగా పరిస్థితులు నెలకొన్నాయి. ఉర్దూ మీడియం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎస్‌జిటి ఉర్దూ ఉపాధ్యాయులు ఇంగ్లీష్, ఉర్దూ మీడియంలో బోధన చేసేవారు. ప్రస్తుతం ఉర్దూ ఉపాధ్యాయులను సర్‌ప్లస్‌గా చూపించి తెలుగు ఉపాధ్యాయులను నియమించడం సమస్యను తెచ్చిపెట్టిందనే. తెలుగు మీడియం పాఠశాలల్లో ఉర్దూ సెక్షన్ ఎస్‌జిటి పోస్టులను గతంలో అదనపు పోస్టుగా పరిగణించేవారు. ప్రస్తుతం అదనపు పోస్టుగా కాకుండా తెలుగు పోస్టులతో కలిపి చూడటం వల్ల ఉర్దూ చదివే విద్యార్థులు ఉన్నా ఉర్దూ ఉపాధ్యాయులను సర్‌ప్లస్‌గా చూపించడం. కనిగిరి దేవాంగనగర్ ఎంపిపిఎస్‌లో 50 మంది ముస్లిం విద్యార్థులు ఉంటే ఎస్‌జిటి ఉర్దూ పోస్టు తొలగించారు. జిల్లాలో 41 ఎస్‌జిటి పోస్టులు, ఎస్ఎ ఉర్దూ ఏడు పోస్టులను సర్‌ప్లస్‌గా చూపించడం అన్యాయమని, ఉర్దూ మీడియం విద్యార్థులు ఉర్దూ భాష చదివే అవకాశం లేకుండా చేయడం తగదని ముస్లిం ఐక్యవేదిక భావిస్తోంది. ఉర్దూ పోస్టులను యధావిధిగా కొనసాగించి ఉర్దూ భాష అభివృద్ధికి సహకరించాలని ఐక్య వేదిక నాయకులు కోరుతున్నారు.

# టిప్పర్ ఢీకొని ఎక్సైజ్ కానిస్టేబుల్ మృతి









**సంతనూతలపాడు, మే 9, ప్రభాతవార్త**

సంతనూతలపాడులోని మైనంపాడు డొంక చెరువు కట్ట సమీపంలో శుక్రవారం ఉదయం జరిగిన టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో స్కూటీపై వస్తున్న చీమకుర్తి ఎక్సైజ్ కానిస్టేబుల్ పోతిరెడ్డి వెంకట రామిరెడ్డి 51 మృతి చెందాడు. ఈ ప్రమాదంలో కానిస్టేబుల్ రామిరెడ్డి కాలు తెగి రహదారిపై పడిపోయింది. దీనికి తోడు నడుము నుజ్జయి ఒంగోలు- కర్నూలు జాతీయ రహదారి రక్తసిక్తమైంది. ఘటనా స్థలం చూపరులకు ఒళ్లుగగుర్పాటు కలిగించేలా ఉంది. అంబెలెన్స్‌లో ఎక్కించడానికి ఎవరు సాహసం చేయకపోవడంతో సంతనూతలపాడు సబ్‌ఇన్‌స్పెక్టర్ వేజెండ్ల అజయ్‌బాబు, హోమ్‌గార్డు నాయక్ ఉదాసినత చాటుకున్నారు. అంబులెన్స్ సిబ్బంది సాయంతో అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్‌కు తరలించే ప్రయత్నం చేయగా మార్గమధ్యంలోనే కానిస్టేబుల్ రామిరెడ్డి మరణించాడు.

**- ప్రమాదంలో కాలు తెగి నుజ్జయిన నడుము**

ప్రమాదం జరిగిన వెంటనే రోడ్డు మీద వాహనాలు నిలిచి పోవడంతో గందరగోళం నెలకొంది. చీమకుర్తిలో ఎక్సైస్ సర్కిల్ కార్యాలయంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ రామిరెడ్డి పని చేస్తున్నారు. ప్రకాశం జిల్లా రాచర్ల మండలం ఆకువీడు గ్రామం పోతిరెడ్డి వెంకటరామిరెడ్డి స్వగ్రామం. రామిరెడ్డి తన స్కూటీపై చీమకుర్తి నుండి ఒంగోలుకు వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. మరో అరగంట గడిస్తే గమ్యం చేరుకుంటారనగా రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కానిస్టేబుల్ రామిరెడ్డిని బలిగొంది. ఎక్సైజ్ కానిస్టేబుల్ రామిరెడ్డి తన స్కూటీపై ఒంగోలు వెళ్తూ ఈ ప్రాంతానికి చేరుకునేసరికి వెనుకగా చీమకుర్తి నుండి ఒంగోలుకు మట్టి లోడుతో వెళ్తున్న టిప్పర్ బలంగా ఇతణ్ణి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎక్సైజ్‌కానిస్టేబుల్ దుర్మరణం పాలయ్యారు. వేగంగా వచ్చిన లారీ వెనుక నుంచి ఢీ కొట్టడంతో శబ్దం వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. కర్నూల్ జాతీయ రహదారిపై ప్రమాదంచోటు చేసుకున్న సమాచారం అందుకున్న ఎస్సై అజయ్‌బాబు, పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి కర్నూల్ రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ అంతరాయాన్ని తొలగించారు. మృతి చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ రామిరెడ్డికి భార్య, ఇద్దరు కుమార్తెలు కలరు. చీమకుర్తి ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుకన్య, ఎక్సైజ్ సిబ్బంది ప్రమాద సంఘటనను పరిశీలించారు. తమతో డ్యూటీ చేసి ఒంగోలు వెళ్తున్న కానిస్టేబుల్ రామిరెడ్డి ఈ ప్రమాదంలో మృతి చెందడంతో చీమకుర్తి ఎక్సైజ్ శాఖ సిబ్బంది ఒక్క సారిగా దు:ఖ సాగరంలోకి మునిగిపోయారు. సంతనూతలపాడు సబ్ ఇన్‌స్పెక్టర్ వేజెండ్ల అజయ్‌బాబు దీనిపై కేసు నమోదు చేశారు.

## విద్యుత్ బస్సుల నిర్వహణ ఆర్‌టిసికే అప్పగించాలి

**- ఎస్‌డబ్ల్యుఎఫ్ డిమాండ్**

**ఒంగోలు టౌన్, మే 9, ప్రభాతవార్త**




విద్యుత్ బస్సుల నిర్వహణ ఆర్‌టిసికే అప్పగించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి అయ్యపరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక సంఘ కార్యాలయంలో పి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ- ప్రభుత్వం విద్యుత్ బస్సులు కొనుగోలు చేసి నిర్వహణ ప్రైవేట్ వారికి అప్పగించే యత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, మే 20న జరిగే సార్వత్రిక సమ్మెలో ఆర్‌టిసి కార్మికులు పాల్గొని ప్రభుత్వాన్ని నిలదీస్తారన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి దాసరి మల్లిఖార్జునరావు, జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, హరిబాబు, మీరావలి, సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాలం సుబ్బారావు, జి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## మర్యాదపూర్వక సమావేశం

**ఒంగోలు టౌన్, మే 5, ప్రభాతవార్త**

సిపిడిసిఎల్ డిస్కం సిఎండిగా బాధ్యతలు చేపట్టిన పి.పుల్లారెడ్డిని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 1104 ప్రాంతీయ అధ్యక్ష, కార్యదర్శులు, డిస్క ం కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నేతలు పలు సమస్యలు ప్రస్తావించగా సిఎండి స్పందిస్తూ కారుణ్య నియామకాలు చేపడతామని, డిప్లొమా అర్హత కలిగిన వారికి జెఇ కన్వర్షన్స్ పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా నుంచి డిస్కం అధ్యక్ష, కార్యదర్శులు రాచగర్ల సంజీవరావు, ఎన్.శర్మ పాల్గొనా న్నరు.



# అద్దంకిలో అపార్టుమెంట్ సంస్కృతి పట్ల ప్రజలు ఆసక్తి

*- ఇప్పటికే అద్దంకిలో 15కు పైగా అపార్టుమెంట్లలో ప్రజలు నివాసం*

*- మరో 5 అపార్టుమెంటులు నిర్మాణానికి శ్రీకారం*

*- పట్టణ సంస్కృతిని సంతరించుకుంటున్న అద్దంకి*





**అద్దంకి, మే 9, ప్రభాతవార్త**

నియోజకవర్గ కేంద్రమైన అద్దంకి నగరపంచాయతీ నుండి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయింది. అయితే అద్దంకిలో అటు పూర్తిగా, పట్టణ సంస్కృతిగాని, గ్రామీణ సంస్కృతిగాని అంటూ ఏదో ఒకసంస్కృతిలో ప్రజలు కొనసాగుతున్నారని అనుకోలేము. దీనికి అద్దంకిలో ప్రజలు ఈరెండు సంస్కృతులు మిళితమై జీవిస్తున్నారు. రాను రాను అద్దంకిలో నివసిస్తున్న ప్రజలు నిన్నా మొన్నటి వరకు, గృహ నిర్మాణాల విషయంలో స్వంత నివాస గృహలను ఏర్పాటు చేసుకోవడానికి ఆసక్తి చూపేవారు. ఇటీవల కాలంలో ఈ గృహాల నిర్మాణ విషయంలో ఇబ్బడిముబ్బడిగా వ్యయం పెరిగిపోవడం, ఒక వైపు,నిర్మాణ పనులు పర్యవేక్షణ చేయడంలో అనేక రకాల పనుల నిర్వహించే వారితో ఎదురౌతున్న సమస్యల నేపద్యంలో కాంట్రాక్టు పద్ధతిలో గృహాలు నిర్మించే వారిని ఆశ్రయించి, సంబంధిత కాంట్రాక్టుల చేత వాటిని నిర్మించుకునేలా ఆసక్తి చూపారు. అయితే రాను రాను నిర్మాణ వ్యయం ఎప్పటికప్పుడు పెరగడంతోపాటు స్థలాలరేట్లు కూడ సామాన్యులకు అందనంతగా పెరిగిపోవడంతో అపార్టుమెంటు సంస్కృతి వైపు ప్రజలు మొగ్గు చూపిస్తున్నారు. ఇదే తడవుగా బిల్డర్లు అపార్టుమెంటుల నిర్మాణం వైపు మొగ్గు చూపి అద్దంకి పట్టణంలో ఇప్పటికే 15కు పైగా అపార్టుమెంటులు అద్దంకి పట్టణంలో నిర్మించారు. ఇవి పట్టణ నలువైపులా వున్న ప్రధాన రోడ్లతో పాటు పట్టణ నడిబొడ్డులో కూడ అపార్టుమెంటులు నిర్మించారు. అద్దంకి పట్టణంలో వ్యాపారస్తులు, ఉద్యోగులు ఈఅపార్టుమెంట్లను కొనుగోలు చేయడంలో ఆసక్తి చూపిస్తున్నారు. ఈ పరిస్థితులలో ఇప్పటికే 15కు పైగా అపార్టుమెంట్లలో 500 నుండి 750కు పైగా కుటుంబాలు అపార్టుమెంట్లను కొనుగోలు చేయడం గాని, లేక అద్దెలకు నివాసం వుండటం గాని జరుగుతుంది. నెల రోజుల కాలంలోనే అద్దంకిలో మరో 5నుండి 6 అపార్టుమెంట్ల నిర్మాణానికి బిల్డర్లు శ్రీకారం చుట్టారు. అయితే స్థలాలను కొనుగోలు చేసే విషయంలో కూడ బిల్డిర్లు ఆలోచిస్తూ, స్థలాల వున్నవారితో డెవలప్‌మెంటు పేరుతో అపార్టుమెంటులను నిర్మిస్తున్నారు. స్థల యజమానికి కొంతవాట, నిర్మాణం చేస్తున్న బిల్డిర్లుకు మరికొంత వాటతో అవగాహన కుదుర్చుకొని అపార్టుమెంట్లను నిర్మిస్తున్నారు. ఇందుకు ప్రధానమైన కారణం, అద్దంకిలో స్థలాల రేట్లు ఎక్కువగా వుండటం ఒక కారణమైయితే, మెటీరియల్ రేట్లు, లేబర్ చార్జీలు, పెరిగిపోవడం మరొకారణం, దీంతో గృహాలు నిర్మించుకునే వారు ఈ పరిస్థితుల నేపద్యంలో అపార్టుమెంటు సంస్కృతివైపు మొగ్గు చూపుతున్నారు. అద్దంకిలో అపార్టుమెంటు సంస్కృతి పెరుగుతున్న నేపద్యంలో అద్దంకి పట్టణ సంస్కృతిని సంతరించుకుంటుంది.

## ఆపరేషన్ సింధూర్‌కు అద్దంకిలో సంఘీభావం



అద్దంకి, మే 9, ప్రభాతవార్త
జమ్ము కాశ్మీర్‌లో ఉగ్రవాదులు 26 మంది అమాయకులైన ప్రజలను పొట్టనబెట్టుకున్న సంఘటపై ఉగ్రమూకలను తుదముట్టించేందుకు పాకిస్తాన్‌లోని ఉగ్రవాదుల స్థావరాలపై ఆపరేషన్ సింధూర్ పేర భారతదేశం ఆపరేషన్ సింధూర్ నిర్వహించింది. దీనిపై స్పందించిన పాకిస్తాన్ భారతదేశంలోని పలు ప్రాంతాలలోని అమాయకులపై దాడులు నిర్వహించేందుకు ప్రయత్నాలు చేసింది. అదే సమయంలో భారత త్రివిధ దళాలు ఆ దాడులను సమర్ధవంతంగా ఎదుర్కొంటున్నాయి. ఈ నేపధ్యంలో అద్దంకి పట్టణంలో నందమూరి కళాపరిషత్ ఆధ్వర్యంలో త్రివిధ దళాలకు సంఘీభావం తెలిపేందుకు శుక్రవారం సాయంత్రం బంగ్లారోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు, పట్టణ ప్రజలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనవారిలో మస్తాం త్రిమూర్తులు, నాగినేని రామకృష్ణ, మాజీ సైనికులు శేషారెడ్డి, పప్పిరి వీరయ్య, సందిరెడ్డి శ్రీనివాసరావు,మండవ మురళీ సుధాకరరావు, షేక్ ఖాసీం, మహబూబ్, దివాకర్ దత్తు, రఘుచంద్, పెంట్యాల రామాంజనేయులు, శ్రీనివాసరావు, వరిటాల భరత్, జె.శ్రీనివాసరావు, పవన్, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.


## విద్యుత్ ప్రమాద బాధితులకు హనిమిరెడ్డి పరామర్శ



బల్లికురవ, మే 9, ప్రభాతవార్త
మండలంలోని కొప్పెరపాడు గ్రామంలో గత రెండు రోజుల క్రితం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నివాస గృహంతో పాటు, సామాగ్రి కూడా మొత్తం కాలిపోయి బూడిదైంది. గ్రామానికి చెందిన హను మానాయక్, అతని ఇరువురి కుమారులకు చెందిన రెండు గృహాలలో సామాగ్రి కూడా కాలిపోయింది. దాదాపు రూ.6లక్షల రూపాయలు ఆస్తి నష్టం సంభవించింది. సమాచారం అందుకున్న అద్దంకి వైకాపా ఇన్‌ఛార్జ్ హనిమిరెడ్డి శుక్రవారం హనుమానాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధితులకు ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## 33 మందికి రూ.34.77 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- రోడ్ల నిర్మాణంలో నాణ్యతపై అధికారుల పర్యవేక్షణ ఉండాలి
- పంచాయతీ రాజ్ రోడ్ల కోసం రూ.24 కోట్లతో అంచనాలు
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



బల్లికురవ, మే 9, ప్రభాతవార్త
అద్దంకి నియోజకవర్గంలోని 33 మంది లబ్ధిదారులకు రూ.34.77 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం చిలకలూరిపేట లోని తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సరే పేద ప్రజల పాలిట కూటమి ప్రభుత్వం ఆపన్న హస్తంగా నిలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూనే మరో పక్క హార్ట్, కేన్సర్, కిడ్నీ వంటి ప్రాణాంతక వ్యాధులతో బాధపడే నిరుపేద రోగులకు వైద్య ఖర్చుల భారం పడకుండా సకాలంలో సీఎంఆర్ఎఫ్ ఫండ్ కింద నిధులు విడుదల చేస్తోందని తెలిపారు. అంతే కాకుండా ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ఆపరేషన్ నిమిత్తం సమయానికి ఎల్ఓసీ అందజేస్తూ వారి ప్రాణాలను కాపాడే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఇది ప్రజల ప్రభుత్వమని, ప్రజల కష్టాల్లో అండగా నిలిచే నిజమైన మానవీయ ప్రభుత్వమని పేర్కొన్నారు. అనంతరం అద్దంకి పరిధిలో జరిగే బీటీ రోడ్ల నిర్మాణ పనులను మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరిశీలించారు. నియోజకవర్గ పరిధిలో జరిగే రోడ్ల నిర్మాణ, నాణ్యత విషయంలో అధికారుల పర్యవేక్షణ తప్పక ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా పనులు జరుగుతున్న తీరు, నాణ్యతపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు. అధికారులు రోడ్ల నాణ్యత పర్యవేక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దమ్ము చక్రాల వాహనాల వలన రోడ్లు ధ్వంసం అవుతున్నాయని అన్నారు. ఈ విషయంలో సంబంధిత ప్రాంత ప్రజలే బాధ్యతగా తీసుకుని వాహనాల రాకపోకలను కట్టడి చేయాలని కోరారు. తమ ప్రాంత రోడ్లు బాగుండాలంటే దమ్ము చక్రాల వాహనాలను రోడ్లపైకి అనుమతించకూడదని అధికారులతో పాటు స్థానికులు చూడాలన్నారు. అదే విధంగా పంచాయతీ రాజ్ రోడ్ల నిర్మాణాలకు సంబంధించి సుమారు రూ.24 కోట్లతో అంచనాలు రూపొందించి నిధుల కోసం సంబంధిత శాఖకు పంపామని మంత్రి గొట్టిపాటి వెల్లడించారు. రాబోయే రోజుల్లో అన్ని ప్రాంతాల్లోనూ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టి ప్రజలకు పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.



## వివాహ వేడుకలలో మంత్రిగారి అబ్బాయి హర్షవర్ధన్



బల్లికురవ, మే 9, ప్రభాతవార్త
బల్లికురవ మండలంలో జరిగిన పలు వివాహ కార్యక్రమాలకు మంత్రి గారి తనయుడు గొట్టిపాటి హర్షవర్ధన్ హాజరై నూతన వధూవరులకు వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. నక్కబొక్కల పాడుగ్రామంలో గంజినాగేశ్వరరావు కుమారుని వివాహం సందర్భంగా హాజరై వధూవరులను నాగాంజనేయులు, లక్ష్మీ రమ్యలకు వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా కొమ్మినేనివారిపాలెం గ్రామంలో దర్శి యల్లేశ్వరరావు, పుష్పాంజలి దంపతుల కుమారుని వివాహం సందర్భంగా హాజరై వధూవరులు త్రివేణి, కిషోర్‌బాబులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వెంట సర్పంచ్ దూళిపాళ్ల బుల్లి రామయ్య, తెలుగు యువత అధ్యక్షుడు దూళిపాళ్ల హనుమంతరావు, అధ్యక్షులు దర్శి రామస్వామి, హైకోర్టు న్యాయవాది వేల్లలచెరువు హనుమంతరావు, ఏల్చూరి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

## ముక్తేశ్వరంలో కూలిపోయిన పశువుల షెడ్లు



బల్లికురవ, మే 9, ప్రభాతవార్త
మండలంలోని ముక్తేశ్వరం పంచాయతీ పరిధిలో గురువారం రాత్రి వీచిన ఈదురు గాలులకు పశువుల షెడ్లు కూలిపోయాయి. రైస్ మిల్ ఎదురుగా తోట అంకమ్మరావుకు చెందిన షెడ్డు పూర్తిగా కూలిపోయి రేకులు కూడా ఎందుకు పనికి రాకుండా పగిలి పోయాయి. స్థానిక అభయాంజనేయస్వామి విగ్రహం వెనుక పక్కన మరో రైతుకు చెందిన పశువుల షెడ్డు కూలిపోయింది. అదే విధంగా రహదారిపై చెట్లు కూడా కూలిపోవడంతో పంచాయతీ కార్యదర్శి మీరావలి పర్యవేక్షణలో తొలగించారు. ఒక్కొక్క షెడ్డు నిర్మాణం కోసం రెండు లక్షలు ఖర్చు చేశామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తిరిగి మరలా షెడ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేయాలని రైతులు కోరుతున్నారు.

## వివాహ కార్యక్రమానికి హాజరైన హనిమిరెడ్డి



బల్లికురవ, మే 9, ప్రభాతవార్త
మండలంలోని వైదన గ్రామ సర్పంచ్ మేడా జయలక్ష్మీ మనువడు వివాహం శుక్రవారం వైదనలో జరిగింది. ఈ వివాహ కార్యక్రమానికి అద్దంకి వైకాపా ఇన్‌ఛార్జీ హనిమిరెడ్డి హాజరై నూతన వధూవరులు శివ దుర్గ బాబు, మాధవిలను ఆశీర్వదించి వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ దేవినేని కృష్ణబాబు, గాలం ప్రభాకర్, దర్శి రామకృష్ణయ్య,ఈర్తినేని పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

## కిశోరి వికాసం .. బాలిక బంగారు భవిష్యత్తుకు పునాది



పొన్నలూరు, మే 9, ప్రభాతవార్త
మండలంలోని ముప్పాళ్ళ గ్రామంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమాదేవి అధ్యక్షతన శుక్రవారం కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ఆమె మాట్లాడుతూ కిశోరి వికాసం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని, ఉజ్వల ఆరోగ్యకరమైన సాధికారిక దిశగా ఆమె వేసే అడుగుకు సమిష్టి కృషితో చేయూతనిద్దామని, 11-18 ఏళ్ల బాలికలకు విద్య ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబన మెరుగుపరచడం ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌కే శాంతి, ఆశ సీతారావమ్మ, టి.పద్మ, గోవర్ధనమ్మ, లక్ష్మీకాంతం, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాలు చట్టరీత్య నేరం



మార్టూరు, మే 9, ప్రభాతవార్త
బాల్య వివాహాలు నిర్వహిస్తే చట్టరిత్య నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.శిరీష తెలిపారు. శుక్రవారం కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా మార్టూరులోని సచివాలయం -1లో అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ బాల్య వివాహాల వలన కలిగే దుష్ప్రభావాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మహిలా పోలీసు ఏ.మాధురి, ఏఎన్ఎం కే.ప్రమీలారాణి, జి.శారద, అంగన్‌వాడీ కార్యకర్తలు పీవీ సుశీల, జే.దయమ్మ, జి.రాజ్యం, నాగజ్యోతి, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనంపై నుండి వ్యక్తికి తీవ్రగాయాలు



రాచర్ల, మే 9, ప్రభాతవార్త
ద్విచక్రవాహనం పైనుండి పడి వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని పలుగుంటిపల్లి గ్రామ బస్టాండ్ సమీపంలోని మూలమలుపు వద్ద శుక్రవారం జరిగింది. మండలంలోని యడవల్లి గ్రామానికి చెందిన తొండమల్ల రమణ అను వ్యక్తి ఐటిసి (పొగాకు) కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ అందులో భాగంగా కంభం మండలం నర్సిరెడ్డిపల్లి గ్రామంలో పొగాకు క్రయవిక్రయాలు, పొగాకు సాగు తదితర అంశాలకు సంబంధించి రైతులతో మాట్లాడేందుకు తన సహోద్యోగితో కలిసి వెళ్ళడం జరిగింది. తన కార్యక్రమాలు ముగించుకున్న అనంతరం తిరిగి తన ద్విచక్ర వాహనంపై నర్సిరెడ్డిపల్లి నుండి గిద్దలూరు వెళుతూ పలుగుంటిపల్లి బస్టాండ్ సమీపంలో మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి పడిపోవడంతో తీవ్రగాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న 108సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన రమణను గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తీసుకెళ్ళాలని సూచించారు. వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు అతనిని నంద్యాల శాంతిరామ్ వైద్యశాలకు తరలించారు. రమణ బలమైన గాయాలతో వెంటిలేటర్‌పై ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

## త్రిపురాంతకం సాగర్ కాలువ బ్రిడ్జిని పరిశీలించిన మంత్రి బిసి జనార్ధన్



త్రిపురాంతకం, మే 9 ,ప్రభాతవార్త
త్రిపురాంతకం సాగర్ కాలువపై సింగిల్ బ్రిడ్జిని డబుల్ బ్రిడ్జి చేయుటకు యర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు కూటమి ప్రభుత్వానికి గతంలో ప్రతిపాదనలు పంపడంతో శుక్రవారం తన నియోజకవర్గం నుండి విజయవాడ వెళ్తున్న రోడ్లు భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ సాగర్ కాలువ బ్రిడ్జిని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సింగిల్ బ్రిడ్జి వలన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను ఎరిక్షన్ బాబు మంత్రికి తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి బిసి జనార్ధన్ సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మేకల వలరాజ్, డిసి ప్రెసిడెంట్ దువనినేని చలమయ్య, మాజీ మండలపార్టీ అధ్యక్షులు మోటాకట్ల శ్రీనివాసరెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## శ్రీమడియాలేశ్వర ఆలయంలో రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రమ్మ ప్రత్యేక పూజలు




గిద్దలూరు, మే 9 ప్రభాతవార్త
గిద్దలూరు పట్టణంలో పర్యటించిన రాజక కార్పొరేషన్ ఛైర్మన్ సావిత్రి (అడ్వకేట్) గిద్దలూరు (రజకుల కులదైవం) శ్రీశ్రీశ్రీ మడియాలేశ్వర స్వామి దేవస్థానంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గిద్దలూరు రజక సంఘం నాయకులు శ్రీశ్రీశ్రీ మడియా లేశ్వర స్వామి ఆలయం ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఛైర్మన్ సావిత్రమ్మ మాట్లాడుతూ భారత దేశ సరిహద్దుల్లో ప్రాణాలు పణంగా పెట్టి దేశ భద్రత కోసం, ప్రజల ప్రాణాలను రక్షించడం కోసం పాకిస్తాన్‌తో తలపడుతూ పోరాటం చేసునతన్న సైనికుల కోసం మడియాలేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రజకుల అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో రజక వృత్తిదారుల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. రజకులు ఐక్యమత్యంగా ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషిచేయాలన్నారు.ఈ కార్యక్రమంలో రజకసంఘం అధ్యక్షులు పాలకవీటి బాలచెన్నయ్య,గుడి అధ్యక్షులు చలిజాముల ఖాదరయ్య,అలసందలపల్లి రామాంజనేయులు, ఆవులమంద శ్రీనివాస్, తూర్పునాటి గోపాల్, తురిమెళ్ళ సురేష్, కొమరోలు శ్రీనివాసులు, తిమ్మనపల్లి గురవయ్య, అసందలపల్లి పాండు, బూతురాజు వెంకటేశ్వర్లు, మద్దికట్ల దివాకర్, వేములపాటి శేఖర్, పొట్టిపల్లి అంకయ్య, హరికృష్ణ, సి నాగరాజు, టీచర్ సాంబశివరావు, బోయిలపల్లి కార్తిక్, బోయిలపల్లి నాగ కిరణ్, ఎడవల్లి దుర్గా ప్రసాద్, శివ, అనుగొండు జశ్వంత్, పాలకవీటి రంగయ్య, కొమరోలు సుబ్బారావు, టీచర్స్ శివశంకర్, సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## సింగరకొండ ఆలయ ముఖమండపానికి లక్ష విరాళం



అద్దంకి , మే 9, ప్రభాతవార్త
ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి రాతి ముఖమండప నిర్మాణం కొరకు బల్లికురవ మండలం వైదన గ్రామానికి చెందిన కీర్తిశేషులు యక్కల సుబ్బరాయుడు ధర్మపత్ని ధనమ్మల జ్ఞాపార్థం వారి కుమారుడు చలపతిరావు ధర్మపత్ని వెంకాయమ్మలు రు.1,00,000లు ఆలయ ఎసి తిమ్మనాయుడుకు శుక్రవారం అందజేశారు.

## మంత్రి ఆనంకు మహా కుంభాభిషేక ఆహ్వానం



అద్దంకి , మే 9,ప్రభాతవార్త
ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి రాతి ముఖ మండప ఆవిష్కరణ సందర్భంగా ఈ నెల 19న నిర్వహించే మహా కుంభాభిషేకానికి దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఆహ్వానిస్తూ ఎసి తిమ్మనాయుడు శుక్రవారం ఆహ్వానం పత్రాన్ని అందజేశారు.

## గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న కృష్ణకిశోర్ రెడ్డి



రాచర్ల, మే 9 ,ప్రభాతవార్త
మండలంలోని చోళ్ళవీడు గ్రామంలో బత్తిని రామకృష్ణ (ఎక్స్ ఆర్మీ) గృహ ప్రవేశ వేడుకలు శుక్రవారం జరిగాయి. ఈ వేడుకల్లో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సోదరుడు ముత్తుముల కృష్ణకిశోర్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన ఆయనకు రామకృష్ణవారి కుటుంబ సభ్యులు, మండల మరియు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు స్వాగతం పలికి ఆహ్వానించారు. గృహ ప్రవేశం సందగర్భంగా ఆయన పూజలు నిర్వహించి రామకృష్ణ కుటుంబ సభ్యులకు నూతన గృహప్రవేశం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు ఏర్పాటు చేసిన విందులో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం రామకృష్ణ కుటుంబ సభ్యులు కృష్ణకిశోర్ రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు కటికె యోగానంద్, రాచర్ల సొసైటీ బ్యాంకు ఛైర్మన్ గోపిరెడ్డి జీవనేశ్వర్ రెడ్డి, నాయకులు నల్లబోతుల శ్రీనివాసులు, దప్పిలి కాశిరెడ్డి, బత్తిని వెంకటేశ్వరరావు, కరిపిరెడ్డి శివారెడ్డి, బత్తిని రాజశేఖర్, జెట్టి వెంకటేశ్వర్లు, జనసేన యువనాయకుడు ఉలాపుర శివశంకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### దేశానికి వ్యతిరేకంగా పోస్టులు పెడితే చర్యలు తప్పవు : సిఐ అస్సాన్



త్రిపురాంతకం, మే 9, ప్రభాతవార్త
భారతదేశానికి వ్యతిరేకంగా, దేశ సమగ్రతను దెబ్బతీసే విధంగా ఎవరైనా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా, వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని త్రిపురాంతకం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి అస్సాన్ తెలిపారు. ఇటీవల గొల్లపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పాకిస్తాన్‌కు అనుకూలంగా, భారత దేశానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపడం జరిగిందన్నారు. తొందరపాటు చర్యల వలన యువలకుఉ తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఆయన హెచ్చరించారు. దేశ రక్షణ భద్రతలో భాగంగా యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా సర్కిల్ పరిధిలోని ఎక్కడైనా అనుమానిత వ్యక్తులు ఎవరైనా సంచరిస్తున్నట్లు కనిపిస్తే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలన్నారు.

## లేబర్ మొబిలైజేషన్ పైన ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

ఒంగోలు, ప్రభాతవార్త
ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల పురోగతితో పాటు లేబర్ మొబిలైజేషన్ పైన ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, మండల ప్రత్యేక అధికారులను ఎంపీడీఓలను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, డ్వామా అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల పురోగతిపై మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఫారం పాండ్స్ నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నందున మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు ప్రత్యేక దృష్టి సారించి నిర్ధేశించిన లక్ష్యాల మేరకు ఫారం పాండ్స్ నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. మే మాసాన్ని ఫారం పాండ్స్ మాసంగా ప్రకటించడం జరిగిందని, ఈ మాసంలో 1680 ఫారం పాండ్స్ నిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ధేశించడం జరిగిందని, ఈ నెలాఖరు నాటికి నిర్ధేశించిన లక్ష్యం మేరకు ఫారం పాండ్స్ నిర్మాణాలను పూర్తి చేసేలా మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓ దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా లేబర్ మొబిలైజేషన్ పైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో పాటు కూలీలకు రోజువారి సగటు వేతనం పెరిగేలా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. లేబర్ మొబిలైజేషన్‌లో కొనకనమిట్ల, గిద్దలూరు, రాచర్ల, కొమరోలు, వెలిగండ్ల, మండలాలు లక్ష్య సాధనలో వెనుకబడి ఉన్నాయని, సంబంధిత మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు లేబర్ మొబిలైజేషన్‌పై ప్రత్యేక దృష్టా సారించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో 1,376 పశువుల నీటి తొట్టెల నిర్మాణాలు మంజూరు కాగా, ఇప్పటి వరకు 1080 నిర్మాణాలు పూర్తి చేయడం జరిగిందని, మిగిలినవి రెండు రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ జోసెఫ్ కుమార్, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఏపీడీలు, ఏపీవోలు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

ఒంగోలు, ప్రభాతవార్త
జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలతో, మున్సిపల్ కమీషనర్లతో ముందస్తు చర్యలపై సమీక్షించి దిశానిర్ధేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కడా ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడరాదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందని, అందుకు అనుగుణంగా వేసవిలో సురక్షిత తాగునీటి సరఫరాపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తుచర్యలు చేపట్టాలన్నారు. ప్రజలందరికి రక్షిత మంచినీరు అందించేందుకు రక్షిత తాగునీటి పథకాలలోని ఫిల్టర్ బెడ్స్‌కు మరమ్మత్తులు చేయించాలన్నారు. అందుకు అవసరమైన నిధుల కోసం వెంటనే ప్రతిపాదనలు పంపాలని జిల్లా కలెక్టర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగన అధికారులను ఆదేశించారు. బోర్ వెల్స్ పూర్తి స్థాయిలో పని చేసేలా చూడాలని, అవసరమైన వాటికి మరమ్మత్తులు చేయించాలన్నారు. ఈనెల 15వ తేదీ నుండి తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేసుత్నుందున, జిల్లాలోని అన్ని గ్రామాలలో తాగునీటి వనరులను పూర్తి స్థాయిలో నింపుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడా తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ఎప్పటికప్పుడు ఓవర్ హెడ్ ట్యాంకులను, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు లను శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పంచాయతీ రాజ్, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్, జిల్లా పరిషత్ పంచాయతీ రాజ్ శాఖ అధికారులు సమన్వయంతో పని చేసి తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజల తాగునీటి అవసరాల కోసం ఒంగోలు జలశక్తి కేంద్రంలో 9618055155 టోల్‌ఫ్రీ నెంబర్‌ను కూడా ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. టోల్‌ఫ్రీ నెంబర్ అవగాహన కొరకు రూపొందించిన వాల్ స్టికర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ చిరంజీవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు, డీపీఓ వెంకట నాయుడు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల స్థితిగతులపై ప్రత్యేక సమావేశం



గిద్దలూరు, మే 9, ప్రభాతవార్త
ఎలక్షన్ కమీషన్ ఆఫ్ ఇండియా వారి ఆదేశాల మేరకు గిద్దలూరు ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి అధ్యక్షతన ప్రతి నెల మొదటి వారంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగా శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి వారి దగ్గరి నుండి వచ్చే వినతులు మరియు పోలింగ్ కేంద్రాల స్థితిగతులపై మీ దృష్టికి వచ్చిన సమస్యలను తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన ప్రజా దర్బార్‌కు 80 అర్జీలు



**సంతనూతలపాడు, మే 9, ప్రభాతవార్త**

ఒంగోలులోని సంతనూతలపాడు శాసన సభ్యులు బీఎన్ విజయ్‌కుమార్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ప్రజా దర్బార్‌కు వివిధ వర్గాల ప్రజల నుండి 80 అర్జీలుదాఖలు అయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్‌కుమార్ సమస్యలకు సంబంధించి విచ్చేసిన ప్రజల నుండి సమస్యలను తెలుసుకొని వారి నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు, చీమకుర్తి, నాగులుప్పలపాడు, మద్దిపాడు మండలాల నుండి ప్రజలు ఈ ప్రజా దర్బార్‌కు విచ్చేశారు.

## మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో

### సంతమాగులూరు మండల సమగ్రాభివృద్ధికి రు.1.6 కోట్ల నిధులు మంజూరు

**- ఏఎంసీ చైర్మన్ తేలప్రోలు రమేష్**





**సంతమాగులూరు మే 9, ప్రభాతవార్త**

రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రతిపాదనల మేరకు డీఎం ఎఫ్ నిదులనుండి సంతమాగులూరుమండల సమగ్రాభివృద్ధి లో భాగంగా పలు గ్రామాలకు సైడు కాల్వలు, సింమెంటు రోడ్ల నిర్మాణానికి రు.1.6 కోట్ల నిధులు మంజూరైనట్లు సంతమాగులూరు వ్యవసాయమార్కెట్ కమిటి చైర్మన్ తేలప్రోలు రమేష్, మండల టీడీపీ నాయకులు చేవూరి వాసురెడ్డిలు తెలిపారు. గ్రామాల వారిగా చవటిపాలెం గ్రామానికి రు. 10 లక్షలు, కొమా మ్రలపాడు గ్రామానికి రు. 20 లక్షలు, కొప్పరం గ్రామానికి రు. 20 లక్షలు, కుందుర్రు గ్రామానికి రు. 30 లక్షలు, పరిటాలవారిపాలెం గ్రామానికి రు.10 లక్షలు, సజ్జాపురం గ్రామానికి రు. 20 లక్షలు, పాతమాగులూరు గ్రామానికి రు.20 లక్షలు, ఏల్చూరు గ్రామానికి రు. 30 లక్షలు జిల్లా కలెక్టర్ నిదులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు రమేష్ తెలిపారు. ఈ పనులన్నీ శాస్వత పనులకు మాత్రమే కేటాయించడం జరిగిందని తద్వారా ఆయ ఆగ్రామాలు సమగ్రాభివృద్ధి చెందుతాయాని ఆయన తెలిపారు.

## కామేపల్లిలో కురిచేటి వారి వివాహ వేడుకలో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి



**సంతమాగులూరు ,మే 9 ,ప్రభాతవార్త**

సంతమాగులూరు మండలం కామేపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన కురిచేటి విశ్వరూపాచారి కుమారుడు రాజగోపాలాచారి వివాహ వేడుకలో పాల్గొని నూతన వరుడు రాజగోపాలాచారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

## కామేపల్లిలో జాస్తి హనుమంతరావు కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్



**సంతమాగులూరు, మే 9, ప్రభాతవార్త**

సంతమాగులూరు మండలం కామేపల్లిలో గ్రామంలో ఇటీవల మరణించిన జాస్తి హనుమంతరావు కుటుంభ సభ్యులను శుక్రవారం రాష్ట్ర విద్యుత్ శాకా మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్తానిక నాయకులు కార్యకర్తలతో కలసి హనుమంతరావు ఇంటికి వెళ్లి కుటుంభ సభ్యులను పరామర్శించారు.

## ప్రాధమిక వైద్యశాలలో పీఎంజేవై శిభిరానికి విశేష స్పందన

**- 800 మంది నమోదు**



**సంతమాగులూరు, మే 9, ప్రభాతవార్త**

సంతమాగులూరు ప్రాధమిక వైద్యశాలలో పీఎంజేవై,పీఎంఎస్ఎంఎ శిభిరానికి విశేష స్పందన లభించినట్లు వైద్యధికారిని డాక్టర్ కే.సాహిత్య తెలిపారు. ఈ శిభిరంలో పాల్గొన్న78మంది గర్భవతులకు అన్నిరకాల వైద్యపరీక్షలు నిర్వహించి తగిన మందులు చితంగా అందజేశారు. ఈ వైద్య శిబిరానికి వచ్చి వారందరికి సంతమాగులూరు గ్రామనాయకులు అట్లా పెద్ద వెంకటరెడ్డి బోజన వసతి కల్పించినట్లు తెలిపారు. ఈ శిభిరంలో డాక్టర్ కె.సాహిత్యతోపాటు ఆర్.జ్యోష్ణ లు వైద్యరీక్షలు నిర్వహించగా వైద్యశాల సిబ్బంది, అన్ని గ్రామాల సచివాలయాల సిబ్బంది పాల్గొనగా కార్యక్రమాన్ని మండల పరిషత్ అభివృద్ది అధికారి జ్యోతిర్మయి పర్యవేక్షించారు.

## ఎస్సై శ్రీకాంత్‌బాబు ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహనాలు తనిఖీ



**సంతనూతలపాడు ,మే 9, ప్రభాతవార్త**

జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు ఒంగోలు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రీకాంత్ఆబు ఆధ్వర్యంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా అనుమానస్పదమైన వ్యక్తుల వస్తువుల కొరకు, ఏదైనా మందు గుండు సామాగ్రి తరలిస్తున్న సమాచారం మేరకు ముందస్తుగా వాహనాలను, వ్యక్తులను వారు తీసుకుని వెళ్తున్న బ్యాగులను సంతనూతలపాడు కేంద్రం నందు తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు ఎస్సై వేజెండ్ల అజయ్‌బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు నివారణపై అవగాహన



**సంతనూతలపాడు ,మే 9, ప్రభాతవార్త**

కిశోర బాలికలకు కిశోర వికాసం పథకం కింద బాల్య వివాహాలు నివారణకు సచివాలయం, అంగన్‌వాడీ సిబ్బంది అవగాహన కల్పించారు. సంతనూతలపాడు లోని గానుగపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం జరిగిన కిశోర వికాసం కార్యక్రమంలో వాళ్ళు బాలికలు ఆరోగ్య సంరక్షణ ఆన్‌లైన్ నేరాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం భాగ్యలక్ష్మీ, జీఎంఎస్‌కే అనూరాధ, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీ, రాధా, అంజమ్మ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పేర్నమిట్టలో కిశోర వికాసంపై అవగాహన

**సంతనూతలపాడు, మే 9, ప్రభాతవార్త**



సంతనూతలపాడు మండలం పేర్నమిట్టలోని శాంతినగర్, కుమ్మరిపాలెం, అంగన్‌వాడీకేంద్రంలలో కిశోర వికాసంపై కిశోర బాలికలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమా అవగాహనకల్పించారు. ఆరోగ్య సంరక్షణ, ఆన్‌లైన్ నేరాలు, బాల్య వివాహాలు నివారణ, పరిసరాల పరిశుభ్రత తదితర వాటిపై సూపర్‌వైజర్ రమా వివరించారు. ఈ కార్యక్రమం లో మహిళా పోలీసు షైనీ, ఏఎన్ఎం హెలినా, అంగన్‌వాడీ టీచర్లు నాగేంద్రం, కాంచన, సునీత, శివ పార్వతి పాల్గొన్నారు.

## బంగారు బాల్యంను బాధ్యతగా భావించి విజయవంతం చేయండి

**- జిల్లా నోడల్ అధికారి గిరిధర శర్మ**





**రాచర్ల, మే 9 ,ప్రభాతవార్త**

బంగారు బాల్యం కార్యక్రమాన్ని బాధ్యతగా భావించి విజయవంతం చేయాలని బంగారు బాల్యం జిల్లా నోడల్ అధికారి వి.గిరిధర్ శర్మ అన్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులో కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లామరియు మండల అధికారుల కు మున్సిపల్ కమిషనర్లు, ఐసిడిఎస్ అధికారులు, నగర పాలక సంస్థ కమిషనర్లు, మండల విద్యాశాఖ అధికారులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు బాల్యం ట్రయల్ రన్ కార్యక్రమాన్ని రాచర్ల మండలంలో ప్రారంభించామని, అక్కడ చేపట్టిన సర్వే కార్యక్రమం సంతృప్తికరంగా విజయవంతంగా జరిగిందన్నారు. దీని ఆధారంగా చేసుకొని ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని మండలాల్లో చేపట్టే కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు కృషిచేయాలని ఆయన అధికారులందరినీ కోరారు. జిల్లా కలెక్టర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని బాధ్యతగా స్వీకరించి విజయవంతం చేయవలసిన బాధ్యత అధికారులు అందరిపై ఉందన్నారు. ఒక్క రాచర్ల మండలంలో నిర్దేశ సమయానికి 13సచివాలయాల మహిళా పోలీసు సిబ్బంది 364మంది వనరబుల్ పిల్లల వివరాలు, వారి కుటుంబ స్థితిగతులు తెలుసుకొని ఆ కుటుంబాల వారికి ప్రభుత్వ పరంగా ప్రయోజనం చేకూర్చే విధంగా ఈ బృహత్తర కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. కాబట్టి ఈ కార్యక్రమాన్ని జిల్లా అంతటా విజయవంతం చేసేందుకు అధికారులందరూ ప్రత్యేక కృషి చేయాలని కోరారు. సర్వే విధానాన్ని, సర్వే ద్వారా వచ్చిన ఫలితాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అదే విధంగా మొబైల్ యాప్‌లోని సర్వే ప్రోఫార్మన్ను సమావేశానికి హాజరైన అధికారులకు వివరించారు.

## యడవల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో నేడు విద్యుత్ నిలిపివేత



**రాచర్ల, మే 9, ప్రభాతవార్త**

మండలంలోని యడవల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా నేడు అనగా శనివారం ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని రాచర్ల విద్యుత్ శాఖ ఏఈ కె బాలగురవయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యడవల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

## భర్తను హత్య చేసిన భార్య అరెస్టు

**- కేసు వివరాలను వెల్లడించిన మార్కాపురం డిఎస్పి యు నాగరాజు**




**కంభం రూరల్, మే 9, ప్రభాతవార్త**

కంభం మండలంలో మద్యానికి బానిసై వేధిస్తున్నాడని భర్తను భార్య హత్యచేసిన ఘటనను పోలీసులు ఛేదించారు. కంభం పట్టణంలో ఈనెల 3వతేదీన ఈ సంఘటన చోటు చేసుకుంది. మార్కాపురం డిఎస్పి యు నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం మద్యానికి బానిసై వేధిస్తున్నాడని భర్తను భార్య హత్యచేసి, హత్య తర్వాత భార్య భర్త అనారోగ్యంతో మృతిచెందాడని నమ్మించే ప్రయత్నం చేసినట్లుగా మీడియా సమావేశంలో డిఎస్పి నాగరాజు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి శుక్రవారం నిందితురాలిని అదుపులోకి తీసుకోవడంతోపాటు రిమాండ్‌కు తరలిస్తున్నామని ఆయన తెలిపారు. అలాగే మర్డర్ కేసును సాధారణ మరణంగా మార్చే ప్రయత్నాన్ని అడ్డుకుని, లోతుగా దర్యాప్తు చేసి ముద్దాయిని అరెస్ట్ చేసినందుకు సిఐ మల్లికార్జున, ఎస్సై నరసింహారావు మరియు సిబ్బందిని డిఎస్పి నాగరాజు అభినందించారు.

## ఆర్మీ వాహనాలను ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో అప్లోడ్ చేయరాదు

**- ఎస్సై శివరామయ్య**





**మద్దిపాడు, మే 9, ప్రభాతవార్త**

జాతీయ రహదారిపై మన గ్రామాల గుండా భారత ఆర్మీ ఎయిర్‌ఫోర్స్, నావికా దళాల వాహనాల కదలికలు కనిపిస్తే దయచేసి ఎలాంటి వీడియోలు, రీల్స్ చేయవద్దు, వాటిని సోషల్ మీడియాలో అసలు పోస్టు చేయవద్దు, అలా చేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్సై బి.శివరామయ్య పేర్కొన్నారు. జిల్లా ఉన్నత స్థాయి పోలీసు అధికారుల ఆదేశాల మేరకు మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రోత్ సెంటర్ నందు జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనాలను తనిఖీ చేస్తూ.. డ్రోన్ కెమెరాతో శుక్రవారం నాడు పోలీసు శాఖ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై బి.శివరామయ్య మాట్లాడుతూ జాతీయ రహదారిపై మన గ్రామాల గుండా భారత ఆర్మీ ఎయిర్‌ఫోర్స్, నావిక దళాల వాహనాల కదలికను వీడియోలు తీయరాదని, వాటిని సోషల్ మీడియా అప్లోడ్ చేయడం మండల ప్రజలను ఆయన కోరారు. ఈ అప్లోడ్ చేయడం వల్ల శత్రువు దేశాలకు మన ఆర్మీ యొక్క యుద్ధ నైపుణ్య వాహనాల విషయాలు తెలుస్తాయని తద్వారా మన దేశ రక్షణకు నష్టం కలిగించిన వారు అవుతారని ఆయన అన్నారు. ఆర్మీ వాహనాల కదలికలపై వీడియోలు తీసిన అప్లోడ్ చేసినట్లయితే దేశ రక్షణ చట్టాల అనుసారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. వృత్తిరీత్య దేశంలో ప్రయాణం చేయడం వాహనాలను నడుపుట ద్వారా ప్రమాదాలు కొనితెచ్చుకునే పరిస్థితి ఉంటుందని అన్నారు. మండల పరిధిలోని సీతారాంపురం, కొష్టాలు సెంటర్ వద్ద, వెల్లంపల్లి చిన్న బ్రిడ్జి వద్ద, రాచవారిపాలెం జంక్షన్ వద్ద, గ్రోత్ సెంటర్ వద్ద వ్యతిరేక దిశలో వాహనాలు నడుపుట వలన రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై శివరామయ్య ప్రధాన కూడలి వద్ద వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆటో డ్రైవర్లు కూడా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం కానీ సైడ్ కూర్చొని పెట్టడం కాని చేయరాదని సూచించారు. ప్రతి ఒక్కరు తప్పకుండా హెల్మెట్, సీటు బెల్టు ధరించి ప్రయాణించాలని, తాగి వాహనాలను నడపవద్దని వ్యతిరేక దిశలో ప్రయాణాలు చేయరాదని, రోడ్డు సేఫ్టీ రూల్స్ తప్పక పాటించాలని వాహనదారులకు ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వివాహ రిసెప్షన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్



**మద్దిపాడు, మే 9, ప్రభాతవార్త**

మండలంలోని వెల్లంపల్లి అవాస్ హోటల్‌లో పూర్వ సూర్య ఎలికెటి గద్దం సత్యనారాయణ కుమారుని వివాహ రిసెప్షన్ వేడుక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మాజీ సర్పంచ్ ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు మండవల్లి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు మెదర్తి లాలు, అంజనేయులు, శివ,గద్దం సత్యనారాయణ, కుటుంబ సభ్యులు , బంధువులు తదితరులు పాల్గొన్నారు.


## పందిళ్ళవారి వివాహ వేడుకలో కదిరి పార్ధసారథి



**సీఎస్‌పురం, మే 9, ప్రభాతవార్త**

సీఎస్‌పురం మండలం గుంతవెన్నంపల్లె పంచాయతీలోని పందిళ్లపల్లి గ్రామానికి చెందిన పందిళ్ల వెంకటేశ్వర్లు కుమారుడు రమేష్ వివాహ వేడుక గురువారం రాత్రి జరిగింది. ఈ వివాహ వేడుకలో కదిరి బాబూరావు వ్యవసాయ క్షేత్రం సెక్రటరీ కరస్పాండెంట్ కదిరి పార్ధసారథి హాజరైనారు. నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు.

## హనుమంత వాహనంపై దర్శనమిచ్చిన శ్రీ రమా సత్యనారాయణ స్వామి



**మార్కాపురం రూరల్, మే 9 ,ప్రభాతవార్త**

మార్కాపురం పట్టణంలోని 9వ వార్డులో వేంచేసియున్న శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయం నందు ఈ నెల 8వ తేదీ ప్రారంభమై 13వ తేదీ ముగియనున్న శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి వారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం హనుమంత వాహనంపై స్వామివారి విహరించారు. అదేవిధంగా 10వ తేదీ గరుడ వాహనం, 11వ తేదీ గజ వాహనం, 12వ తేదీ రథోత్సవం, జరుగునని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మార్కాపురం మరియు పరిసర ప్రాంత ప్రజలు ఈ కార్యక్రమాలలో పాల్గొని శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామిని దర్శించుకుని తీర్ధ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

## శ్రీకామాక్షి సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానంకు కదిరి బాబురావు రూ.4 లక్షలు విరాళం



**సీఎస్‌పురం, మే 9, ప్రభాతవార్త**

సీఎస్‌పురం మండలంలోని రేగులచెలక పంచాయతీలోని గణేశునిపల్లి గ్రామంలో నూతనంగా శ్రీ ఇష్టకామాక్షి సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానం నిర్మిస్తున్నారు. ఈ దేవస్థానం నిర్మాణానికి కనిగిరి మాజీఎమ్మెల్యే, వైసీపీ విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు రూ.4 లక్షల విరాళం ఇచ్చారు. ఈ విరాళాన్ని కదిరి బాబురావు సోదరుడు కదిరి పార్ధసారధి శుక్రవారం దేవస్థానం కమిటీ సభ్యులు కుక్కా తిరుపతయ్య,సాదు వెంకటేశ్వర్లు, రామస్వామికు అందజేశారు. ఈ కార్యక్రమంలో రామస్వామి,మాజీ ఎంపీటీసీలు మునగల నారాయణరెడ్డి, మూరం కాశిరెడ్డి, తికణం బాబురావు, పులిశేఖర్‌రెడ్డి, మాల్యాద్రి రెడ్డి, వెంకట నారాయణరెడ్డి, పట్నం తిరుపతయ్య, నున్నా నారాయణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లు కబ్జా.. పట్టించుకోని అధికారులు



**వేటపాలెం, మే 9, ప్రభాతవార్త**

దేశాయిపేట పంచాయతీ పెట్రోల్ బంకు వెనుక ఎస్సీ కాలనీలోని రోడ్లు ఆక్రమణకు గురై స్థానికులను భాగా ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. ఎస్సీ కాలనీ వాసులు రోడ్డు ఆక్రమణ గురించి పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికి వారి సమస్య పరిష్కరించడలేదు. రోడ్డు సగం ఆక్రమణకు గురి కాక మిగిలిన సగం చిల్లచెట్లతో నిండిపోయి దారి పూర్తిగా మూసుకుపోయిన వైనం కనిపిస్తుంది. రాత్రి సమయంలో ఆ రోడ్లపై వాహనాలు ప్రయాణం నల్లేరు మీద నడకలా మారింది. ప్రమాదాలు జరుగుతున్న ఆ రోడ్లపై మరణాలు సంభవిస్తే తప్ప అధికారులు స్పందించరేమో అని స్థానికులు వాపోతున్నారు. గల్లీ ఆక్రమణదారులతో పంచాయతీ అధికారులు లాలూచీ పడి ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినప్పటికి గల్లీని పట్టించుకోవడం లేదని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గల్లీ ఆక్రమణలను తొలగించి ప్రమాదాల నుండి కాపాడాల్సిందిగా కోరుతున్నారు.

## పొదిలి ఉడుముల ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

**- 2.8 కిలోల అండాశయ నీటి గడ్డ తొలగింపు**




**కొనకనమిట్ల, మే 9, ప్రభాతవార్త**

పొదిలి ఉడుముల ఆసుపత్రిలో డాక్టర్ ఎస్‌వీ గీతికారెడ్డి ఆధ్వర్యంలో 16 సంవత్సరాల యువతికి 2.8 కిలోల బరువుతో ఉన్న అండాశయ నీటి గడ్డ ను శుక్రవారం విజయవంతంగా తొలగించారు. ఈ యువతీ ఇటీవల తీవ్రమైన పొట్ట నొప్పి, వాంతులు, పొట్ట ఉబ్బిద వంటి సమస్యలతో ఆసుపత్రిలో చేరింది. వైద్య పరీక్షలలో ఆమెగర్భాశయం వద్ద భారీ నీటి గడ్డ ఉన్నట్లు నిర్ధారించారు. వెంటనే శస్త్ర చికిత్సకు ఏర్పాట్లు చేసి సంపూర్ణ ఓపెన్ శస్త్ర చికిత్స విధానం ద్వారా ఆ గడ్డను పూర్తిగా తొలగించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్‌వీ గీతికారెడ్డి మాట్లాడుతూ ఇంత పెద్ద గడ్డ చిన్న వయసులో రావడం అరుదని దీన్ని తొలగించడంలో మా వైద్య బృందం శ్రమించి శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసిందన్నారు. రోగిని తక్కువ సమయంలోనే కోలుకునేలా చేశామని, ప్రస్తుతం రోగి ఆరోగ్యంగా కోలుకుంటూ ఉంది, వైద్య బృందం నిత్యం పర్యవేక్షిస్తోందని పేర్కొన్నారు. ఉడుముల ఆసుపత్రిప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడంలో ముందుంటుందన్నారు.

## పొదిలి సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ముమ్మర తనిఖీలు



**కొనకనమిట్ల, మే 9, ప్రభాతవార్త**

పొదిలి పట్టణంలోని మార్కాపురం అడ్డరోడ్డ వద్ద వాహనాల తనిఖీని పొదిలి సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్సై వి.వేమన శుక్రవారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు ప్రస్తుతం దేశంలో నెలకొన్న యుద్ధ వాతావరణ నేపధ్యంలో తనిఖీలు చేపట్టారు. వాహనాలను నిశితంగా పరిశీలించారు. అనుమానితుల కదలికల కోసం వాహన తనిఖీలు చేస్తున్నట్లు సీఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఎటువంటి వాహనాన్ని వదిలిపెట్టకుండా పట్టణంలో ఎవరి మీద అనుమానం అనిపిస్తే మాకు సమాచారం అందజేయాలన్నారు.

## భూసార పరీక్షలు ఆధారంగా ఎరువులు వాడాలి



**కొనకనమిట్ల, మే 9, ప్రభాతవార్త**

భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడితే సత్ఫలితాలు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి కే.ప్రసన్న రంగ లక్ష్మీ శుక్రవారం ఓ ప్రకటనలో అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూసార పరీక్షల ఆధారంగా రైతులకు సూక్ష్మపోషకాలు, రాయితీపై అందజేయాలనే లక్ష్యంతో మట్టి నమూనా సేకరణ లక్ష్యాలను ప్రతి మండలానికి ఇవ్వడం జరిగింది. మండలంలో 990 మట్టి నమూనాలను సేకరించి,ఒంగోలు భూసారా పరీక్ష కేంద్రంకు పంపాల్సి ఉందన్నారు. ప్రతి 2.5 ఎకరాకు ఒక నమూనా సేకరిస్తారు. జీపీఎస్ ఆధారంగా నమూనాలు సేకరించి యాప్ లో అప్‌లోడ్ చేస్తారన్నారు. ఫలితాల సమాచారం కూడా రైతు చరవాణికి తెలుగులో అందేలా సాఫ్ట్‌వేర్ రూపొందించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయ్యే నాటికి మట్టి నమూనాలను సేకరించి మే 15వ తేదీకి భూసార పరీక్షా కేంద్రానికి పంపాలి. మండలంలోని రైతులు రైతు సేవా కేంద్రాల సిబ్బంది ద్వారా తప్పక మట్టి నమూనాను తీసుకొని భూసార పరీక్షా ఫలితాలను బట్టి ఎరువులు వాడాలన్నారు.

## వేసవి శిబిరాలు బాలల అభ్యున్నతికి బాటలు

**- ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి**



**సంతనూతలపాడు, మే 9, ప్రభాతవార్త**

వేసవి శిబిరాలు బాల బాలికల అభ్యున్నతికి ఎంతగానో దోహదపడతాయని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పేర్కొన్నారు. ప్రకాశం బాలోత్సవం ఆధ్వర్యంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం జేవీవీ సంతనూతలపాడు మండల కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్లో ఏర్పాటు చేసిన ఉచిత వేసవి శిబిరాన్ని ఆమె ప్రారంభించి అనంతరం మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి సెలవుల్లో బాల బాలికలు మొబైల్స్, టీవీలకు బానిసలు కాకుండా వారి చదువుల్లో ఉన్నత స్థితికి రాణించేందుకు బాలల శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. చదువుతో పాటు ఆటలు, పాటలు అనేక రకాల కళలు, సాంస్కృతిక అంశాలకు చెందిన లక్షణాలు విద్యార్థుల్లో ఉంటాయని అని అన్నారు. వాటిని వెలికి తీసి ప్రోత్సహించి ముందుకు నడిపేందుకు ఇటువంటి శిక్షనా శిబిరాలు తోడ్పడతాయని అన్నారు. గత మూడు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలు విద్యార్థులు భవిష్యత్‌లో వారు వివిధ రంగాల్లో రాణించేందుకు వీలుగా ఉపయోగపడతాయని అన్నారు. ఈ వేసవిలో జిల్లా వ్యాప్తంగా ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరం నిర్వహఖులు ఐద్వా మండల కార్యదర్శి యన్.మాలతి మాట్లాడుతూ విద్యార్థులకు ఉచిత వేసవి శిబిరం 10 రోజుల పాటు నిర్వహిస్తామని తెలిపారు. తల్లిదండ్రులు కూడా పిల్లలు ఎండలకు తిరగకుండా ప్రశాంతంగా ఇటువంటి కార్యక్రమాలు నెర్చుకోవడం కోసం పంపాలని కోరారు. ప్రధానంగా పిల్లలకు ఇక్కడ ఫన్ని మ్యాక్స్, పేపర్ క్రాఫ్ట్, క్యారమ్, డ్రాయింగ్, నీతి కథలు, దేశభక్తి గీతాలు, నేర్పడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా జేవీవీ నాయకులు కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయసు నుంచే మంచి ఆలోచనలు కలిగి ఉండాలని, చదువులతో పాటు సమాజంలో జరుగుతున్న మార్పులను కూడా అవగాహన చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జీఎంపీఎస్ రాష్ట్ర కార్యదర్శి కే.పెద్దబ్బాయి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు, టైలరింగ్ టీచర్ అనురాధ పాల్గొన్నారు.

# 15న పదిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం




**చీరాల, మే 9, ప్రభాతవార్త**
చీరాల రోటరీక్లబ్ ఆధ్వర్యంలో దోగుపర్తి వెంకట సురేష్ ఈనెల 15న గురువారం ఉదయం 7.30గంటలకు చీరాల నియోజకవర్గంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో ఫస్ట్ మార్క్స్ తెచ్చుకొన్న విద్యార్థినీ, విద్యార్థులకు రోటరీ కమ్యూనిటీ హాల్ నందు సన్మానం చేసి, నగదు బహుమతి, ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేయడం జరుగుతుంది. విద్యార్థులు వెంట తల్లిదండ్రులు, ఒక ఉపాధ్యాయుడు కూడా రావచ్చును. అందరికి అల్పాహారం ఏర్పాటు చేయనున్నారు. పందిళ్ళపల్లి జడ్పీ హైస్కూల్ నందు 10వ తరగతిలో 596 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంకు సాధించిన సజ్జా దివ్యశ్రీను రోటరీ సీనియర్ సభ్యులు, ప్రముఖ న్యాయవాది బండారుపల్లి హేమంత్‌కుమార్ సన్మానం చేసి, రూ.11,116లు నగదు బహుమతి అందజేయనున్నారు. వివరాలకు 9866137914 సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో దోగపర్తి వెంకట సురేష్, పోలుదాసు రామకృష్ణ, మామిడాల శ్రీనివాసరావు, జీవై ప్రసాద్ పాల్గొన్నారు.

## హరిజోన్ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, విశ్రాంత జేడీ లక్ష్మీనారాయణ





**వేటపాలెం, మే 9, ప్రభాతవార్త**
వేటపాలెం మండలం రామన్నపేట పంచాయతీ సాయినగర్లో హరిజోన్ పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభించిన శాసనసభ్యులు ఎంఎం కొండయ్య, విశ్రాంత జేడీ లక్ష్మీనారాయణ, ఇస్కాన్ మందిర్ వ్యవస్థాపకులు కే.శివశంకరరావు, సులోచన, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పొగడదండ రవికుమార్ మాట్లాడుతూ అత్యుత్తమ విద్య అందించేందుకు హారిజోన్ పబ్లిక్ స్కూల్ ప్రారంభిస్తున్నామని, వేటపాలెం, కొత్త కాల్వ రహదారిలో ఉన్న బ్రిడ్జి పక్కన మామిడి తోటల్లో విద్యార్థులను ఆకట్టుకునే విధంగా నూతనంగా నిర్మించిన తరగతి గదుల్లో డాక్టరేట్లు పొందిన పలువురు ఆచార్యుల సమక్షంలో విద్యాబోధన చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అధ్యక్షురాలు పి.హరిణి, మేనేజింగ్ డైరక్టర్ పి.హర్షి, పురప్రముఖులు పాల్గొన్నారు.

# మతతత్వవాదం, అసాంఘిక శక్తుల సవాల్..

## దేశ భద్రతకు గట్టి చర్యలు అవసరం



**చీరాల, మే 9, ప్రభాతవార్త**
ప్రస్తుతం భారత్- పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తత కొనసాగుతున్న సంగ్రామం నేపథ్యంలో కొందరు మతతత్వ వాదులు, అసాంఘిక శక్తులు, వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాలను కాంక్షించే విభిన్న వర్గాలు ఈ పరిస్థితిని దుర్వినియోగం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. వారు సామాజిక శాంతి భద్రతను భంగం చేసేందుకు మత ఘర్షణలకు, హింసాత్మక ఘటనలకు ప్రేరేపిస్తున్నారు. ఈ శాంతి వాతావరణం దేశమంతా వ్యాపించడానికి ప్రేరణ కలిగిస్తోంది. ఇలాంటి కార్యకలాపాలను ఎంతటి స్థాయిలో ఉన్న వారైనా సహించరాదు, దేశ సమగ్రత, భద్రతలకు విరుద్ధంగా పని చేసే వారిని దేశద్రోహ నేరస్తులుగా గుర్తించి, కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా సమాజంలో ఇలాంటి శక్తులు విస్తరించకుండా ప్రజలను వీరి చీటిమాటలకు లొంగకుండా చేయడానికి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలుగుదేశం పార్టీ నాయకులు నక్కల వెంకట రమణారావు పేర్కొన్నారు.

# బర్లీ పొగాకు కొనుగోలు చేయాలని ధర్నా


## - ప్రభుత్వమే 100 కోట్లు కేటాయించాలని డిమాండ్



**నాగులుప్పలపాడు, మే 9 ,ప్రభాతవార్త**
బర్లీ పొగాకును కొనుగోలు చేయాలని కోరుతూ రైతు కౌలు రైతు సూంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రమైన నాగులుప్పలపాడు బస్టాండ్ సెంటర్‌లో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జే.జయంతిబాబు, పమిడి వెంకటరావు మాట్లాడుతూ అనేక ప్రైవేటు కంపెనీలు రైతులను ప్రోత్సహించి బర్లీ పొగాకు సాగు చేయించారు. ఎంతైన కొనుగోలు చేస్తామని నమ్మబలికారు. తీరా పంట చేతికి వచ్చిన తరువాత కుంటిసాకులు చెబుతూ ఒక్క క్వింటా కూడా కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. దాంతో రైతాంగం పండించిన పంటను నిల్వ చేసుకోవడానికి వసతులు లేక పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం కూడా రైతులను ప్రోత్సహించి కంపెనీల చేత కొనుగోలు చేయించడంతో విఫలమైందన్నారు. ఒక ప్రక్క రైతులు అధైర్యపడవద్దు పండిన పంట అంతా కొనుగోలు చేయిస్తామని రైతు కంట కన్నీరు తుడిచే విధంగా మాట్లాడుతున్నారే తప్పా కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చి బర్లీ పొగాకు రైతుల సమస్యలను పరిష్కరించడం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి 100 కోట్లు కేటాయించి రైతుల వద్ద ఉన్న బర్లీ పొగాకు మొత్తం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో బర్లీ పొగాకు రైతులందరిని ఐక్యం చేసి త్వరలో కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఆ కార్యక్రమంలో బర్లీ పొగాకు రైతులందరు పాల్గొనాలని, అప్పుడే సమస్య పరిష్కారమవుతుందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.శ్రీకాంత్, జి.బసవపున్నయ్య, కారాని సుబ్బారావు, పాలపర్తి యోనా, హజరత్తయ్య, మండవ ఆంజనేయులు, వివిధ గ్రామాల బర్లీ పొగాకు రైతులు పాల్గొన్నారు.

## యుద్ధంలో చనిపోయిన ఆర్మీ జవాన్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది

### - టీడీపీ ఇన్‌ఛార్జీ గొట్టిపాటి లక్ష్మీ



**దర్శి, మే 9, ప్రభాతవార్త**
ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా జమ్మూ కాశ్మీర్ యుద్ధ భూమిలో పోరాడుతూ మన రాష్ట్రానికి చెందిన మురళి నాయక్ వీరమరణం పొందడం నన్ను తీవ్ర ఆవేదనకు గురి చేసిందని టీడీపీ ఇన్‌ఛార్జీ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ అన్నారు. ఈ సందర్భంగా గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల మండలం గడ్డం తండా పంచాయతీ కల్లి తాండా గ్రామానికి చెందిన మురళీ నాయక్ చూపిన ధైర్య సాహసాలు రాష్ట్రానికే గర్వకారణం, మురళీ నాయక్ పార్థివ దేహానికి రాష్ట్ర ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిపించటం జరుగుతుందని, ఆయన కుటుంబానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు.

# వృద్ధులకు అన్నదానం చేసిన యాతం



**దర్శి, మే 9, ప్రభాతవార్త**
దర్శి కర్ర వారి బజారు వాస్తవ్యులు యాతం రమణారెడ్డి సతీమణి ఆదిలక్ష్మీ 33వ పెళ్లి రోజు సందర్భంగా దర్శి కురిచేడు రోడ్డులోని శ్రీసిద్ధి సాయిబాబా వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేసి పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు సురేష్, జంగా సుబ్బారెడ్డి, మునగాల వెంకట నారాయణ, చిన్నపరెడ్డి, కట్టెకోట హరీష్, యాతం బ్రదర్స్ సన్స్ పాల్గొన్నారు.

## వృద్ధులకు పౌష్టికాహారం అందజేత



**దర్శి, మే 9, ప్రభాతవార్త**
ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా అనేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కపురం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పెద్దలతో కలిసి శుక్రవారం పలివెంద్రలలోని కాశీనాయన నిత్య అన్నదాన సత్రంలోని 90మంది అనాథ వృద్ధులకు పౌష్టికాహారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకులు జీవీ రత్నం, స్థానిక తహసీల్దార్ శ్రావణ్ కుమార్ ఆత్మీయసనాల నిమిత్తం వారి ఆదేశానుసారం సిబ్బంది రామకృష్ణ, శ్రీనివాస్, భాషా పాల్గొన్నారు.

# మావోయిస్టు దాడిలో వీర మరణం పొందిన గ్రే హౌండ్

## కానిస్టేబుల్ పవన్ కళ్యాణ్‌కు ఘనంగా అంతిమ వీడ్కోలు



**కనిగిరి, మే 9, ప్రభాతవార్త**
తెలంగాణాలోని కర్రెగుట్టల్లో మావోయిస్టులు, పోలీసులకు జరిగిన ఎదురు కాల్పుల్లో వీర మరణం పొందిన గ్రే హౌండ్స్ కానిస్టేబుల్ నూకతోటి పవన్ కళ్యాణ్‌కు స్వగ్రామమైన పీసీపల్లి మండలం ముద్దపాడులో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించారు. జాతీయ పతాకంతో కప్పిన పవన్ కళ్యాణ్ పార్థివ దేహానికి అధికార లెవెల్ గౌరవార్థంగా పోలీసు గార్డు నివాళులర్పించింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, పలువురు పోలీసు అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, గ్రామస్తులు పాల్గొని ఆయనకు నివాళులర్పించారు. శోకసంతప్త కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. పవన్ కళ్యాణ్ ధైర్యసాహసాలు, దేశం కోసం చేసిన త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ స్థానికులు కన్నీటి వీడ్కోలు పలికారు. గ్రే హౌండ్స్‌లో సేవలందించిన ఆయన అత్యుత్తమ పోరాట స్ఫూర్తికి గుర్తుగా ప్రభుత్వ స్థాయిలో నివాళులర్పించడమే కాక, భవిష్యత్తులో కుటుంబానికి అవసరమైన సహాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

## కనిగిరి వైసీపీ ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణయాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు

**కనిగిరి, మే 9, ప్రభాతవార్త**
కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణయాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయనకు పలువురు నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. వైసీపీ రాష్ట్ర సేవాదళ్ వాలంటరీ విభాగ జనరల్ సెక్రటరీ, చేనేర్లపాడు పంచాయతీ నాయకులు ఆవుల భాస్కర్‌రెడ్డి, నాగిరెడ్డిపల్లి వైసీపీ నాయకులు సైకం ఏడుకొండలురెడ్డి ఆయనను ప్రత్యేకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దద్దాల నారాయణయాదవ్ నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండి, కనిగిరి నియోజకవర్గ ప్రజలకు మరింత నిస్వార్థంగా సేవలు అందించాలని మనసారా కోరుతున్నాం, భవిష్యత్తులో ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే నాయకుడిగా నిలవాలనే ఆశించుతున్నాం అని అన్నారు. పార్టీ వర్గాలు, స్థానిక ప్రజలు కూడా సోషల్ మీడియాలో శుభాకాంక్షలు వెల్లువ తలపించారు.

## వైసీపీ ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణయాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన శిగా కృష్ణారావు



**కనిగిరి, మే9, ప్రభాతవార్త**
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణయాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని పలువురు వైసీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కనిగిరి నియోజకవర్గ వైసీపీ చేనేత విభాగ అధ్యక్షుడు శిగా కృష్ణారావు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దద్దాల నారాయణయాదవ్ నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకుంటున్నాను, ఆయన సేవాభావం, నాయకత్వ గుణాలు త్వరలోనే రాజకీయంగా ఉన్నత స్థాయికి చేర్చుతాయని ఆశిస్తున్నాను. భవిష్యత్తులో ఎమ్మెల్యేగా ఎన్నికై కనిగిరి నియోజకవర్గ ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందించాలని మనసారా కోరుతున్నాను అని అన్నారు. శిగా కృష్ణారావు చేసిన ఈ వ్యాఖ్యలు పలువురు వైసీపీ కార్యకర్తలతో ఆనందాన్ని రేకెత్తించాయి. నారాయణ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని పార్టీ నాయకులు, అభిమానులు, సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు వెల్లువెత్తిస్తున్నారు.

## వైసీపీ ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణయాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖ వైద్యులు ఆవుల కృష్ణారెడ్డి



**కనిగిరి, మే 9, ప్రభాతవార్త**
కనిగిరి నియోజకవర్గం వైసీపీ ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణయాదవ్‌కు కనిగిరి నియోజకవర్గం డాక్టర్స్ విభాగం అధ్యక్షులు, ప్రముఖ దంత వైద్యులు ఆవుల కృష్ణారెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దద్దాల నారాయణయాదవ్ నిండునూరేళ్ల ఆయురారోగ్యాలతో సిరిసంపదలతో సుఖంగా సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. దద్దాల నారాయణ యాదవ్ భవిష్యత్తులో రాజకీయంగా ఉన్నత స్థాయికి చేరుకొని కనిగిరి నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఎన్నికై కనిగిరి నియోజకవర్గ ప్రజలకు నిస్వార్థ సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణయాదవ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు కనిగిరి వైసీపీ కార్యాలయంలో భారీ ఏర్పాట్లను చేశారు.

# పారిశ్రామిక అభివృద్ధి కూటమి ప్రభుత్వ ధ్యేయం

## - ఎమ్మెస్ ఎంవీ పార్కును ప్రారంభించిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ





**దర్శి, మే 9, ప్రభాతవార్త**
దర్శి మండలం చందలూరు గ్రామంలో శుక్రవారం ఎమ్మెస్ ఎంఈ పార్కు ప్రారంభించిన దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ వారితో పాటు టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, ఏపీఐఐసీ అధికారులు, దర్శి మండల ఎమ్మార్వో శ్రవణ్ కుమార్, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా గొట్టిపాటిలక్ష్మీ మాట్లాడుతూ మన కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ 11నెలల కాలంలో రాష్ట్రాన్ని అభివృది పథంలో నడిపించేందుకు పారిశ్రామిక అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుంది. ఇందులో భాగంగా మన దర్శినియోజక వర్గంలో చందలూరు గ్రామంలో పరిశ్రమల అభివృద్ధికి ఎంఎస్ఎంఈ పార్కు రావడం ఒక మంచి శుభపరిణాంగా చెప్పవచ్చు. ఈ ప్రాంతంలో ఔత్సాహికులైన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే లక్ష్యంగా ఈ పార్కు ఉపయోగపడగలదు. చిన్న మధ్య తరగతి పరిశ్రమలకు అవసరమైన అన్ని వస్తువులతో ఈ పార్కులో ప్లాట్‌ల కేటాయింపు చేపట్టడం జరుగుతుందన్నారు. దీని ద్వారా వందలాది మంది పారిశ్రామిక వేత్తలు అవడంతో పాటు వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధిఅవకాశాలు లభిస్తాయి అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషి మనం చూస్తున్నాం, ఆంధ్ర రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని, గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసింది, ఇప్పుడిప్పుడే తిరిగి పాలన గాడిలో పెడుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లు వలె ముందుకు తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ఇక మన నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులతో పాటు దొనకొండ మండలంలో సోలార్ పార్కు కూడా త్వరలో రాబోతుందన్నారు. మనకూటమి ప్రభుత్వంలో దర్శి ప్రాంతాన్ని అభివృద్ధి ప్రాంతంగా చేయడం వలసలు లేకుండా విద్యా, ఉపాధి అవకాశాలు పెంచే విధంగా ముందుకు వెళ్తున్నాం, గ్రామాల్లో మౌలిక వసతులు కల్పన అవసరమైన రోడ్లు, డ్రైన్లు అభివృద్ధి కార్యక్రమాలు ఈనెల 11 నెలల కాలంలో 15 కోట్లతో పనులు జరుగుతున్నాయన్నారు. దర్శి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వాహనాలని తనిఖీ చేసిన ఎస్ఐ కమలాకర్



**ముండ్లమూరు, మే 9, ప్రభాతవార్త**
మండలంలోని శివరాంపురం చెక్‌పోస్టు వద్ద శుక్రవారం వాహనాల్ని తనిఖీ చేసిన ఎస్సై కమలాకర్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ యుద్ధం జరుగుతున్న సందర్భంగా ఎవరైనా అనుమానిత వ్యక్తులు గాని, వస్తువులు గాని అనుమానంగా ఉన్న వస్తువుల్ని సీజ్ చేయడం జరుగుతుందని, అనుమానంగా ఉన్న వ్యక్తుల్ని అరెస్టు చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఎవరైనా అనుమానంగా కనిపించిన వెంటనే ముండ్లమూరు పోలీసులని సంప్రదించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై వెంకటేశ్వరరెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంకమ్మ కొలుపులు ఉన్నట్టా.. లేనట్టా..?

## - గ్రూపులుగా విడిపోయిన భాగస్తులు

**నాగులుప్పలపాడు, మే 9, ప్రభాతవార్త**
ప్రత్యక్ష దైవంగా భావించే నాగులుప్పలపాడు అంకమ్మ తల్లి కొలుపులు ఉన్నట్టా లేనట్టా అర్థం కాక అయోమయంలో భాగస్తులు భక్తులు సుదీర్ఘ ప్రాంతాల్లో అవస్థలు పడుతున్నారు. కులమతాలకు అతీతంగా గ్రామస్తులతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన భక్తులు ఈ కొలుపుల్లో పాల్గొంటారు. ప్రతి మూడు సంవత్సరాలకి ఒక సారి నిర్వహించే ఈ కొలుపులు గతంలో గ్రామానికి చెందిన పెద్దలు ఉత్సవాల్లో ఉత్సవ పెద్దగా వ్యవహరించేవారు.

**విడిపోయిన భాగస్తులు :**
గతంలో కొలుపులు నిర్వహించిన ఆనాటి పెద్దలు మరణించడంతో వారి వారసులు నిర్వహణ చేసేవారు. నిర్వహణలో లోపాలు ఉన్నాయని ఆ పెద్ద పై పోలీసు కేసులు ఫిర్యాదులు చేశారు. ఆ కేసులు కొనసాగుతుండగా కుల పెద్ద రోడ్డు ప్రమాదంలో మరణించారు. దీంతో 2022 లో అంకమ్మ తల్లి దేవాలయ నిర్వహణలోను గ్రామానికి చెందిన కొందరు పెద్దగా వ్యవహరిస్తున్నారు. దీంతో భాగస్తులు, గ్రామస్తులు రెండుగా విడిపోయారు. కొలుపులు నిర్వహణలో లక్షలాది రూపాయలు దుర్వినియోగం అయ్యాయని అనేక ఫిర్యాదులు పోలీసులకు జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా గ్రూపులు వారీగా అందించారు. దీంతో ఈ ఏడాది నిర్వహించాలని కొలుపులు వివాదస్పదంగా మారాయి. ఇప్పటికే కోర్టుతో పాటు రెవెన్యూ కార్యాలయాలు, పోలీసు స్టేషన్ చుట్టూ భాగస్తులు ఫిర్యాదుల పరంపర సాగిస్తున్నారు. ఈ సమస్యను శాంతంపుగా కొలుపులు నిర్వహించే విధంగా పోలీసు యంత్రాంగం చేస్తున్న ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. దీంతో ఈనెల 10 నుండి జరగాల్సిన కొలుపులు ఉన్నట్టా లేనట్టా అని బక్తులు అయోమయంలో ఉన్నారు.

**రాజీ లేనట్టే :**
అంకమ్మ తల్లి కొలుపులు నిర్వహించే ఉద్దేశంతో ఇప్పటికే మండల తహశీల్దారన ఆర్డీఓ, పోలీసు శాఖ పలుమార్లు భాగస్తులను రాజీమార్గంలో చేసి కొలుపులు నిర్వహించేందుకు ప్రయత్నాలు సాగించిన ఆ ప్రయత్నాలు ముందుకు సాగలేదు. ఒక వర్గం కోర్టు నాశ్రయించి కొలుపులు నెరవేర్చుకునేందుకు పోలీసు ఎయిడ్ కావాలని కోరగా అందుకో పోలీసు సైడు ఇవ్వాల్సిందిగా కోర్టు ఆదేశించింది. ఆ ఉత్తర్వులపై మరో వర్గం కోర్టు ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో అధికారులు ఈ కొలుపులు కోర్టు పరిధిలో చేరడంతో రాజీ ప్రయత్నాలు విరమించుకొని జరుగుతున్న పరిణామాలను నిశ్చితంగా పరిశీలిస్తున్నారు.

# కిశోరి వికాసం సమ్మర్ క్యాంప్స్ ట్రైనింగ్



**నాగులుప్పలపాడు, మే 9, ప్రభాతవార్త**
నాగులుప్పలపాడు మండలంలోని అన్ని గ్రామాలలో కిశోరి వికాసం సమ్మర్ క్యాంప్స్ ట్రైనింగ్‌లో భాగంగా సెషన్-3 శుక్రవారం జరిగింది. ఈ సెషన్‌లో బాలల రక్షణ, బాల్య వివాహాలు, ఆరోగ్య ప్రభావాలు గూర్చి ఏఎన్ఎంఎస్, ఎంఎస్‌కేల, ఏడబ్ల్యూడబ్ల్యూలు పాల్గొని వివరించారు. ఈ సెషన్‌లో బాల్య వివాహాల వలన తీవ్రమైన ఆరోగ్య ప్రమాదాలు, చిన్న వయసులో గర్భం ధరించుట వలన మాతా, శిశు మరణాలకు దారి తీస్తుంది. అలాగే జీవిత కాల ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుందని కిశోరి బాలికలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్స్ బి.ఉషారాణి, కే.శ్రీదేవి పాల్గొన్నారు.

## ఐపిఎస్‌కు ఎంపికైనా ఉదయ్ కృష్ణరెడ్డికి ఘనసత్కారం







**సింగరాయకొండ, మే 9,ప్రభాతవార్త**
అవమానం జరిగిన చోటే తన సత్తా చాటి చెప్పిన సాధారణ పోలీస్ కానిస్టేబుల్ సివిల్స్ లో 350 ర్యాంకు సాధించి ఐపిఎస్ కు ఎంపికై మొట్టమొదటి సారి సింగరాయకొండ వస్తున్న ములగాని ఉదయ్ కృష్ణ రెడ్డి కి మండలంలోని ఊళ్ల పాలెం గ్రామస్థులు, స్నేహితులు పూల మాలలు తో ఘనంగా స్వాగతం పలికారు. శుక్రవారం సింగరాయకొండ నుండి ఊళ్లపాలెం గ్రామం వరకు గ్రామ ప్రజలు, స్నేహితులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ముందుగా పట్టణం లోని అంబెడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తీర ప్రాంతంలో అరకొర చదువులు అందే ప్రాంతం లో జాతీయ స్థాయి పోటీ పరీక్షల లో ఉదయ కృష్ణా రెడ్డి తన సత్తా చట్టాడు. ప్రజలకు తనవంతు సేవలు అందించాలనే లక్ష్యంతో చిన్న పోలీస్ కానిస్టేబుల్ గా ఎంపికై సమాజానికి సేవలు అందిస్తున్న ఉదయ కృష్ణా రెడ్డి కి తన పోలీస్ ఉన్నత అధికారుల నుండి వేధింపులు, ఎగతాళి అవమానం మానసికంగా కంగా కంగా తీశాయి. దానితో కసి పెంచుకున్న ఉదయ కృష్ణా రెడ్డి నూరు ఆరయినా అవమానం పొందిన దగ్గరే సత్తా చాటాలని గ్రామం నుండి పట్టణ బాట పట్టారు. నిరంతరం కఠోర శ్రమ సాధన చేసి తన సత్తా చాటి సివిల్స్ పరీక్షలో ఐపీఎస్ సాధించడం గ్రామ ప్రజలతో పాటు ఉదయ కృష్ణా రెడ్డి పట్టలేని ఆనందంతో ర్యాలీ నిర్వహించారు. తమ గ్రామ యువకుడు ఐ పి ఎస్ కి ఎంపిక కావడం తో ఊళ్ల పాలెం, బింగిన పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజలు తారతమ్యం లేకుండా పండుగ చేసుకున్నారు. దీక్ష పట్టుదల కసి నిబ్బరం ఉంటే ఉన్నత స్థాయికి వెళ్ళవచ్చని ఉదయ కృష్ణారెడ్డి నిరూపించడం స్థానిక ప్రజలు ఆయన బంధువులు, స్నేహితులు పేర్కొన్నారు. సంపాదన అంటే డబ్బు కాదు చదువు అని ప్రతి ఒక్కరు గుర్తించి ఉదయ కృష్ణారెడ్డిని ఆదర్శంగా తీసుకుని పిల్లలని బాగా చదివించాలని, పిల్లలు కూడ ఉన్నత స్థాయికి ఎదగడానికి చదువులపట్ల ఆసక్తి పెంచుకోవాలని తల్లిదండ్రులు, పెద్దలు కు పిలుపు ఇచ్చారు. అనంతరం గ్రామస్థులు, స్నేహితులు ఆధ్వర్యంలో శాలువా తో ఘనంగా సత్కరించారు.

# 200 కుటుంబాలు టీడీపీలో చేరిక



**చీరాల, మే 9 , ప్రభాతవార్త**
చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య యాదవ్ చీరాల తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్, యువ నాయకులు మద్దులూరి గౌరీ అమర్నాథ్ సమక్షంలో టీడీపీ పార్టీలోకి వలసల జోరు కొనసాగుతుంది. చీరాల మున్సిపాలిటీలో 20,21,22 వార్డుల నుండి వైసీపీకి చెందిన 200 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య యాదవ్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. గత వైసీపీ ప్రభుత్వంలో జగన్ రెడ్డి పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, సీఎం చంద్రబాబు ఒక పక్క సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రతి పేదవాన్ని ధనికుడిగా చేయాలనే సంకల్పంతో పీ-4 పద్దతిని ప్రవేశపెట్టారని అన్నారు.



10-5Pg5exJ.qxd:10-5Pg5exJ.qxd 10/05/25 10:33 PM Page 1



# ఎనిమిది పాక్ క్షిపణులు కూల్చివేత

## దాయాది దాడియత్నాలను తిప్పికొట్టిన భారత్



**న్యూఢిల్లీ, మే 9:** భారత్ చేతిలో పాకిస్థాన్‌కు మరో సారి భంగపాటు ఎదురైంది. ఉగ్రశిబిరాలపై దాడులకు ప్రతిగా డ్రోన్లు, క్షిపణులు, యుద్ధవిమానాలతో దాడికి పాక్ చేసిన ప్రయత్నాన్ని భారత బలగాలు తిప్పికొట్టాయి. విమానాశ్రయం, సైనిక కేంద్రాలే లక్ష్యంగా ప్రయోగించిన డ్రోన్లు, ఆరు యుద్ధవిమానాలను భారత సైన్యం నేలమట్టం చేసింది. పాక్ ప్రయోగించిన 8 క్షిపణులను నేలకూల్చింది. ఒక పాక్ పైలెట్‌ను పట్టుకుంది. భారత్‌వైపు ఎలాంటి నష్టం జరగలేదని రక్షణశాఖ ప్రకటించింది. గురువారం రాత్రి క్షిపణులు, ఆత్మాహుతి డ్రోన్లు, యుద్ధ విమానాలతో భారత్‌లో సరిహద్దు రాష్ట్రాలైన జమ్ముకశ్మీర్, రాజస్థాన్, పంజాబ్‌లో దాడులు చేసేందుకు విఫలయత్నం చేసింది. జమ్ము విమానాశ్రయంతో పాటు సరిహద్దుల్లోని పలు సైనిక కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంది. దాదాపు 35నిమిషాల పాటు పాక్ చేసిన దాడులను భారత్ బలగాలు అత్యంత సమర్థంగా తిప్పికొట్టింది. జమ్ము, ఉధంపూర్, అఖ్నూర్, పూంఛ్, రాజస్థాన్‌లోని జైసల్మేర్, పోఖ్రాన్, పంజాబ్‌లోని పఠాన్‌కోట్, జలంధర్ లక్ష్యంగా పాక్ డ్రోన్లు ప్రయోగించింది. సత్వారా, సాంబా, ఆర్ఎస్ పురాల్లో క్షిపణి దాడులకు పాకిస్థాన్ ప్రయత్నించింది. జమ్ము విమానాశ్రయం సహా పలు కీలక ప్రాంతాలవైపు డ్రోన్లు వచ్చాయి. ఆ సమయంలో ఆయా ప్రాంతాల్లో భారీ ఎతున సైరన్లు మోగాయి. వెంటనే ప్రజలంతా తమ ఇళ్లలోకి వెళ్లిపోయారు. దుకాణాలను మూసివేశారు. భారత గగనతల రక్షణ వ్యవస్థ డ్రోన్లు,క్షిపణులనుకూల్చేసింది. పోఖ్రాన్ ఆర్మీ స్టేషన్‌పై డ్రోన్ల దాడికి పాక్ యత్నించగా భారత్ అడ్డుకుంది. జలంధర్‌లో పాక్ డ్రోన్లను భారత రక్షణ వ్యవస్థ సమర్థంగా అడ్డుకుంది. ఉధంపూర్ లో పాకిస్థాన్ డ్రోన్లను భారత వైమానిక దళం అడ్డుకున్నప్పుడు పేలుళ్లు వినిపించాయి. జైసల్మేర్‌లోనూ భారత వైమానిక దళం డ్రోన్లను అడ్డుకుంది. ఆ సమయంలో స్థానికులకు పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. ఆకాశంలో ప్రకాశవంతమైన కాంతి కనిపించినట్లు చెప్పారు. పాకిస్థాన్‌కు చెందిన ఒక ఎఫ్16, రెండు జేఎఫ్17 సహా 6 యుద్ధ విమానాలను భారత సైన్యం కూల్చేసింది. ఎఫ్16 పైలట్ మన సైన్యానికి చిక్కాడు. అఖ్నూర్‌లో ఎస్400 రక్షణ వ్యవస్థ ఎఫ్16 విమానాన్ని కూల్చేసింది. జమ్ము యూనివర్సిటీకి సమీపంలో 2 పాక్ డ్రోన్లను భారత్ ధ్వంసంచేసింది. జమ్మూలో పలు సైనిక కేంద్రాలున్నాయి. విమానాశ్రయం వద్ద భారీ శబ్దాలు వినిపించాయని స్థానికులు తెలిపారు. పాక్ ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులను భారత్ అడ్డుకుని కూల్చివేయడం వల్లే పేలుళ్లు వినబడి ఉండొచ్చని సమాచారం. పాక్ దాడులు చేసిన సమయంలో రాజస్థాన్‌లోని బికనీర్, పంజాబ్ లోని జలంధర్‌లో బ్లాక్ అవుట్ విధించారు. కిస్త్వార్, అఖ్నూర్, సాంబా, జమ్ము, అమృత్ సర్, జలంధర్ లలోనూ బ్లాక్ అవుట్ అమలు చేశారు. శ్రీనగర్, రాజౌరిలోనూ అదే పరిస్థితి నెలకొంది. ఆ ప్రాంతాల్లో అధికారులు పూర్తిగా విద్యుత్ సరఫరాను నిలిపేశారు. పాక్ దాడులకు భారత్ అంతే తీవ్రంగా స్పందించింది. భీకరమైన ఎదురుదాడులకు దిగింది. పాక్‌లోని మరో రెండు వైమానిక రక్షణ వ్యవస్థలను కూల్చివేసినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. సర్గోధా, ఫైసలాబాద్ లోని రక్షణ వ్యవస్థలను కూల్చినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. పాకిస్థాన్ వాయు రక్షణ వ్యవస్థలను ధ్వంసం చేసినట్లు భారత సైనిక వర్గాలు కూడా వివరించాయి. పాక్ పంజాబ్ ప్రావిన్సులోని గగనతల ముందస్తు హెచ్చరిక వ్యవస్థ అవాక్స్‌ను భారత్ ధ్వంసం చేసింది. లాహోర్‌లో గురువారం పేలుళ్లు వినిపించాయి. వాల్టన్ ఎయిర్‌పోర్టు సమీపంలోని గోపాల్ నగర్, నసీరాబాద్ ప్రాంతాల్లో ఒక్కసారిగా భారీ శబ్దాలు వినిపించడం వల్ల సైరన్ల మోత మోగింది. భయాందోళనలకు గురైన ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. పొగ కమ్ముకున్న దృశ్యాలు కనిపించాయి. సియాల్‌కోట్, లాహోర్ విమానాశ్రయాల్లో విమానాలను రద్దుచేశారు. ఈ పేలుళ్లు వినిపించిన ప్రాంతాల పక్కనే పాక్ ఆర్మీ కంటోన్మెంట్ ఉంది. 5 నుంచి 6 అడుగుల డ్రోన్ కూలిపోవడం కారణంగా ఈ పేలుడు సంభవించి ఉండొచ్చని స్థానిక అధికారులు వెల్లడించారు. కరాచీలోనూ పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. జమ్ము, పఠాన్‌కోట్, ఉధంపూర్‌లను పాక్ డ్రోన్లు, క్షిపణులు లక్ష్యంగా చేసుకున్నాయని రక్షణశాఖ ప్రకటించింది. వెంటనే వాటిని నిర్వీర్యం చేశామని తెలిపింది. ఈ దాడుల్లో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని రక్షణశాఖ అధికార ప్రతినిధి గురువారం రాత్రి తెలిపింది. దేశ సార్వభౌమత్వం, ప్రజల భద్రత పరిరక్షణకు పూర్తి సిద్ధంగా ఉన్నట్లు రక్షణశాఖ వెల్లడించింది. మరోవైపు దాడి చేసి భంగపడిన పాకిస్థాన్ సరిహద్దుల్లోని భారత సైనిక కేంద్రాలను పేల్చేశామని అసత్యాలు వల్లెవేసింది. పాకిస్థాన్ సమాచారశాఖ మంత్రి అత్తావుల్లా తరార్ మీడియా సంస్థలకు ఈ విషయం తెలిపారు. 40 నుంచి 50 మంది భారత సైనికులు చనిపో యారని వివరించారు. ఆయన వ్యాఖ్యలను భారత్ ఖండించింది. అన్ని డ్రోన్లను అడ్డుకున్నామని స్పష్టంచేసింది. ఎలాంటి నష్టం జరగలేదని వివరించింది.



### టెరిటోరియల్ ఆర్మీని కూడా

# రంగంలోకి దించండి

## ఆర్మీ చీఫ్‌కు విశేష అధికారాలు

**న్యూఢిల్లీ, మే 9:** పాకిస్థాన్ పన్నాగాలకు చెక్ పెట్టేందుకు భారత ఆర్మీ చీఫ్‌కు కేంద్ర ప్రభుత్వం మరిన్ని అధికారులను కట్టబెట్టింది. డ్రోన్లు, మిస్సైల్స్‌తో దాడులు చేసిన పాకిస్థాన్‌కు భారత్ చుక్కలు చూపించడంతో దాయాది దేశం మరో కుతంత్రానికి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పాక్ ఎత్తులను చిత్తు చేసేందుకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. అవసరమైతే టెరిటోరియల్ ఆర్మీని రంగంలోకి దించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది కేంద్ర ప్రభుత్వం. టెరిటోరియల్ ఆర్మీలోని అధికారులను, నమోదు చేసుకున్న సిబ్బందిని పిలిచేందుకు ఆర్మీ చీఫ్‌కు అధికారం కల్పించింది కేంద్రం. రెగ్యులర్ ఆర్మీతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలని సూచించింది. ఇప్పటి వరకు టెరిటోరియల్ ఆర్మీ సిబ్బంది పలు సందర్భాల్లో యుద్ధాల్లో పాల్గొన్నారు. 1962, 1965, 1971ల్లో జరిగిన యుద్ధాల్లో భారత సైన్యంతో కలిసి పనిచేశారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సేవ కార్యక్రమాలు చేశారు. ఇటీవల కేరళలో వరదలు వచ్చిన సేవలు అందించిన మాలీవుడ్ స్టార్ హీరో మోహన్ లాల్ కూడా టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కర్నల్ స్థాయి అధికారే. ధోనీ, సచిన్, అనురాగ్, ఆ జాబితాలో మోహన్ లాల్‌తోపాటు టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ, కాంగ్రెస్ నేత సచిన్ పైలట్, భారత మాజీ దిగ్గజం కపిల్ దేవ్, బీజేపీ నేత అనురాగ్ ఠాకూర్, అథ్లెట్ అభినవ్ బింద్రా సహా పలువురు సెలబ్రిటీలు టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కర్నల్ స్థాయిలో ఉన్నారు. అయితే కనీస అర్హత సర్వీస్ పూర్తి చేసిన వారికి పింఛనుతోపాటు క్యాంటీన్, మెడికల్, ఎల్‌టీ అలవెన్సులు అందిస్తుంది కేంద్ర ప్రభుత్వం. టెరిటోరియల్ ఆర్మీ గురించి ఒక్క చెప్పాలంటే సైనిక రిజర్వ్ ఫోర్స్ అనిచెప్పవచ్చు. ఇందులోని వారికి అధి కారులకు రెగ్యులర్ ఆర్మీ తరహాలోనే శిక్షణ ఉం టుంది. వారంతా బయట తమ పనులు చేసు కుంటూనే వాలంటరీగా సైన్యంతో పనిచేస్తుంటారు. ప్రస్తుతం దాదాపు 50వేలమంది వరకు అలా ఉన్నట్లు సమాచారం. ఈ ఆర్మీ అధికారుల్లో పలువురు శౌర్య, విశిష్ట పురస్కారాలను అందుకున్నారు.



# మా పిఎం పిరికివాడు..

## భారత్‌తో ఎలా పోరాడగలం?: పాకిస్థాన్ ఎంపి షాహిద్ అహ్మద్

**ఇస్లామాబాద్, మే 9:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్'ను చేపట్టిన భారత్ పాక్‌లోని ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. ఈ పరిణామాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న దాయాది దేశం.. భారత్‌పై దాడులకు విఫలయత్నం చేస్తోంది. పాక్ దాడులను భారత బలగాలు సమర్థంగా తిప్పికొడుతున్నాయి. గగనతల రక్షణ వ్యవస్థలనూ ధ్వంసం చేశాయి. ఈ పరిణామాలతో పలువురు పాక్ ప్రజలు, రాజకీయ నాయకులు అక్కడి ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా పాక్‌కు చెందిన తెహ్రీక్-ఏ-ఇన్సాఫ్ (పిటిఐ) పార్టీ ఎంపి షాహిద్ అహ్మద్ ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌పై తీవ్ర విమర్శలు చేశారు. పార్లమెంట్‌లో ప్రసంగిస్తూ తమ ప్రధాని పిరికివాడని, భారత ప్రధాని నరేంద్రమోడీ పేరు పలకడానికి కూడా ఆయన భయపడుతున్నారని అన్నారు. టిప్పు సుల్తాన్ చెప్పిన కోట్‌ను ప్రస్తావిస్తూ సింహాల సైన్యాన్ని నక్క నడిపిస్తే, అవి యుద్ధంలో పోరాడలేక ఓడిపోతాయని అన్నారు. అదేవి ధంగా సరిహద్దుల్లో ఉన్న తమ సైనికులు ధైర్యంగా భారత్‌తో పోరాడాలనుకున్నా దేశ ప్రధానికే ధైర్యం లేనప్పుడు వాళ్లు ముందడుగు ఎలా వేయగలరని ప్రశ్నించారు. భారత్ దాడి చేసినప్పటి నుంచి ఆ దేశానికి వ్యతిరేకంగా పాక్ ప్రధాని ఒక్క ప్రకటన కూడా చేయలేదని ఎంపి షాహిద్ అహ్మద్ దుయ్యబట్టారు. ఇటువంటి పరిస్థితుల్లో సరిహద్దులో నిలబడి ఉన్న పాకిస్థాన్ సైనికులకు ప్రభుత్వం ఏం ఆదేశాలు ఇస్తుందని నిలదీశారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవా దంపై పోరు తలపెట్టిన భారత్‌ను ఇబ్బంది పెట్టేందుకు పాకిస్థాన్ గురువారం రాత్రి దాడులకు దిగింది. అందులో భాగంగా జమ్మూ కశ్మీర్, రాజస్థాన్, పంజాబ్, హర్యానా సరిహద్దు ప్రాంతాల్లో డ్రోన్‌లను ప్రయోగించింది. అయితే, భారత సైన్యం వాటిని సమర్థంగా తిప్పికొట్టింది. ఉధంపూర్, సాంబా, జమ్మూ, అఖ్నూర్, నగ్రోటా, పఠాన్‌కోట్ ప్రాంతాల్లో పాక్ దాడి చేసిన 50 డ్రోన్లను భారత ఆర్మీ కూల్చేసింది.




# మేం జోక్యం చేసుకోం

## భారత్-పాక్ ఉద్రిక్తతలపై యుఎస్ ఉపాధ్యక్షుడు జెడి వాన్స్

**వాషింగ్టన్, మే 9:** భారత్-పాకిస్థాన్ మధ్య జరుగుతున్న సైనిక ఘర్షణలో తాము జోక్యం చేసుకోబోమని అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ తేల్చి చెప్పారు. ఫాక్స్ న్యూస్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'రెండు అణుశక్తి దేశాలు ఘర్షణ పడుతూ భారీ సంక్షోభం వైపు రావడంపై మేము ఆందోళన చెందుతున్నాం. వీలైనంత తొందరగా పరిస్థితులు శాంతించాలని కోరుకుం టున్నాం. పాకిస్థాన్‌పై భారత్‌కు కొన్ని ఫిర్యాదు లున్నాయి. న్యూఢిల్లీ చర్యలకు పాక్ స్పంది స్తోంది. పరిస్థితులు తగ్గుముఖం పట్టేలా చేయాలని మేము వీరిని ప్రోత్స హించగలం. కానీ, యుద్ధంలో మాత్రం తలదూర్చం. అది మా పని కాదు. అమెరికాతో దానికి ఏమాత్రం సంబంధం లేదు' అని వాన్స్ వెల్లడించారు. 'భారత్, పాక్ ఆయుధాలు వదిలేయాలని అమెరికా చెప్పదు. కానీ, దీనికి ఉన్న ఏకైక మార్గం చర్చల ద్వారా సమస్యలను పరిష్కరిం చుకోవడం. అది ప్రాంతీయ సంక్షోభానికి దారితీయకుండా చూసుకోవడం' అని వాన్స్ అన్నారు. గురువారం రాత్రి భారత్-పాక్ మధ్య ఘర్షణ పతాక స్థాయికి చేరింది. దీంతో పొరుగు దేశంలో నుంచి భారత్‌పైకి వచ్చిన దాదాపు 50 డ్రోన్లను సైన్యం కూల్చివేసింది.
మరోవైపు భారత్-పాకిస్థాన్ ఉద్రిక్తతలపై అమెరికా విదేశాంగశాఖ ప్రతినిధి టామీ బ్రూస్ స్పందించారు. 'ప్రస్తుత ఉద్రిక్తతలు మరింత పెరగకూడదన్నారు. ఇరు దేశాల మధ్య ఈ పరిస్థితి కొన్ని దశాబ్దాలుగా ఉంది. ఉగ్రదాడి తర్వాత మనం చూస్తున్నది ఆశ్చర్యమేమీ కాదు. కాకపోతే ఇవి మరింత పెరగకూడదు. చర్చలు జరగడానికి కమ్యూనికేషన్లు చాలా ముఖ్యం. అంతేకానీ, నిశ్శబ్దంగా ఉండకూడదు. అమెరికా ఇప్పటికే గత రెండురోజుల నుంచి ఇరు దేశాల్లో వివిధ స్థాయి నాయకులతో మాట్లాడుతోంది. ఇక పాకి స్థాన్ పహల్గాం దాడిపై స్వతంత్ర దర్యాప్తును కోరుతోంది. మేము ఉగ్ర కుట్రదారులను చట్టం ఎదుటకు తెచ్చి శిక్షించాలని కోరుతున్నాం' అని బ్రూస్ వెల్లడించారు.

# భారత్‌పై పాక్ సైబర్ దాడులు

## డ్యాన్స్ ఆఫ్‌ది హిల్లరీ కొత్త వైరస్‌తో ప్రయోగం



**న్యూఢిల్లీ, మే 9:** పహల్గాం ఉగ్రదాడికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. మంగళవారం రోజు అర్ధరాత్రి పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 ఉగ్రస్థావరాలపై క్షిపణి దాడులు చేసింది. ఈ ఘటనలో 100 మంది ఉగ్రవాదులు హతమవ్వగా ఆ దేశం సైతం భారత్‌పై ప్రతీకార చర్యలకు దిగింది. ఓవైపు ఎల్ఓసీ వెంట కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూనే దాడులకు పాల్పడుతోంది. అలాగే భారత్‌ను ఎలాగైనా దెబ్బ కొట్టాలనే ఉద్దేశంతో సరికొత్త సోషల్ వైరస్‌ను వ్యాప్తి చేస్తోంది. ముఖ్యంగా డ్యాన్స్ ఆఫ్ ద హిల్లరీ అనే వైరస్‌ను భారత ప్రజలపైకి ప్రయోగిస్తోంది. అయితే ఇదొక సైబర్ దాడి కాగా.. ఇది ఎక్కడ కనిపించినా దీన్ని క్లిక్ చేయొద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు.
పహల్గాం ఉగ్రదాడికి భారత్ ప్రతీకార చర్యలు తీసుకుంటోంది. ఓవైపు దౌత్యపరంగా దాయాది దేశానికి చుక్కలు చూపిస్తూనే మరోవైపు మెరుపు దాడులు చేసింది. ఉగ్రస్థావరాలే లక్ష్యంగా క్షిపణి దాడులు చేయగా ఆ దేశం సైతం ప్రతిచర్యలకు పాల్పడుతుంది. ఎల్ఓసీ వెంట కాల్పులు జరుపుతూ, క్షిపణి దాడులు చేస్తూ దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తుండగా భారత్ ఆర్మీ సైతం వాటికి దీటుగా బదులిస్తోంది. మరోవైపు సరికొత్త సోషల్ వైరస్‌ను వ్యాప్తి చేస్తూ భారత ప్రజలకు చుక్కలు చూపించేందుకు ప్రయత్నిస్తోంది. ముఖ్యంగా డ్యాన్స్ ఆఫ్ ద హిల్లరీ అనే వైరస్‌ను తాజాగా పాక్ భారత ప్రజలపైకి ప్రయోగిస్తోంది. అయితే ఇదొక సైబర్ దాడి కాగా ఇది ఎక్కడ కనిపించినా దీన్ని క్లిక్ చేయొద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారత్, పాక్ ఉద్రిక్తతల వేళ దాయాది దేశం సైబర్ దాడికి ప్రయత్నిస్తోందని చెబుతున్నాయి. ముఖ్యంగా డ్యాన్స్ ఆఫ్ ద హిల్లరీ అనే వైరస్‌ను వ్యాప్తి చేస్తున్నట్లు వివరించారు. ఫేస్‌బుక్, వాట్సాప్, ఈమెయిల్, టెలిగ్రామ్ వంటి యాప్లలో ఇది వ్యాప్తి అవుతుండగా దీనికి సంబంధించిన లింక్ ఎక్కడ కనిపించినా దాన్ని క్లిక్ చేయొద్దని వివరిస్తు న్నాయి. దీనిపై క్లిక్ చేస్తే ఫోన్, ల్యాప్‌టాప్ లలో ఉన్న డేటా సహా బ్యాంకు వివరాలు వంటివి కూడా హ్యాక్‌కు గురవుతాయని పేర్కొం టున్నాయి. రహస్య సమాచారాన్ని దొంగిలిం చడానికి, డిజిటల్ పరికరాలను దెబ్బ తీయడం కోసం ఈ వైరస్ రూపొందించారు. పాకిస్థాన్‌కు చెందిన సైబర్ నేరగాళ్లు తయారు చేసిన ఈ వైరస్ హానికరమైన మాల్వేర్ అని తెలుస్తోంది. ఫోన్లలో ఏవైనా ఫైల్స్ ఓపెన్ చేయడానికి వినియోగదారులు ప్రయత్నిస్తుంటే ఈ వీడియో, లింక్ కనిపిస్తుంది. పొరపాటున దీన్ని క్లిక్ చేశారంటే క్షణాల్లోనే వైరస్‌ను మీ ఫోన్ లేదా ల్యాప్‌టాప్‌లో ఇన్‌స్టాల్ చేస్తుంది. ఆపై హ్యాకర్లకు మీ ఫోన్‌పై పూర్తి నియంత్రణను అందజేస్తుంది. ఫోన్ లేదా ల్యాప్‌టాప్‌లో ఈ వైరస్ ఇన్‌స్టాల్ అయిందంటే బ్యాంకింగ్ పాస్‌వర్డులు, వ్యక్తిగత సమాచారాన్ని హ్యాకర్లకు అందజేస్తుంది. రహస్యమైన ఫైళ్లను కూడా యాక్సెస్ చేసి లీక్ చేయగల్గుతుంది. అలాగే మీ పరికారలను స్లో చేయడం, క్రాష్ చేయడం వంటివి కూడా చేస్తుంది. ఫోన్లు, కంప్యూటర్లు వేటిలో అయినా సరే ఈ వైరస్ ఇన్‌స్టాల్ అయితే హ్యాకర్లు ఏమైనా చేయగల్గుతారు. మీ పరికరాలను మీ ఆధీనంలోంచి సులువుగా వారి ఆధీనంలోకి తీసుకుంటారు. యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# ఛండీఘర్, జమ్ములో సైరన్ల మోత

### తీవ్ర స్థాయికి చేరిన ఉద్రిక్తత

**చండీఘర్, మే 9:** భారత్‌పాక్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరుకుంటున్నాయి. సరిహద్దు జిల్లాలపై పాక్ వైపు నుంచి ముప్పు పొంచి ఉండటం వల్ల అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ క్రమంలోనే చండీగఢ్‌లో వైమానికదళం శుక్రవారం సైరన్లు మోగించి హెచ్చరిక జారీ చేసింది. దాడులు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. బాల్కనీల్లోకి కూడా రావొద్దని స్పష్టం చేసింది. అటు జమ్ములోనూ శుక్రవారం ఉదయం సైరన్లు మోగాయి. ఈ తెల్లవారుజామున 4.15 గంటల ప్రాంతంలో పేలుడు శబ్దాలు వినిపించినట్లు సమాచారం. దీంతో ఆ నగరాన్ని బ్లాక్‌అవుట్ చేశారు. సరిహద్దు జిల్లాల్లో పాకిస్థాన్ నుంచి వస్తోన్న డ్రోన్లను భారత బలగాలు సమర్థంగా కూల్చేస్తున్నాయి. రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో ఓ హోటల్ ప్రాంగణంలో పాక్ డ్రోన్ శకలాలు లభ్యమయ్యాయి. అధికారులు ఆ శకలాలను పరిశీలిస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున 4.30 గంటల ప్రాంతంలో ఈ దాడి జరిగింది. బీఎస్ఎఫ్ క్యాంప్‌ను లక్ష్యంగా చేసుకొని డ్రోన్‌ను పంపగా, భద్రతా బలగాలు కూల్చేశాయి. మరో వైపు దేశవ్యాప్తంగా జరగాల్సిన సీఏ పరీక్షలు వాయిదా పడ్డాయి. భారత్‌పాక్ నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో పరీక్షల వాయిదా నిర్ణయం తీసుకున్నట్లు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ప్రకటించింది. మే 9 నుంచి 14 వరకు జరగాల్సిన సీఏ ఇంటర్మీడియట్, ఫైనల్, పోస్ట్ క్వాలిఫికేషన్ పరీక్షలు వాయిదా పడ్డాయని, ఈ షెడ్యూల్‌ను త్వరలో ప్రకటిస్తామని తెలిపింది. దీనికి సంబంధించిన సమాచారం కోసం పరీక్షకు నమోదు చేసుకున్న అభ్యర్థులు ఐసిఏఐ వెబ్‌సైట్‌లో అధికారిక నోటీసును తనిఖీ చేసుకో వాలని సూచించింది. మునుపటి షెడ్యూల్ ప్రకారం దితి పరీక్షలు మే 2నుంచి 14 వరకు జరగాల్సి ఉంది. గ్రూప్ 1 అభ్యర్థులకు సిఎ ఇంటర్ పరీక్ష మే 3, 5, 7 తేదీల్లో, గ్రూప్ 2 పరీక్షలు మే 9, 11, 14 తేదీల్లో జరగాల్సి ఉంది. గ్రూప్ 1తుది పరీక్ష మే 2, 4,6 తేదీల్లో నిర్వహించగా, గ్రూప్ 2పరీక్ష మే 8,10,13 తేదీలలో జరగాలి.



# కీలక భద్రతా సమావేశాలు జరిపిన అమిత్ షా

**న్యూఢిల్లీ, మే 9:** ఆపరేషన్ సిందూర్‌తో భారత్, పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. పాక్ రెచ్చగొట్టే చర్యలకు దీటుగా బదులిచ్చేందుకు కేంద్రం అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. అన్ని అత్యవసర వ్యవస్థల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది. ఈ క్రమంలో వరుస భేటీలు జరుగుతున్నాయి. తాజాగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా , డైరెక్టర్ జనరల్ ఆఫ్ బిఎస్ఎఫ్, డైరెక్టర్ జనరల్ ఆఫ్ సిఐఎస్ఎఫ్, హోంశాఖలోని సీనియర్ అధికారులతో భేటీ అయ్యారు. సరిహద్దుల్లో, విమానాశ్రయాల్లో భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సమావేశానికి జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ కూడా హాజరయ్యారు. కేంద్రమంత్రి నివాసంలో ఈ భేటీ జరిగింది. చొరబాటు ఘటనలు చోటుచేసుకుంటున్న తరుణంలో పాక్‌తో సరిహద్దు పంచుకుంటున్న ఆయా రాష్ట్రాలు ఇప్పటికే కీలక చర్యలు చేపట్టాయి. మనదేశంలోకి చొరబాటుకు యత్నించిన పాకిస్థాన్‌కు చెందిన వ్యక్తిని పంజాబ్ సరిహద్దు వద్ద బిఎస్ఎఫ్‌కు చెందిన జవాన్లు హతమార్చిన సంగతి తెలిసిందే. రాజస్థాన్‌లో 1,037 కిలోమీటర్లున్న పాక్ సరిహద్దును మూసివేశారు. ఎవరైనా సరిహద్దుల వద్ద అనుమానాస్పదంగా వ్యవహరిస్తే కాల్చివేసేలా ఉత్తర్వులు జారీ చేశారు. జమ్మూకశ్మీర్‌లోని సాంబ జిల్లాలో సరిహద్దు దాటి చొరబడేందుకు పాక్ ఉగ్రవా దులు చేసిన ప్రయత్నాలను బిఎస్ ఎఫ్ తిప్పికొట్టింది. కనీసం ఏడుగురు ఉగ్రవా దులను మట్టుపెట్టినట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. పాకిస్థాన్ నేడు కూడా నియంత్రణ రేఖకు ఆవలివైపు నుంచి భారీస్థాయిలో షెల్లింగ్ కొనసాగిస్తోంది. ముఖ్యంగా ఉరి, జమ్మూకశ్మీర్ ప్రాంతాల్లో వీటి తీవ్రత ఎక్కువగా ఉంది. చాలామంది ప్రజలు ఇప్పటికే ఈ ప్రాంతాల్లో ఇళ్లు ఖాళీ చేసి వెళుతున్నారు.



# రుణాల కోసం పాకిస్థాన్ వెంపర్లాట

## 'ఎక్స్' ఖాతా హ్యాక్ అంటూ బుకాయింపు

**ఇస్లామాబాద్, మే 9:** భారత ఆర్మీ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' ఎఫెక్ట్ పాకిస్థాన్‌పై తీవ్రంగానే పడింది. దీంతో పాకిస్థాన్ ఆర్థిక పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. భారత్‌పై దుర్మార్గపు దాడులకు పాల్పడుతూ ఆర్థికంగా మరింత కిందికి దిగ జారిపోయింది. వాటి నుంచి బయటపడేందుకు అంతర్జాతీయ సంస్థల నుంచి రుణాల కోసం వెంపర్లాడుతోంది. తమకు ఆర్థిక సాయం చేయాలని సోషల్ మీడియా వేదికగా పోస్టుపెట్టింది. ఇందులో భారత్‌పై అక్కసు వెళ్లగక్కడంతో నెట్టింట విపరీతంగా విమర్శలు ఎదుర్కొంది. దీంతో తాము రుణాల కోసం ఏ పోస్టు చేయలేదని తమ 'ఎక్స్' ఖాతా హ్యాక్ అయిందని ప్రకటించడం గమనార్హం. దానిని సమర్థించుకొనేందుకు 'ఫ్యాక్ట్ చెక్' చేసినట్లు ఆ దేశ సమాచార శాఖ ఓ పోస్టు చేసింది. **పాకిస్థాన్‌కు రుణాలు ఇవ్వొద్దు: భారత్** పాకిస్థాన్‌కు అంతర్జాతీయ సంస్థల నుంచి ఎలాంటి రుణాలు రాకుం డా అడ్డుకొనేందుకు భారత్ తీవ్రంగా ప్రయ త్నిస్తోందని కథనాలు వస్తున్నాయి. ఇప్పటికే భారత్ విధానం ఏమిటో విదేశాంగ కార్యదర్శి విక్రంమిస్రీ స్పష్టతఇచ్చారు. అంతర్జాతీయ మాని టరీఫండ్ (ఐఎంఎఫ్)తో భేటీ కానున్న నేప థ్యంలో పాక్‌'పోస్టులు' ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# మహిళా అధికారుల స్థైర్యాన్ని దెబ్బతీయకండి

## కేంద్రానికి సుప్రీం బెంచ్ చురకలు

**న్యూఢిల్లీ, మే 9:** స్వల్పసేవా కమిషన్ కింద ఎంపికయిన మహిళా ఆర్మీ అధికారులకు శాశ్వత కమిషన్ నిరాకరించడంపై దాఖలయిన పిటిషన్లను సుప్రీంకోర్టు విచారించింది. వారి స్థైర్యాన్ని దెబ్బతీయవద్దంటూ భారత్ పాక్ ఉద్రిక్త పరిస్థితులను పరోక్షంగా ప్రస్తావించింది. ప్రస్తుతానికి సర్వీసునుంచి విడుదలచేయొద్దని కేంద్రాన్ని ఆదేశించింది. వారు చాలా తెలివైన అధికారులని, మీరు వారి సేవలనువేరేచోట ఉపయోగించుకోవచ్చుని, ఇది కోర్టుచుట్టూ తిరగాల్సిన సమయం కాదని, దేశానికి సేవచేయడానికి వారికంటూ మంచి స్థానం ఉందని సుప్రీం ధర్మాసనం వెల్లడించింది. విచారణలో కేంద్రం తరపున అడిషనల్ సొలిసిటర్‌జనరల్‌ఐశ్వర్య భాటి వాదనలు వినిపించారు. వారిని షార్ట్ సర్వీస్ నుంచి విడుదల చేయడానికి సంబంధించి ఎలాంటి స్టే ఉత్తర్వులు ఇవ్వవద్దని కోర్టును కోరారు. భారత సైన్యానికి యువ అధికారులు అవసరమని, ప్రతి ఏటా 250 మందిసిబ్బందికి మాత్రమే శాశ్వతకమిషన్ మంజూరు చేస్తున్నారన్నారు. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది ఆపరేషన్ సింధూర్‌గురించి మీడియాకు తెలిపిన ఇద్దరు మహిళా అధికారుల్లో ఒకరైన కల్నల్ సోఫియా ఖురేషిగురించి ప్రస్తావించారు. ఇదే విషయంలో సోఫియా గతంలోసుప్రీంకోర్టును ఆశ్రయించారని ఇపుడు ఆమె దేశాన్ని గర్వపడేలాచేస్తున్నారన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్నకోర్టు తదుపరి విచారణవరకూ పిటిషన్లు వేసిన అధికారులను విడుదలచేయవద్దని ఆదేశాలు జారీచేసింది. ఆర్మీలో తమకూ శాశ్వత కమిషన్ అవకాశం కల్పిం చాలని మహిళా సైనిక అధికారులు కొన్నేళ్లపాటు న్యాయపోరాటంచేసారు. ఆ సందర్భంగాకల్నల్‌సోఫియా విజయపరంపర సర్వోన్నత న్యాయస్థానం దృష్టికి వచ్చింది. ఆమె సేవలను చూపుతూ మహిళలు ఆర్మీలో శాశ్వతకమిషన్‌కు అర్హులేనంటూ 2020 ఫిబ్రవరి 17న ఇచ్చిన తీర్పులో స్పష్టంచేసింది. అప్పటివరకూ ఆర్మీలో మహిళా అధికారుల సేవలనుషార్ట్‌సర్వీస్‌కమిషన్‌కే పరిమితంచేసారు. మహిళల శారీరక స్వభావాన్ని సామాజిక జీవన వాతావరణాన్ని సాకుగాచూపిస్తూ వారికి శాశ్వత కమిషన్ నిరాకరిస్తున్నారు. ఈ వాదనలను సమర్థించలేమని తాజాగా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.



# ఎన్ఇపి అమలు కోసం ఏరాష్ట్రాన్ని బలవంతపెట్టలేం..

## తమిళ వ్యక్తి పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీం

**న్యూఢిల్లీ, మే 9:** జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) 2020 అమలుచేయాలని ఏ రాష్ట్రాన్ని బలవంతం చేయలేమని సుప్రీంకోర్టు పేర్కొంది. ఎన్ఈపీని అమలు చేసేలా తమిళనాడు రాష్ట్రానికి ఆదేశాలు ఇవ్వాలంటూ జీఎస్ మణి దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత ధర్మాసనం శుక్రవారం కొట్టివేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ప్రకారం ఏ రాష్ట్రాన్ని కూడా ఎన్ఈపీని స్వీకరించాలని సుప్రీంకోర్టు కచ్చితంగా చెప్పలేదని జస్టిస్ జె.బి.పార్దివాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం వివరించింది. రాష్ట్రాలు జాతీయ విద్యా విధానం 2020ని స్వీకరించాలా, వద్దా అనేది సంకటమైన సమస్య. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ద్వారా సుప్రీంకోర్టు పౌరుల హక్కులను పరిరక్షించడానికి ఆదేశాలు జారీ చేయవచ్చు. జాతీయ విద్యా విధానం 2020 వంటి విధానాన్ని స్వీకరించమని నేరుగా చెప్పలేదని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే, జాతీయ విద్యా విధానానికి సంబంధించి రాష్ట్రం తీసుకునే ఏదైనా చర్య ప్రాథమిక హక్కును ఉల్లంఘిస్తే కోర్టు తప్పకుండా జోక్యం చేసుకుంటుందని వెల్లడించింది. అయితే, జాతీయ విద్యా విధానానికి సంబంధించి రాష్ట్రం తీసుకునే ఏదైనా చర్య ప్రాథమిక హక్కును ఉల్లంఘిస్తే కోర్టు తప్పకుండా జోక్యం చేసుకుంటుందని వెల్లడించింది. ఈ సందర్భంగా పిటిషనర్‌ను ఉద్దేశించి ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. మీరు ఎవరు? జాతీయ విద్యా విధానంతో మీకు సంబంధం ఏమిటి? ఈ విషయంలో ఎందుకు ఆసక్తి చూపుతున్నారని కోర్టు పిటిషనర్‌ను అడిగింది. తాను తమిళనాడుకు చెందినవాడినని, ఇప్పుడు దిల్లీలో ఉంటున్నట్లు పిటిషనర్ కోర్టుకు తెలిపారు. తమిళనాడు పాఠశాలల్లో హిందీ బోధించకపోవడం వల్ల హిందీని సులభంగా నేర్చుకోలేకపోతున్నానని ఆయన అన్నారు. పిటిషనర్ తమిళనాడుకు చెందినవాడు కావొచ్చని, అయినప్పటికీ అతను దిల్లీలో నివసిస్తున్నారని, ఇక్కడ హిందీ నేర్చు కోవచ్చని జస్టిస్ పార్దివాలా అభిప్రాయపడ్డారు. ఒక రాష్ట్రం తీసుకునే ఏదైనా చర్య ఎన్ఈపీకి వ్యతిరేకంగా ఉంటే, కోర్టు జోక్యం చేసుకోవచ్చని కోర్టు చెప్పింది. అయితే ఈ పిటిషన్ లో అలాంటిదేమీ కనిపించలేదని వివరించింది. రాష్ట్రంలో ఎన్ఈపీని అమలు చేయబోమని ఇటీవల తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ చెప్పారు. త్రిభాషా సూత్రం ప్రకారం హిందీని రుద్దే ప్రయత్నమని ఆయన అన్నారు.



10-5Pg6exHMNWJQE.qxd:10-5Pg6exHMNWJQE.qxd 10/05/25 12:01 AM Page 1



# తక్కువ కాలంలో ఎక్కువ కేసులు పరిష్కరించిన జడ్జి డా.జస్టిస్ కె.మన్మధరావు

## - రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్



జస్టిస్ మన్మధరావు వీడ్కోలు సభలో రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ తదితరులు

**విజయవాడ,మే9,ప్రభాతవార్తప్రతినిధి:** అనతి కాలంలోనే అత్యధికంగా 1100 కేసులకు పైబడి పరిష్కరించిన జడ్జి డా.జస్టిస్ కె.మన్మధరావు అని రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ అభినందించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయమూర్తిగా సేవలు అందజేస్తున్న డా.జస్టిస్ కె.మన్మధరావు కర్ణాటక హైకోర్టుకు బదిలీపై వెళుతున్న సందర్భంగా శుక్రవారం హైకోర్టు మొదటి కోర్టు హాల్లో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ వీడ్కోలు కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మధరావు సేవలను కొనియాడారు. 2021 డిశంబరు 8 న హైకోర్టు జడ్జిగా భాద్యతలు చేపట్టిన వీరికి న్యాయ శాస్త్రము, న్యాయ వృత్తిపై ఎంతో పట్టు, అనుభం ఉండటమే కాకుండా మంచి కృషి, పట్టుదల, అంకితభావంతో న్యాయ వ్యవస్థకు గణనీయమైన సేవలు అందజేశారని ప్రశంసించారు. స్నేహశీలి, మర్యాదస్థుడు మరియు కష్టపడి పనిచేసే మనస్తత్వం ఉన్న వీరు పరిపాలనా పరంగా, పలు కమిటీల్లో సభ్యులుగా కూడా మంచి సేవలను అందజేశారన్నారు. 2014 లో డా.బి.ఆర్.అంబేద్కర్ జ్ఞాన విజ్ఞాన రత్న అవార్డును పొందిన వీరు న్యాయవ్యవస్థలోని అన్ని విభాగాల్లో చట్టపరమైన చతురతలో నైపుణ్యాన్ని ప్రదర్శించారని ప్రశంసించారు. కర్ణాటక హైకోర్టుకు బదిలీపై వెళుతున్న వీరు అంకితభావం సేవలు అందజేస్తూ కర్ణాటక హైకోర్టు ప్రతిష్టను మరింత ఇనుమడింపజేస్తారని ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. కర్ణాటకా హైకోర్టు కు బదిలీపై వెళుతున్న డా. జస్టిస్ కె.మన్మధరావు మాట్లాడుతూ అందరి సహకారంతో ఎన్నో సంవత్సరాలుగా నిజాయితీ, క్రమశిక్షణ మరియు బలమైన కర్తవ్య భావనతో న్యాయ వ్యస్థకు గణనీయమైన సేవలు అందజేయడం జరుగుచున్నదన్నారు. న్యాయ మూర్తి పదవి గౌరవాన్ని, ప్రతిష్టను ఇనుమడించే విధంగా కేవలము 727 రోజుల్లోనే 11,972 కేసులను పరిష్కరించి వాజ్యదారులకు సంతృప్తికరమైన సేవలను అందజేయడం జరిగిందన్నారు. న్యాయం కోసం హైకోర్టును ఆశ్రయించిన వారిని ఎవ్వరినీ నిరుత్సాహపర్చకుండా ఎన్నో గంటల పాటు వారి వేదనలను ఆలకిస్తూ సంతృప్తికర స్థాయిలో వారికి తగిన న్యాయాన్ని అందజేయడం జరిగిందన్నారు.

# గిరిజన ప్రాంతాల్లో ఇక డోలీ మోతలు ఉండవు

## గిరిజన సంక్షేమ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

**విజయవాడ,మే9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని అన్ని గిరిజన గ్రామాల్లో విద్య, వైద్యం, మంచి నీరు, రోడ్లను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని గిరిజన సంక్షేమం,మహిళా శిశు సంక్షేమశాఖల మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. రాష్ట్రంలోని 9 ఐటీడీఏ పీవోలు, ఇతర లైన్ డిపార్ట్ మెంట్ల అధికారులతో కలిసి సమీక్షా సమావేశాన్ని మంత్రి శుక్రవారం విజయవాడలోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి మాట్లాడుతూ జూన్ లో స్కూల్స్ ప్రారంభించే నాటికి అన్ని స్కూల్స్ లో మౌలిక సదుపాయాలు కల్పించాలని అందుకు మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో రూ. 156 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించామన్నారు. 4,000 పై చిలుకు గిరిజన గ్రామాల్లోని ప్రజలకు త్రాగు నీరు అందించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారని ఇప్పటికే దాదాపు మెజారిటీ గ్రామాల్లో త్రాగు నీరు అందించామన్నారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, త్రాగు నీరు, సాగు నీరు, రోడ్లు ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. అందుకనుగుణంగా చర్యలు తీసుకోవడంతోపాటు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తీసుకున్న చర్యలను ఈ సమీక్షా సమావేశంలో పరిశీలించామన్నారు. గిరిజన ప్రాంతాల్లో జరిగే కార్యక్రమాల్లో కూడా ఐసీడీఎస్ కార్యక్రమాలను అనుసంధానం చేస్తున్నామన్నారు. గిరిజన ప్రాంతాల్లో పిల్లలకు మంచి పౌష్టిక ఆహారం అందించేలా చర్యలు చేపట్టామన్నారు. 2,000 అంగన్ వాడీ కేంద్రాలు, 1268 మినీ అంగన్ వాడీ కేంద్రాలు గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్నాయన్నారు. వీటి ద్వారా గర్భిణీలకు, పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. పూరి గుడిసెల్లో ఉన్న వారికి పక్కా ఇళ్లు కట్టించాలి అని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారన్నారు. గ్రామాల్లో 3 సెంట్లు, మున్సిపాల్టీల్లో 2 సెంట్ల స్థలం ఇచ్చి అందులో పక్కా ఇళ్ల నిర్మాణం చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.



ఆప్కో వస్త్రాలను పరిశీలిస్తున్న చేనేత జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా

# గణనీయ లాభార్జన దిశగా ఆప్కో

## -చేనేత జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా

**విజయవాడ, మే 9,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలోని ఆప్కో కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (చేనేత జౌళి ) ఆర్‌పి సిసోడియా అధ్యక్షతన ఆప్కో , లేపాక్షి సంస్థల సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రెండు సంస్థల ప్రస్తుత పనితీరు, అభివృద్ధి అవకాశాలపై సమగ్రంగా చర్చించారు. మేనేజింగ్ డైరెక్టర్ విశ్వ సంస్థల కార్యకలాపాల ప్రస్తుత స్థితిగతులు, భవిష్యత్తు ప్రణాళికలను వివరించారు. ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ ఆప్కో, లేపాక్షి సంస్థలు నష్టాల నుంచి లాభదాయక మార్గంలోకి వెళ్లేలా సమూల మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. అన్ని ఉత్పత్తులను ఒకే షోరూఫ్‌లో అందుబాటులో ఉంచే విధంగా షోరూం సమాఖ్య పద్ధతిలో అభివృద్ధి చేయాలని సూచించారు. తద్వారా బ్రాండ్ గుర్తింపు పెరగడమే కాక, వినియోగదారులకు సమగ్ర కొనుగోలు అనుభూతి కలుగుతుందని పేర్కొన్నారు. మార్కెటింగ్ ఆధునీకరణ క్రమంలో, ప్రత్యేక మొబైల్ యాప్ అభివృద్ధి చేయడం, వాట్సాప్ ద్వారా మార్కెటింగ్ చేయడం వంటి డిజిటల్ పద్ధతులపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ మార్గాల్లో యూత్, నూతన వినియోగదారులను చేరుకోవచ్చని అభిప్రాయపడ్డారు. ఇతర ఆదాయ మార్గాల అన్వేషణలో భాగంగా షోరూంల్లో ప్రైవేట్ ప్రకటనల కోసం స్థలాన్ని అద్దెకు ఇచ్చి అదనపు ఆదాయం పొందేలా చేయాలని సూచించారు.

# తిరుమల సమాచారం

## శ్రీవారి ఆశీస్సులతో అందరికీ శుభాలు కలగాలి



**తిరుమల,మే 9ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ శుభాలు కలగాలని వేడుకున్నట్లు తమిళనాడు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కెఆర్ శ్రీరామ్ తెలిపారు. శుక్రవారం ఉదయం ఆయన కుటుంబంతో కలసి ఉదయం ప్రోటోకాల్ విఐపి బ్రేక్ దర్శనంలో ఇష్టదైవమ్ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఉద్రిక్తతల సమయంలో తిరుమల ఆలయంపై విమానాలు

**తిరుమల, మే 9ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో గత రెండురోజులుగా తిరుమల శ్రీవారి ఆలయంపై విమానాలు వెళ్ళడం ఆందోళన కలిగిస్తోంది. ఓ వైపు నోఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించాలని ఆలయ అర్చకులు, భక్తులు కోరుతున్నా అటు కేంద్రం ఇటు రాష్ట్రప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉండటం, ఇప్పుడు పాకిస్థాన్‌తో ఉద్రిక్తతలు నెలకొన్న సమయంలో ఆలయంపై విమానాలు వెళ్ళడం పెద్దగా ఆందోళనకరంగా మారింది. శుక్రవారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు మూడు విమానాలు వెళ్ళడంతో భక్తులు మరింత ఆందోళన రేకెత్తిస్తున్నారు.దీనిపై టిటిడి ఆలయ అధికారులు, విజిలెన్స్ వెంటనే పరిస్థితులు చక్కదిద్దాలని భక్తులు కోరుతున్నారు.సాధారణంగా వెళ్ళే విమానాలా లేక మరే విమానాలు అయినా ప్రయాణిస్తున్నాయా అనే అనుమానాలు భక్తుల్లో నెలకొంది.

## ప్రజలు సంతోషంగా ఉండాలి : బండ్లగణేష్



**తిరుమల,మే 9ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలు అన్ని విధాలా అభివృద్ధిచెందేలా పథకాలు అమలుచేస్తున్నారని ఎంఎల్‌సి సోమువీర్రాజు తెలిపారు. తిరుమలలో భక్తులకు సౌకర్యాలు మెరుగపడ్డాయని, గతంలో కంటే స్వామివారి దర్శనం కూడా సంతోషంగా చేసుకునేలా టిటిడి అధికారులు చూస్తున్నారన్నారు. శుక్రవారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్నారు. శ్రీవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. అలాగే సినీనిర్మాత బండ్ల గణేష్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

## సైనికులకు, దేశ నాయకత్వానికీ దైవ బలం తోడవ్వాలని షష్ట షణ్ముఖ క్షేత్రాల్లో జనసేన పూజలు

**విజయవాడ,మే9,ప్రభాతవార్తప్రతినిధి:** ఆపరేషన్ సిందూర్.పాకిస్థాన్ మీద చేస్తున్న ధర్మ యుద్ధానికి ప్రతి ఒక్కరి నైతిక మద్దతు అవసరమనీ, శత్రు మూకలపై పోరాడుతున్న సైన్యానికి, దేశానికి నాయకత్వం వహిస్తున్న గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకు దైవ బలం, ఆశీస్సులు ఉండేలా భగవంతుణ్ణి ప్రార్థించాలని జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. శత్రు సేనలను కట్టడి చేసి, దేశాన్ని కాపాడే గొప్ప శక్తిసామర్థ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం మన త్రివిధ దళాలకు మెండుగా ఉన్నాయి... వారి కోసం దేశమంతా ప్రార్థించే సమయమిది అన్నారు. జనసేన పార్టీ పక్షాన మంగళవారం ఉదయం షష్ట షణ్ముఖ క్షేత్రాలైన తిరుత్తణి, తిరుచెందూరు, పళని, తిరుపరం కుండ్రమ్, స్వామిమలై, పలముదిరచోళై క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు చేయించాలని పవన్ కళ్యాణ్ గారు నిర్ణయించారు. ఇందులో భాగంగా ప్రతి క్షేత్రానికి ఒక శాసన సభ్యుడు, జన సైనికులను పంపించి పూజలు చేయిస్తారు. అదే విధంగా కర్ణాటకలోని కుక్కే, ఘాటీ సుబ్రహ్మణ్య క్షేత్రాలు, ఆంధ్రప్రదేశ్ లోని మోపిదేవి, బిక్కవోలులోని సుబ్రహ్మణ్య ఆలయాలు, ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర ఆలయం, పిఠాపురం శ్రీ పురుహూతిక దేవి ఆలయాల్లో పూజలు చేయించాలని శ్రీ పవన్ కళ్యాణ్ తెలిపారు.

# పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలి

## రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ మంత్రి కొండపల్లిశ్రీనివాస్

**కొత్తవలస ( విజయనగరం జిల్లా ) మే 9 ( ప్రభాతవార్త ):** ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకొని, రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలని రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 175 ఎంఎస్‌ఎంఈ పార్కులను ఏర్పాటు చేసే కార్యక్రమంలో భాగంగా జిల్లాకు మొదటివిడతలో మంజూరైన నాలుగు పార్కుల్లో, మొట్టమొదటి పార్కుకు బలిఘట్టంలో శుక్రవారం శంకుస్థాపన చేశారు. సుమారు 57 ఎకరాల విస్తీర్ణంలో, దాదాపు రూ.7కోట్ల వ్యయంతో ఈ పార్కును అభివృద్ధి చేయనున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ, రాష్ట్రప్రభుత్వం ఒకవైపు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూనే అభివృద్ధిపై దృష్టి పెట్టిందని అన్నారు. దీనిలో భాగంగా రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తోందని చెప్పారు. ప్రస్తుతం ప్రపంచం భారతదేశంవైపు చూస్తోందని, దేశంలో ఏర్పాటయ్యే పరిశ్రమలను రాష్ట్రంలో ఏర్పాటు చేయించేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని అన్నారు. పరిశ్రమలను స్థాపించేవారికి సంపూర్ణ సహకారాన్ని అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్‌ఎంఈ పార్కులను ఏర్పాటు చేయనున్నామని, దీనిలో భాగంగా మొదటివిడత 50 పార్కులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లాకు మొదటి దశలోనే నాలుగు పార్కులను మంజూరు చేశారని, వీటిని ఎస్.కోట, గజపతినగరం, బొబ్బిలి, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పరిశ్రమలను పెట్టేవారికి ఈ పార్కుల్లో అన్ని వసతులతో కూడిన స్థలాలను కేటాయిస్తామని, వివిధ పథకాల క్రింద 25 శాతం నుంచి 45 శాతం వరకు సబ్సిడీ, విద్యుత్ ఛార్జీల్లో, పన్నుల్లో రాయితీ, బ్యాంకులనుంచి రుణాలు తదితర ప్రోత్సాహకాలు ఉన్నాయని తెలిపారు. యువత, మహిళా సంఘాలు పరిశ్రమలను స్థాపించేందుకు ముందుకు రావాలని కోరారు. వీటివల్ల తాము ఉపాధి పొందడమే కాకుండా, మరికొంతమందికి ఉపాధి కల్పించినవారు అవుతారని మంత్రి పేర్కొన్నారు. బలిఘట్టంలో ఏర్పాటు చేయనున్న ఎంఎస్‌ఎంఈ పార్కులో సుమారు రూ.96 కోట్ల పెట్టుబడితో 76 చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటయ్యే అవకాశం ఉందని, 1500 మందికి ప్రత్యక్షంగా, 500 మందికి పరోక్షంగా ఉపాధి లభించే అవకాశం ఉందని చెప్పారు. ఎస్.కోట ఎంఎల్‌ఏ కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ, మొదటి దశలోనే తమ నియోజకవర్గానికి ఎంఎస్‌ఎంఈ పార్కును మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రికి, మంత్రి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

2014లోనే ఇక్కడ ఈ పార్కును ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారని, అది ఇన్నాళ్లకు కార్యరూపం దాలుస్తోందని హర్షం వ్యక్తం చేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, పరిశ్రమలను ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని కోరారు.

## ఈదురుగాలులతో తిరుపతిలో నేలకొరిగిన భారీ చెట్లు, విద్యుత్ స్తంభాలు

**తిరుపతి,మే 9 ప్రభాతవార్తప్రతినిధి:** ఎండాకాలంలో వాతావరణంలో మార్పులతో గత వారంలో కేవలం అరగంటసమయం భారీ ఈదురుగాలులు,వర్షానికే తిరుపతి నగరం హడలిపోయింది.ఎక్కడబడితే అక్కడ భారీ చెట్లు నేలకొరిగి విద్యుత్‌స్తంభాలు కూలిపోయాయి. 24గంటలు పైగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణచేయలేని దుస్థితి నెలకొంది. అలాంటిది వరుసగా నాలుగైదు రోజులు భారీ వర్షాలు కురిస్తే తిరుపతిలో వరదనీరు ప్రవహించలేని పరిస్థితి ఉంది. ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త.ప్లాస్టిక్ కవర్లతో ప్రధాన మురికికాలువలు పేరుకుపోవడం, కాలనీల్లో మురికినీటి కాల్వలు చాలావరకు వెడల్పులేకపోవడం వంటి ప్రధాన సమస్యలు నేటికీ ఎదురవుతున్నాయి. తిరుపతిపుణ్యక్షేత్రానికి వరదనీటితో ముప్పు తప్పదనే ఆందోళన సీనియర్ సిటిజన్లు, పర్యావరణ శాస్త్రవేత్తల్లో వ్యక్తమవుతోంది. ఆధ్యాత్మిక నగరంగా విరాజిల్లుతున్న తిరుపతికి వరదముప్పు పొంచి వుందా!? భారీగా వరదలు వచ్చి ఊహించనిరీతిలో వర్షాలు కురిస్తే వరదనీరు ప్రవహించడానికి సరైన కాలువలు లేక ఆక్రమణలకు గురయ్యాయి. నగరంలో చాలావరకు కాలనీలు మురికికాల్వలు ఆక్రమణలకు గురవడం, కాల్వలపైనే అపార్టుమెంట్లు నిర్మించేయడం, చెరువులు,గుంటల ప్రాంతాల్లో కాలనీలు ఏర్పడి భవనాలు వెలిశాయి.

దీంతో వరదనీరు బయటకు వెళ్ళలేని పరిస్థితి ఉంది. రెండేళ్ళ క్రిందట తిరుపతినగరంలో కురిసిన భారీ వర్షాలకు పాత రేణిగుంటరోడ్డు, తిరుచానూరురోడ్డు, లక్ష్మీపురంకూడలి ప్రాంతాల్లో ప్రధాన రోడ్లు మినీచెరువులుగా దర్శనమిస్తాయి.

# భారతసైన్యం గెలుపుకోసం దుర్గమ్మ సన్నిధిలో ప్రత్యేక పూజలు

## - దుర్గమ్మ ఆలయానికి నూతన ఇఒగా వికె శీనా నాయక్



కలెక్టర్ లక్ష్మీషాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఇఓ

**ఇంద్రకీలాద్రి, మే 9, ప్రభాతవార్త** భారతదేశ రక్షణకోసం అహరహం శ్రమిస్తూ తమ ప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతున్న భరతమాత ముద్దుబిడ్డలైన భారతసైన్యం మరింత శక్తిమంతమవ్వాలని, వారంతా క్షేమంగా జరిగే పోరులో విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ శుక్రవారం దుర్గమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. దేశం క్షేమంగా వుండాలని, దేశపౌరులంతా సంతోష సౌభాగ్యాలతో వర్ధిల్లాలని దుర్గమ్మవారిని వేడుకున్నామన్నారు. దుర్గమ్మవారి ఆలయానికి నూతన ఇఒగా వికె శీనా నాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కుటుంబంతో సహా దుర్గమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం నూతన ఇఓకు వేదపండితులు వేదాశీర్వచనాలందించారు. అనంతరం నూతన ఇఓ దేవస్థానంలోని పలు విభాగాలను పరిశీలించి, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమై భక్తులకందిస్తున్న సౌకర్యాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇఓ ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీషాను మర్యాదపూర్వకంగా కలుసుకుని ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు. దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన టి మహేశ్వర సింగ్ రు.1లక్ష 21వేలను విరాళంగా ఇఓ వికె శీనా నాయక్‌కు అందించారు. దాతకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసి, ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

## జీవ వైవిధ్య సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించే చర్యలు తీసుకుంటున్నాం: నీలాయపాలెం విజయకుమార్

**విజయవాడ,మే9,ప్రభాతవార్తప్రతినిధి:** జీవ వైవిధ్య సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించే చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవవైవిధ్య మండలి చైర్మన్ నీలాయపాలెం విజయకుమార్, మెంబర్ కార్యదర్శి పి రామకృష్ణ తెలిపారు. అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని ఈ నెల 22న విజయవాడలో నిర్వహిస్తున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించారు. 'ప్రకృతితో సామరస్యం - స్థిరమైన అభివృద్ధి అనే అంశంలో అవార్డులు, బహుమానాలు అందిస్తున్నామని తెలిపారు. జీవవైవిధ్యంపై కృషి చేస్తున్న, ఎంపిక చేసిన వ్యక్తులకు వ్యక్తిగత విభాగంలో అవార్డులు అందిస్తామని చెప్పారు. ఈ అంశంపైనే విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖనం, ఛాయాచిత్రాల పోటీలు కూడా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ నెల 22న జరిగే కార్యక్రమంలో స్టాళ్ల ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందన్నారు.

## ఉగ్రవాదం అంతానికి సిపిఎం సహకారం

### - తిరుపతిలో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి బేబీ

**తిరుపతి,మే 9 ప్రభాతవార్తప్రతినిధి:** భారత్ సరిహద్దుల్లో పాక్ కవ్వింపులతో భారత్ సైన్యం ధీటుగా బదులివ్వాలని, అమాయకుల ప్రాణనష్టం ఆస్తినష్టం జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిపిఎం జాతీయ ప్రధానకార్యదర్శి ఎంఎ బేబి సూచించారు. దేశ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు తగ్గించి సాధారణ జనజీవన పరిస్థితి పునరుద్దరణకు,శాంతి కోసం కేంద్రప్రభుత్వం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదం అంతానికి సిపిఎం కేంద్రానికి సహకరిస్తుందని తెలిపారు. శుక్రవారం ఉదయం తిరుపతిలోని సిపిఎం కార్యాలయంలో ఆయన మీడియాప్రతినిదుల సమావేశంలో మాట్లాడారు. తీవ్రవాదుల అణచివేత కార్యక్రమం విజయవంతం కావడంతో దేశసరిహద్దు ప్రాంతాల్లో ఉద్రిక్తతలు తగ్గించాలన్నారు. తీవ్రవాదం అంతానికి, ఫెహల్గాం హంతకులను అప్పజెప్పడానికి పాకిస్థాన్‌పై వివిధ వేదికల రకాల ఒత్తిడి తీసుకురావాలన్నారు. కులగణన కేవలం బీహార్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కేంద్రం ప్రకటించిందన్న భావన ప్రజల్లో ఉందని తెలిపారు. కేంద్రం కులగణన చేపట్టేందుకు అవసరమైన మార్గదర్శకాలు ఇప్పటివరకు ప్రకటించకపోవడం దీనిని బలపరుస్తోందని అన్నారు.కులగణన సమగ్ర సామాజికసర్వేగా చేపట్టాలని, అందుకు అవసరమైన మార్గదర్శకాలను రూపొందించాలని ఆయన డిమాండ్ చేశారు. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో సిపిఎం దీనిపై చర్చ లేవనెత్తుతుందన్నారు.రానున్న రోజుల్లో కేరళ, తమిళనాడు, పాండిచ్చేరి, పశ్చిమబెంగాల్ ,అస్సాం రాష్ట్రాలలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తాము కేంద్ర కమిటీ సమావేశంలో చర్చించి ఎన్నికల ఎత్తుగడలను రూపొందిస్తామని బేబి వివరించారు.

# దేశ ప్రతిష్టను కాపాడుతున్న సైనికులకు సెల్యూట్

## కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్

**తిరుపతి,మే 9ప్రభాతవార్తప్రతినిధి:** భారత్-పాకిస్థాన్ యుద్ధవాతావరణంతో భారత దేశ ప్రతిష్టను కాపాడుతున్న సైనికులకు తలవంచి సెల్యూట్ చేస్తున్నామని కాంగ్రెస్ మాజీమంత్రి డాక్టర్ చింతామోహన్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తరపున సైనికులకు పూర్తిమద్దతు తెలియజేస్తున్నామన్నారు. గత సంవత్సర కాలంలో టిటిడి పరిపాలన భవనం వద్ద కాంగ్రెస్ పార్టీ 30సార్లు ఆందోళన చేపట్టిందన్నారు. టిటిడిలో పనిచేసే అర్చకులకు, ఉద్యోగులకు ఇళ్ళస్థలాలు ఇవ్వాలని కోరామని, అలిపిరినుండి పేరూరు వరకు ఉన్న 400 ఎకరాల్లో ఐదేసి సెంట్లు ఇవ్వాలన్నారు. తిరుమల కొండకు సిఎం చంద్రబాబు అనేక దఫాలుగా వచ్చారని, అయినా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించలేదన్నారు. టిటిడిలో ఎన్ఎంఆర్‌లను రెగ్యులర్‌చేయాలన్నారు.

# దేవుని చెంత ఉచిత వివాహాలకు కల్యాణవేదిక ముస్తాబు

**తిరుమల,మే 9ప్రభాతవార్తప్రతినిధి:** నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న తిరుమలకొండపై ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ఆయన చెంత పేద,మధ్యతరగతి వర్గాల యువతీయువకులు ఉచితంగా కల్యాణాలు చేసుకునేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేపట్టింది. ఇందుకోసం తిరుమలలోనే పాపవినాశనమ్ మార్గంలో అత్యాధునిక సౌకర్యాలతో కల్యాణవేదికను నిర్మించి అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది. ఇందుకు తెలుగురాష్ట్రాలనుండేగాక దేశం నలుమూలల నుండి కూడా యువతీయువకుల కుటుంబాలు ఆన్‌లైన్‌లోనే వారివారికి ఇష్టమైన తేదీల్లో బుక్‌చేసుకునేలా అవకాశం ఉంది. తిరుమలలో టిటిడి నిర్వహిస్తున్న ఉచిత వివాహాలకు నూతన వధూవరుల నుండి విశేష స్పందన లభిస్తోంది. 2016 ఏప్రిల్ 25నుండి 2025 మేనెల 1వరకు 26,214 వివాహాలు అయ్యాయి. ఇందులో పురోహితుడు,మంగళవాయిద్యంతోబాటు పెళ్ళిసమయంలో పసుపు,కుంకుమ,కంకణంను టిటిడి ఉచితంగా అందిస్తుంది.

# ఎర్రచందనం స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష , రూ.3లక్షల జరిమానా

## - తీర్పు వెల్లడించిన ఆర్‌ఎస్‌ఎస్ ఎడిజె కోర్టు న్యాయమూర్తి

**తిరుపతి కార్పొరేషన్, మే 9 ప్రభాతవార్త** ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 3లక్షల జరిమానా విధిస్తూ ఆర్‌ఎస్‌ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు నిచ్చారు. ఆర్‌ఎస్‌ఎస్టీఎఫ్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ. శ్రీనివాస్ పర్యవేక్షణలో గతంలో నమోదయ్యి, కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. పగడ్బందీగా సాక్ష్యాధారాలను నిరూపించి ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా క్రైమ్ నెంబరు 56/2018 కేసులో ఒక ముద్దాయి అరెస్టయ్యాడు. ఇతను తమిళనాడుకు చెందిన విజయకుమార్ కాగా, ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ నాగపట్ల ఈస్ట్ బీటు, తిరుపతి డివిజన్‌లో పట్టుబడ్డాడు. ఈ కేసు విచారణ పూర్తి చేసుకోవడంతో గత నెల 22వ తేదీన న్యాయమూర్తి శిక్ష ఖరారు చేయగా, ఇతను కోర్టుకు హాజరు కాలేదు. దీంతో అతనిపై నాన్ బెయిలబుల్ వారెంట్ (ఎన్‌బీడబ్ల్యూ)ను జారీ చేశారు. పోలీసులు ఇతనిని పట్టుకుని, శుక్రవారం న్యాయమూర్తి ముందు హాజరు పరిచారు. న్యాయమూర్తి స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 3లక్షల జరిమానాను ఖరారు చేస్తూ తీర్పునిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లోని శేషాచలం రిజర్వు ఫారెస్టులో అతి విలువైన సహజ సంపద అయిన ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేయడమే కాకుండా, అడవిలోకి అక్రమ ప్రవేశం చేసిన నేరస్తులకు కూడా ఇది ఒక హెచ్చరికగా పరిగణించబడుతుందని టాస్క్ ఫోర్సు అధికారులు తెలిపారు. ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా సహకరిస్తున్న కోర్టు సిబ్బందిని అభినందించారు.

## తెలుగు జవాన్ మురళీ నాయక్ వీరమరణం పట్ల మాజీ సిఎం వైయస్ జగన్ దిగ్భ్రాంతి

**విజయవాడ మే 9 ప్రభాతవార్త ప్రతినిధి:** జమ్ముకాశ్మీర్‌లో తెలుగు జవాన్ మురళీ నాయక్ వీరమరణం పట్ల మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్‌సీపీ అధినేత వైయస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేసారు.మురళీనాయక్ వీరమరణంపై. దేశభద్రతలో తన ప్రాణాలను ఘణంగా పెట్టి వీరమరణం పొందిన మురళీనాయక్ త్యాగాన్ని మరువలేం. మురళీనాయక్ కుటుంబీలకు ప్రగాఢ సానుభూతి అంటూ జగన్ తన "ఎక్స్" ఖాతాలో పోస్టు చేసారు. జమ్ముకాశీర్మర్‌లో తెలుగు జవాన్ మురళీ నాయక్ వీరమరణం చెందడంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్‌సీపీ అధినేత వైయస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

మురళీనాయక్ కుటుంబానికి ఆయన సంతాపం ప్రకటించారు.

శోకతప్తులైన వారి కుటుంబీకులకు వైయస్ జగన్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. దేశభద్రతలో తన ప్రాణాలను పణంగా పెట్టి వీరమరణం పొందిన మురళీనాయక్ త్యాగాన్ని మరువలేమన్నారు.

11page.qxd:10-5PDg7exHMNWJQE.qxd 10/05/25 12:33 AM Page 1



# జగ్గయ్యపేటను ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

## -ఎంపి కేశినేని చిన్ని, ఎంఎల్‌ఏ రాజగోపాల్



జగ్గయ్యపేట మండల పరిధిలోని ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న విజయవాడ ఎంపి కేశినేని చిన్ని

**జగ్గయ్యపేట, మే 9, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యతనిస్తుందని, ఈనేపథ్యంలోనే జగ్గయ ్యపేటను ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్దుతామని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), జగ్గయ్యపేట ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలంలోని వేదాద్రి గ్రామంలో 700ల ఎకరాలు, జయంతిపురం గ్రామంలో ఏపిఐఐసి ల్యాండ్ 498 ఎకరాల ప్రభుత్వ భూములు 313 ఎకరాలను జిల్లా కలెక్టర్ లక్ష్మీశా, ఆర్డీఓ బాలకృష్ణలతో కలిసి ఎంపి, ఎమ్మెల్యే శుక్రవారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ హబ్‌గా తీర్చిదిద్దటానికి మంచి పరిణామమని, తద్వారా యువతకు ఉద్యోగాల కల్పన, నియోజకవర్గ అభివృద్ధి జరుగుతుందని అభిప్రాయపడ్డారు.

అయితే కొసమెరుపు ఏమిటంటే 2014 ఎన్నికల సందర్భంలో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు జగ్గయ్యపేటకు విచ్చేసిన సందర్భంలో రాష్ట్ర సరిహద్దుగావున్న జగ్గయ్యపేటను ఇండస్ట్రియల్ హబ్‌గా మారుస్తానని, ఆంధ్రా-కర్నాటక బోర్డర్‌లో ఇలాగే ఇండస్ట్రియల్ హబ్ అద్భుతంగా రూపొందిందని వాగ్దానంచేశారు. తదనంతరం అధికారంలోకి వచ్చినా కేవలం అమరావతిపైన మాత్రమే దృష్టి నిలిపి ఇతర ప్రాంతాల అభివృద్ధిని విస్మరించటంతో ప్రజలు 2019 ఎన్నికల్లో తిరస్కరించిన విషయం తెలిసిందే. నేడు తిరిగి అధికారంలోకి వచ్చిన పరిస్థితుల్లో సిఎం ఇచ్చిన

హామీ గురించి నేతలు మర్చిపోయారు. కొత్తగా విజయవాడ ఎంపి, జగ్గయ్యపేట

ఎంఎల్‌ఏ మళ్లీ అదే వాగ్ధానాన్ని కొత్తగా ప్రతిపాదిస్తూ ప్రకటించటంతో ఈప్రాంతవాసులను ఆశ్చర్య చకితులయ్యారు.

## బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణం

**రాపూరు (నెల్లూరు), మే 9, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహుని బ్రహ్మోత్స వాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ శుక్రవారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్రోక్తంగా నిర్వహించారు. ఇందులో బాగంగా ఉదయం స్వామి,అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించి, స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూలాంగి సేవ నిర్వహించారు. అనంతరం స్వామి,అమ్మవార్లను, గరుత్మంతుడి చిత్రపఠన్ని తిరుచ్చిపై వుంచి ఆలయంలో గిరి ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ధ్వజస్థంబం వద్ద బ్రహ్మోత్స వాలకు ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలంటూ నూతన వస్త్రంపై వున్న గరుత్మంతుని చిత్రపఠానికి పూజలు నిర్వహించి ధ్వజస్థంబంపై ఎగురవేశారు. ఈ సందర్బంగా ధ్వజస్థంబం వద్ద స్వామి ప్రసాదంగా వుంచిన కోడి ముద్దల కోసం భక్తులు పోటీపడ్డారు. పిల్లలు లేని వారు, అనారోగ్య సమస్యలు, మానసిక ప్రశాంతత లేని వారు ఈ కోడి ముద్దలు స్వీకరిస్తే వారి సమస్యలు పరిష్కారమైతాయని భక్తుల నమ్మకం. ఈ కార్యక్రమంలో సేవా కమిటీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి, ఆలయ డిప్యూటీ కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, ఆలయ సీనియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీ నారాయణ, గోనుపల్లి సర్పంచ్ గోతాటి నారాయణమ్మ, సేవా కమిటీ సభ్యులు రంగినేని వెంకటరమణయ్య, పీర్ల సోమయ్య, బొట్టా హజరత్ నాయుడు, తోట క్రిష్ణయ్య, శ్రీశైలం భార్గవ రామ్, కిన్నెర నరసింహా రావు,పెమ్మసాని సుగుణమ్మ, మోమిడి నరసింహులు, బోగులు బాస్కర రెడ్డి, బోతల శివ నాగేశ్వర రావు, దాసరి బాస్కర నాయుడు, యం.నవక్రిష్ణ చౌదరి, ఈతముక్కల యోగేశ్వర రావు తదితరులు వున్నారు.స్వామి వారి పూజా, కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచలయ్య స్వామిల ఆధ్వర్యంలో తిరుమల వేదపాఠశాల పంచరాత్ర ఆగమ పండితులు రామానుజాచార్యులు
పర్యవేక్షణలో అర్చక స్వాములు గుండ్లూరు శశి స్వామి, మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలజీ స్వామి, వినోద్ స్వామి,మోక్షజ్ఞ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి తదితరులు నిర్వహించారు.

# ఆపరేషన్ సింధూర్ కు మద్దతుగా రాష్ట్ర సచివాలయ ఉద్యోగులు సంఘీభావ ర్యాలి



**విజయవాడ,మే9,ప్రభాతవార్తప్రతినిధి:**పహల్గామ్ ఉగ్రదాడికి వ్యతిరేకంగా భారత త్రివిధ ధళాల సారధ్యంలో చేపట్టిన "ఆపరేషన్ సింధూర్"కు మద్ధత్తుగా శుక్రవారం అమరావతి రాష్ట్ర సచివాలయంలో వివిధ శాఖల అధికారులు,ఉద్యోగులు,పలు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సంఫీుభావ ర్యాలీ నిర్వహించారు.సచివాయం మొదటి భవనం నుండి ప్రధాన గేటు వరకూ ఈసంఫీుభావ ర్యాలీ నిర్వహించారు.జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన పహల్గామ్ లో గత నెలలో పాక్ ఆక్రమిత కాశ్మీర్ పరిధిలోని పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు మన దేశానికి చెందిన 26మంది అమాయక పర్యాటకులను అతికిరాతకంగా కాల్చిచంపిన నేపధ్యంలో దానికి ప్రతీకారంగా భారత ప్రభుత్వం త్రివిధ దళాల సంయుక్త ఆధ్వర్యంలో ఆపరేషన్ సింధూర్ చేపట్టి సుమారు 100 మందికి పైగా ఉగ్రవాదులను వారి స్థావరాలను నేలమట్టం చేయడం జరిగింది. ఆతదుపరి భారత్‌పాకిస్థాన్ ల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపధ్యంలో పాక్ కవ్వింపు చర్యలను మన దేశ త్రివిధ దళాలకు చెందిన సైనికులు గత నాలుగు రోజులుగా పెద్దఎత్తున సమర్ధవంతంగా తిప్పి కొట్టడం జరుగుతోంది.
భారతదేశ త్రివిధ దళాల పోరాటానికి సంఫీుభావంగా రాష్ట్ర సచివాలయ అధికారులు, ఉద్యోగులు "జయహో
ఆపరేషన్ సింధూర్,జై జవాన్,జై భారత్,భారత్ మాతాకి జై వంటి నివాదాలతో ర్యాలీ నిర్వహించారు.అంతేగాక పాక్ కాల్పుల్లో అమరుడైన రాష్ట్రానికి చెందిన "అగ్నివీర్ మురళీ నాయక్ అమర్ రహ్హే అంటూ ఉద్యోగులు పెద్దఎత్తున నినదించారు.
అంతేగాక ఉగ్రవాదులను పూర్తిగా తుదిముట్టించేందుకు భారత త్రివిధ సైనిక దళాలు పాక్ కవ్వింపు చర్యలను తిప్పికొట్టేందుకు అహర్నిశం పాటుపడుతున్న కృషికి దేశం యావత్తు వారి వెంట నిలిచింది.అందుకు అనుగుణంగా రాష్ట్ర సచివాలయ అధికారులు, ఉద్యోగులు,ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పెద్దఎత్తున ఈర్యాలీలో పాల్గొన్నారు.

## జవాను మురళీ నాయక్‌కు సీఎం చంద్రబాబు నివాళి

**విజయవాడ,మే9,ప్రభాతవార్తప్రతినిధి:**పాకిస్తాన్ తో జరుగుతున్న యుద్దంలో సత్యసాయి జిల్లా కల్లితండాకు చెందిన జవాను మురళీ నాయక్ వీర మరణం పొందడం తీవ్ర వేదనను కల్గించిందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. "ఎక్స్' ఖాతా వేదిక జవాను మురళీ నాయక్ సీఎం చంద్రబాబు నివాళి అర్పించారు.దేశ రక్షణ కోసం ప్రాణాలు విడిచిన మురళీ నాయక్ వీర మరణం తెలుగు ప్రజలకే కాక దేశ ప్రజలందరికీ స్ఫూర్తి దాయకమన్నారు సీఎం.పాకిస్తాన్ తో యుద్దంలో మురళీ నాయక్ ప్రదర్శించిన ధైర్యసాహసాలకు బిగ్ సెల్యూట్ మురళీ నాయక్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ దేవుడ్ని ప్రార్ధిస్తున్నాను మురళీ నాయక్ కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి మురళీ నాయక్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుంది. ఆ కుటుంబానికి అన్ని వేళల్లో రాష్ట్రప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.ఇక భారత్ పాకిస్థాన్ యుద్ధ భూమిలో వీరమరణం పొందిన తెలుగు జవాన్ మురళీ నాయక్ కుటుంబాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫోన్‌లో పరామర్శించారు. దేశ రక్షణలో పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల మండలం కల్లితండాకు చెందిన మురళినాయక్ ప్రాణాలు కోల్పోవడంపై ముఖ్యమంత్రి తీవ్ర విచారం వ్యక్తం చేశారు

# తెలంగాణ ప్రభుత్వ కార్యక్రమాలు దేశానికి దిశానిర్దేశం

## బెంగళూరు సదస్సులో విడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న సిఎం రేవంత్‌రెడ్డి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 9:** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాలు, అనుసరిస్తున్న విధానాలు దేశానికి దిశానిర్దేశం చేస్తున్నాయని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చెప్పారు. సామాజిక న్యాయంతో పాటు ఇతర అంశాల్లో తెలంగాణ మాడల్‌ను కేంద్ర ప్రభుత్వం కూడా అనుసరించాల్సి న పరిస్థితి ఉందన్నారు.బెంగుళూరు వేదికగా శుక్రవారం జరిగిన 'ది హిందూ హడిల్-2025' కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. పెట్టుబడుల కోసం ప్రపంచ దేశాలు చైనా ప్లస్ వన్ ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్న తరుణంలో దానిని అందిపుచ్చుకోవాలన్న ఆలోచనతో అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్టు వివరించారు. రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాల అమలుతో పాటు అభివృద్ధి ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని వాటిని సమగ్రంగా తెలియజేశారు.

మారుతున్న పరిస్థితులకు అను గుణంగా తమ ప్రభుత్వం విద్య, ఉపాధి, మౌలిక సదుపాయాల కల్పనా రంగాలపై దృష్టి సారించింది. అందులో భాగంగా అనేక వినూత్న ప్రణాళికలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ప్రపంచ దేశాల్లోని అగ్రగామి నగరాలతో పోటీ పడాలన్నదే మా ఆలోచన.అందులో భాగంగానే నెట్ జీరో సిటీకి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. దేశంలోనే మొట్టమొదటిదిగా ఫ్యూచర్ సిటీకి రూపకల్పన చేశాం. ఎలక్ట్రిక్ వాహనాలపై పన్ను రద్దు చేశామన్నారు.. 360 కి.మీ మేరకు రీజినల్ రింగ్ రోడ్డు నిర్మించడమే కాకుండా తెలంగాణలో ప్రాంతాల వారిగా పారిశ్రామికీకరణకు సన్నద్ధమయ్యామని పేర్కొన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు లోపలి పరిధిలో పరిశ్రామిక పార్కులు, ఐటీ, ఎలక్ట్రిక్ వాహనాలు, అటోమొబైల్ ఇండస్ట్రీ, ఇతర పరిశ్రమలను ఆకర్షించే విధంగా మౌలిక సదుపాయాల కల్పించాలన్నదే ప్రయత్నం. డ్రైపోర్టు నిర్మాణం వంటి అనేక ప్రణాళికలకు రూపకల్పన చేశామన్నారు. రాష్ట్రానికి 2 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను సాధించాం, ఇవన్నీ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు బలం చేకూర్చుతాయన్నారు. మా ప్రభుత్వం సహేతుకమైన ప్రణాళికలతో పెట్టుబడులను ఆకర్షించేందుకు, పరిశ్రమలు, ఐటీ కంపెనీలు, ఇతర రంగాలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తుంద న్నారు. ప్రతి అంశాన్ని అందిపుచ్చుకుంటూ ముందుకు వెళ్లాలన్నదే ప్రయత్నం. ఇటీవల జపాన్ దేశ పర్యటన సందర్భంగా తెలుసుకున్న విషయాల మేరకు ఆ దేశానికి అవసరమైన మానవ వనరులను సమకూర్చడానికి వీలుగా తెలంగాణలో జపనీస్ భాషను నేర్పించాలని సంకల్పించామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య ఉద్యోగ, రాజకీయ సర్వే దేశానికి ఒక మోడల్‌గా నిలిచింది. ఈ సర్వే సమాజాన్ని మరింత సమర్థవంతంగా గుర్తించి సేవలు అందించడంలో దోహదపడుతుందన్నారు. ఇది కేవలం బీసీల కోసమే కాదు.ఈ సర్వే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్ ప్రజలకూ ఉపయోగపడుతుందన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు తెలంగాణ ముందడుగు వేసింది. కేంద్ర ప్రభుత్వం కూడా తెలంగాణ మాడల్‌ను అమలు చేయాలి.ఈ రకంగా అనేక కోణాల్లో తెలంగాణ రైజింగ్ మొదలైందన్నారు. తెలంగాణలోని వేర్వేరు రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఐసొలేషన్ గా సాగుతున్న విద్యను ఇంటిగ్రేట్ చేయడం ద్వారా పిల్లల్లో సోషలైజేషన్ ప్రక్రియకు చేపట్టాం, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఒక కీలకమైన నిర్ణయమన్నారు. జనాభాలో దాదాపు 60 శాతమున్న వ్యవసాయ కుటుంబాలకు అండగా ఉండేందుకు అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే రాష్ట్రంలో 25 లక్షలకు పైగా రైతులకు 21,617 కోట్ల రూపాయల మేరకు రుణమాఫీ చేశాం. రైతులకు ఏటా 12 వేలు ఇన్ పుట్ సబ్సిడీగా ఇస్తున్నాం. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం.
దేశంలోనే అత్యధికంగా వరి ఉత్పత్తి చేసే రాష్ట్రం కనీస మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తున్నాం. అలాగే 67 లక్షల సభ్యులున్న స్వయం సహాయక సంఘాల మహిళలకు వెయ్యి మెగావాట్ల సోలార్ ఉత్పత్తిని అవకాశం, పాఠశాలల నిర్వహణ, యూనిఫామ్ వంటి బాధ్యతలన్నీ వారికే అప్పగించాం. ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామన్నారు. అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే 59 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. నిరుద్యోగ యువతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ అనేక నిర్ణయాలు తీసుకున్నామన్నారు.. స్కిల్స్ యూనివర్సి టీ, స్పోర్ట్స్ యూనివర్సి టీ, టాటా టెక్నాలజీస్ సహకారంతో రాష్ట్రంలోని 105 ఐటీఐలను ఏటీసీలుగా మార్చుతున్నాం. ఇవన్నీ యువతకు ఉద్యోగ అవకాశాలు, ఉపాధి మార్గాలను చూపించడంలో భాగంగా చేపట్టామన్నారు డీలిమిటేషన్‌కు మేము వ్యతిరేకం కాదు. కానీ ముందు కేంద్ర ప్రభుత్వం ఆ ప్రక్రియకు సంబంధించి అన్ని పార్టీలతో సంప్రదింపులు జరిపి అందుకు ప్రాతిపదికను స్పష్టంగా వెల్లడించాలి. అన్ని రాష్ట్రాలకు సమన్యాయం కావాలన్నదే మా డిమాండ్. అభివృద్ధి సాధిస్తున్న రాష్ట్రాలను శిక్షించకూడదు. ఇది సామాజిక, రాజకీయ న్యాయానికి సంబంధించిన అంశం. అందుకే చర్చ జరగాలని అడుగుతున్నామని చెప్పారు.

### సైనికులకు అందరం మద్దతు తెలపాలి

ఈ కార్యక్రమంలో తొలుత ముఖ్యమంత్రి మాట్లాడుతూ, మొదటగా నేను భారతీయ సైన్యానికి సెల్యూట్ చేస్తున్నాను. దేశాన్ని రక్షించడంలో అహర్ని శలు కృషి చేస్తున్నారు. దేశ రక్షణ కోసం నిరంతరం కాపలాకాస్తోంది. ఈ సమయంలో అందరం సైనికులకు మద్దతు తెలపాలి అని పిలుపునిచ్చారు

## మనదేశ పోరాటం.. న్యాయపోరాటం

### అందాలపోటీలు వాయిదా వేయండి

### తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత


**హైదరాబాద్ (ముషీరాబాద్), మే 9, ప్రభాతవార్త:** పాకిస్థాన్‌పై మనదేశం చేస్తున్న పోరాటం న్యాయపోరాటమని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. భారత జవాన్లు నిర్వహిస్తున్న ఆపరేసన్ సంధూర్‌కు సంఘీభావంగా శుక్రవారం సాయంత్రం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఇందిరాపార్కు చౌరస్తా నుండి అశోక్‌నగర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ముఖ్య అతిధిగా హాజరై కవిత మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాద స్థావరాల మీద మనం యుద్ధం చేస్తూ ఉంటే పాకిస్తాన్ మన సివిల్ ఎయిర్‌ఫోర్స్ మీద దాడి చేస్తున్నారని ఆరోపించారు. మన భారతదేశ సైనికులకు అండగా ప్రతి రాష్ట్రంలో ప్రతి ప్రాంతంలో సంఫీుభావ ర్యాలీలు జరగాలని, దేశంకి, సైనికులకు తోడుగా మనం కూడా నిలబడాల్సి న అవసరం ఉందని అన్నారు. ఒకవైపు యుద్ధం జరుగుతూ ఉంటే మరోవైపు మిస్‌వరల్డ్ పోటీలు జరపటం సరికాదని, ఐపీఎల్ ఎలాగైతే వాయిదా వేశారో అదే విధంగా అందాల పోటీలను కూడా వాయిదా వేయాలని ఆమె సూచించారు. ఒక వైపు యుద్ధం జరుగుతూ, ప్రపంచ దేశాలన్నీ మనకు అండగా నిలుస్తున్నాయని, ఇటువంటి సమయంలో మనం కూడా విజ్ఞత ప్రదర్శించి, అందాల పోటీలు వాయాల్సి న అవసరం ఉందని అన్నారు. మేనిఫెస్టో హామీలను అమలుచేయమని ప్రజలు కోరుతూ ఉంటే, ఆ హామీలు నెరవేర్చలేని ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీసే విధంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిపాలన చేతకాకపోతే, ఇచ్చిన మాటలను నిలబెట్టుకోవటం చేతకాకపోతే రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చకుండా, తక్షణమే ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ , బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, జాగృతి నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



సైనికులకు సంఫీుభావంగా ర్యాలీ నిర్వహిస్తున్న జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత

## హిజ్రాలకు డిఎస్పి మురళీకృష్ణ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్

**మంగళగిరి, మే 9, ప్రభాతవార్త :**
మంగళగిరి నియోజకవర్గ పరిధిలో ఉన్న హిజ్రాలకు నార్త్ సబ్ డివిజన్ డిఎస్పి మురళీకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణ పోలీస్ స్టేషన్



ఆవరణలో కౌన్సి లింగ్ నిర్వహించారు. కార్యక్రమానికి సుమారు 40 మంది హిజ్రాల హాజరయ్యారు. ఇటీవల జరిగిన రెండు హత్య కేసుల్లో హిజ్రాలే కీలక నిందితులుగా ఉన్నందున పోలీసులు అప్రమత్తమయ్యారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని, నేర ప్రవృత్తికి అలవాటు పడవద్దని డిఎస్పి సూచించారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసి బలవంతపు వసూళ్లకు పాల్పడవద్దన్నారు. అసాంఘిక కార్యకలాపాలను విడనాడకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముందస్తు చర్యలో భాగంగా ఈనెల 10వ తేదీన శనివారం తహసిల్దార్ ఎదుట హిజ్రాలను బైండోవర్ చేయించనున్నట్లు డిఎస్పి తెలిపారు. రూరల్ సీఐ వై శ్రీనివాసరావు, పట్టణ సీఐ డి వినోద్ కుమార్, ఎస్సైలు చిరుమామిళ్ల వెంకట్, శ్రీహరి సిబ్బంది పాల్గొన్నారు.

## కొత్తపుల్లారెడ్డిగూడెంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సోదాలు

**మాచర్ల, మే 9 ప్రభాతవార్త:** మాచర్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వెల్దుర్తి మండలం కొత్తపుల్లారెడ్డి గూడెంలో



శుక్రవారం సోదాలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నాటుసారా నియంత్రణ, నిర్మూలనకు ఈ సోదాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ సోదాల్లో గుంటూరు ఈఎన్‌ఎఫ్‌టీ బృందం, నరసరావుపేట, మాచర్ల, గురజాల, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, ఈపూరు ఎస్‌హెచ్‌ఓ బృందాలతో డీఎస్పీ హనుమంతరావు పర్యవేక్షణలో ఈ సోదాలు నిర్వహించారు. గ్రామంలో పాత నేరస్తులు, అనుమానితుల ఇళ్లలో సోదాలు చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ మహమ్మద్ షఫీ, మాచర్ల టౌన్ సీఐ ప్రభాకర్, వెల్దుర్తి ఎస్సై సమందర్‌వలి, మాచర్ల పట్టణ ఎస్సై సంధ్యారాణి, రూరల్ ఎస్సై నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

# అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

### నెలాఖరులోగా ప్రెస్ అకాడమీ భవన్ ప్రారంభిస్తాం

### రెవెన్యూ హౌజింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి



శుక్రవారం నాంపల్లిలోని ప్రెస్ అకాడమీ కార్యాలయంలో చెక్కులు అందజేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త:** అర్హులైన జర్నలిస్టులందరికీ ఇం దిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వృత్తి నిర్వ హణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు నెలసరి పెన్షన్, తీవ్ర అనారోగ్యం, ప్రమా దాలకు గురై వృత్తి నిర్వహించలేని స్థితిలో ఉన్న జర్నలిస్టులకు శుక్రవారం నాంపల్లిలోని ప్రెస్ అకాడమీ కార్యా లయంలో చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలైన జర్నలిస్టులకు, వృత్తి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామన్నారు.
మండల, నియోజకవర్గ స్థాయిలో పనిచేస్తున్న జర్నలిస్టులను ఆదుకోవడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామన్నారు. మంచిని మంచిగా, నిజాన్ని నిర్భయంగా సమాజానికి తెలియజే యడంలో ఎంతోమంది జర్నలిస్టులు ఆణి ము త్యాలుగా పనిచేస్తున్నారన్నారు. జర్నలిస్టు వృత్తిని నమ్ముకుని జీవితం మొత్తం ఆ వృత్తికే అంకితమైనవాళ్లు ఎంతోమంది ఉన్నారన్నారు.
గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన ప్రెస్ అకాడమీ భవనాన్ని చిన్నచిన్న మరమ్మతులు పూర్తి చేసుకుని ఈ నెల చివరిలోగా ప్రారం భిస్తామన్నారు. విడతల వారీగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.42 కోట్లను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, దానిపై వచ్చే వడ్డీని జర్నలిస్టుల సంక్షేమం కోసం అకాడమీ ఖర్చు పెడుతుందని, జర్నలిస్టుల సంక్షేమానికి ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై వచ్చిన వడ్డీ ఆధారంగా ఇప్పటివరకు రూ.22 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు చెందిన 597 మందికి రూ.1 లక్షతోపాటు అయిదు సంవత్సరాల వరకు, నెలకు రూ.3 వేల పెన్షన్, వారి పిల్లలకు ట్యూషన్ ఫీజుల కింద 1 నుండి 10వ తరగతి వరకు చదివే పిల్లలకు నెలకు 1,000లను గరిష్టంగా ఇద్దరికి అందిస్తామన్నారు. ఇప్పటి వరకు ఈ ఖాతాలో మొత్తం రూ. 8,98,39,000లు ఆర్థిక సహా యం అందించామన్నారు.
ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురామరెడ్డి మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టు వృత్తి అత్యంత కీలకమైనదని తమ ప్రాణాలను లెక్క చేయకుండా సమాచారాన్ని ప్రజలకు అంది స్తున్నారని, గడిచిన రెండు రోజులుగా రెండు దేశాల మధ్య ఏం జరుగుతుందో అన్న ఆతృతతో ఎదురుచూస్తున్న ప్రజలకు తమ ప్రాణాలను లెక్క చేయకుండా సమాచారాన్ని ప్రజలకు చేర వేస్తున్నారన్నారు. ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులైన జర్న లిస్టులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని, జర్నలిస్టుల సంక్షేమానికి నిధులను పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## చట్ట వ్యతిరేక,సంఘ విద్రోహ చర్యలకు పాల్పడే వారి పై చట్టపరమైన కఠిన చర్యలు

**బాపట్ల,మే09,ప్రభాతవార్త:** చట్ట వ్యతిరేక, సంఘ విద్రోహ చర్యలకు పాల్పడే వారి పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి హెచ్చరించారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఇచ్చిన మార్గనిర్దేశాలను అనుసరించి జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ యంత్రాంగం గురువారం రాత్రి 9:00 గంటల నుండి 11:00 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో సరిహద్దు ప్రాంతాలతో పాటు ముఖ్యమైన ప్రదేశాలలో వాహన తనిఖీలు నిర్వహించారు. రైల్వే స్టేషన్ లు, బస్టాండు లలో అనుమానితులను విచారించి వారి సామాగ్రిని తనిఖీ చేశారు. హోటల్లు, లాడ్జి లు, రిసార్ట్స్ లలో బస చేసిన వారి వివరాలను సేకరించి అనుమానాస్పదంగా వున్న వారి గదులను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జిల్లా వ్యాప్తంగా గత రాత్రి 9 నుండి 11 గంటల మధ్య సమయంలో జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా అప్రమత్తంగా తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టి, సంఘవిద్రోహశక్తులను గుర్తించే లక్ష్యంతో తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాలో 39 ప్రదేశాలలో 2840 వాహనాలను పోలీసులు తనిఖీ చేశారన్నారు. వీటిలో సరైన ధ్రువపత్రాలు లేని 17 వాహనాలు సీజ్ చెయ్యడం జరిగిందన్నారు. మరో 150 వాహనాలకు జరిమానాలు విధించడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని 13 రైల్వే స్టేషన్ లలో తనిఖీ చేసి అనుమానితులను విచారించడం జరిగిందన్నారు. 71 లాడ్జ,హోటల్,రిసార్ట్స్ లలో తనిఖీలు చేసి వాటిలో బస చేసిన వారి వివరాలను సేకరించడం జరిగిందన్నారు. తాత్కాలికంగా బస చెయ్యడానికి వచ్చే వివరాలు, గుర్తింపు కార్డు నకలు సేకరించి రికార్డులో క్షుణ్ణంగా నమోదు చేసుకోవాలసిన బాధ్యత లాడ్జ,హోటల్,రిసార్ట్స్ ల నిర్వాహకుల పై ఉంటుందన్నారు. ఎవరైనా వ్యక్తులు అనుమానాస్పదంగా ఉంటే సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారికి సమాచారం అందించే విధంగా నిర్వాహకులకు తగిన సూచలు ఇవ్వడం జరిగిందన్నారు.

## ఇంటికో పారిశ్రామికవేత్త లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన

### ఎంపీ లావు, చీఫ్‌విప్ జీ.వీ

**బొల్లాపల్లి,మే9,ప్రభాతవార్త:** అన్ని ప్రాంతాల్లో సమాన అభివృద్ధి, ఇంటికో పారిశ్రామికవేత్త లక్ష్యంగా ప్రతి నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం ఎంఎస్ఎంఈల పార్కుల ఏర్పాటు చేస్తుందని తెదేపా నర్సరావుపేట ఎంపి లావు శ్రీ కృష్ణదేవరాయలు, ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు.



మండలకేంద్రమైన బొల్లాపల్లి గ్రామం నందు ఎంఎస్ఎంఈ పార్కు నిర్మాణానికి ఎంపి శ్రీ కృష్ణదేవరాయలు, చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులు, జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావులతో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఎంపి శ్రీ కృష్ణదేవరాయలు, చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులు మాట్లాడుతూ ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్న హామీ మేరకే సీఎం చంద్రబాబునాయుడు పరిశ్రమలను పెద్ద ఎత్తున్న ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. బొల్లాపల్లి నందు 70 ఎకరాల్లో రూ. 7 కోట్లతో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు కానుందని తద్వారా స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు రానున్నాయని వెల్లడించారు. పారిశ్రామిక ప్రగతిలో భాగంగా ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ వర్గాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన, స్థానిక నాయకులు ప్రసంగించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

10-5pg10exBTWQV.qxd:10-5pg10exBTWQV.qxd 01/01/01 8:14 AM Page 1



# క్లైమాక్స్‌కు ఐపిఎల్ లీగ్



## ప్రతీ మ్యాచ్ నిర్ణాయకమే
## వీటికి ప్లేఆఫ్ బెర్త్ కన్ఫమ్!

**న్యూఢిల్లీ:** ఉత్కంఠభరితంగా సాగుతోన్న ఐపిఎల్-2025, 18వ సీజన్ క్లైమాక్స్‌కు చేరింది. అయితే భారత్, పాక్ మధ్య ఉద్రిక్త వాతావరణం నేపథ్యంలో శుక్రవారం నుండి జరగాల్సిన అన్ని మ్యాచ్‌లు వాయిదా పడ్డాయి. అయితే ఇప్పటి వరకూ జరిగిన మ్యాచ్‌ల్లో జట్లు పరిస్థితిని చూస్తే గుజరాత్ టైటాన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్, ముంబై ఇండియన్స్ ప్లేఆఫ్స్‌కు అగ్రస్థానాల్లో ఉన్నాయి. డిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జెయింట్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ చివరి అవకాశాలను ఆశిస్తున్నాయి. ఇప్పటికే చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్, సన్ రైజర్స్ హైదరాబాద్ పోటీ నుండి నిష్క్రమించాయి. ఇక ప్రతి మ్యాచ్ ఫలితం ఇప్పుడు కీలకం కాగా, నెట్ రన్ రేట్ కీలక పాత్ర పోషించనుంది. ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించేందుకు జట్లు తమ మిగిలిన మ్యాచ్‌లలో గెలవాల్సిన అవసరం ఉంది. ప్రతి మ్యాచ్ ఇప్పుడు నిర్ణాయకంగా మారింది. ప్రస్తుతం 1వ స్థానంలో ఉన్న గుజరాత్ ప్లేఆఫ్స్ 98.2 అర్హత శాతంగా ఉంది.

ఇక టాప్ 2 ఫినిష్‌కు సంబంధించి 73.6గా ఉంది. మిగిలిన మ్యాచ్‌లను ఢిల్లీ క్యాపిటల్స్‌తో ఈ నెల 11, లక్నో సూపర్ జెయింట్స్‌తో 14న, చెన్నై సూపర్ కింగ్స్‌తో 18న ఆడనుంది. కాగా ఈ మ్యాచుల్లో 1 విజయం సాధిస్తే ప్లేఆఫ్స్‌కు సరిపోతుంది. 2 విజయాలు టాప్ 2 ఫినిష్ చేయవచ్చు. అలాగే 2వ స్థానంలో ఉన్న బెంగళూరు ప్లేఆఫ్స్ అర్హత శాతం 99.1గా ఉంది. టాప్ 2 ఫినిష్ 69.0గా ఉంది. మిగిలిన మ్యాచ్‌లను లక్నోతో ఈ నెల 9న హైదరాబాద్‌తో 13న, కోల్‌కతాతో 17న ఆడనుంది. ఈ మ్యాచ్‌ల్లో 1 విజయం సాధిస్తే ప్లేఆఫ్స్‌కు ఖచ్చితంగా వెళ్తుంది. 2 విజయాలు ఉంటే టాప్ 2 ఫినిష్‌ను దాదాపుగా నిర్ధారిస్తాయి. 3వ స్థానంలో ఉన్న పంజాబ్ ప్లేఆఫ్స్ అర్హత శాతం 88.0గాఉంది. టాప్ 2 ఫినిష్‌కు అయితే 37.6గా ఉంది. మిగిలిన మ్యాచ్‌లను ముంబైతో 11న, రాజస్థాన్‌తో 16న ఆడనుంది. పంజాబ్ 2 విజయాలు సాధిస్తే ప్లేఆఫ్స్‌కు ఖచ్చితంగా వెళుతుంది. 1 విజయం బలమైన నెట్ రన్ రేట్ ఉంటే టాప్ 2 ఫినిష్‌కు సహాయపడుతుంది. 4వ స్థానంలో ఉన్న ముంబై ప్లేఆఫ్స్ అర్హత శాతం 69.9 ఉంది. ఇక టాప్ 2 ఫినిష్ అయితే 13.3గా ఉంది. మిగిలిన మ్యాచ్‌లను పంజాబ్‌తో 11న, డిల్లీతో 15న ఆడనుంది. వీటిలో 2 విజయాలు సాధిస్తే ప్లేఆఫ్స్‌కు దాదాపుగా వెళ్తుంది, టాప్ 2 ఫినిష్‌కు రెండు విజయాలు అవసరం. ఇక 5వ స్థానంలో ఉన్న ఢిల్లీ ప్లేఆఫ్స్ అర్హత శాతం 42.6గా ఉంది. ఇక టాప్ 2 ఫినిష్‌కు వస్తే 5.2 ఉంది. మిగిలిన మ్యాచ్‌ల్లో పంజాబ్‌తో 8న జరగాల్సిన మ్యాచ్ రద్దు కాగా, గుజరాత్‌తో 11న, ముంబైతో 15న ఆడనుంది. 3 విజయాలు ప్లేఆఫ్స్ ఆశలను నిలుపుతాయి. 6వ స్థానంలో ఉన్న కోల్‌కత్తా ప్లేఆఫ్స్ అర్హత శాతం 1.2గా ఉండగా, టాప్ 2 ఫినిష్ కష్టమే. మిగిలిన హైదరాబాద్, బెంగళూరుతో ఆడాల్సి ఉంది. వీటిలో రెండు మ్యాచ్‌లలో విజయం సాధించింది, ఇతర జట్ల ఫలితాలు అనుకూలంగా ఉండాలి అప్పుడే ప్లే ఆఫ్స్‌కి ఆర్హతసాధించే అవకాశముంది. 7వ స్థానంలో ఉన్న లక్నో ప్లేఆఫ్స్ అర్హత శాతం 0.7గా, టాప్ 2 ఫినిష్ 0.0గా ఉంది. మిగిలిన బెంగళూరు, గుజరాత్, హైదరాబాద్‌లతో ఆడ నుండగా, ఈ అన్ని మ్యాచ్‌లలో విజయం సాధించాల్సి ఉంటుంది.



## ఇటాలియన్ ఓపెన్‌లో
## మూడో రౌండ్‌కు ఒసాకా, జబీర్

**న్యూఢిల్లీ:** ఇటాలియన్ ఓపెన్-2025లో బడోసా, క్విటోవా నిష్క్రమించడంతో ఒసాకా మరియు జబీర్ మూడో రౌండ్‌కు చేరుకున్నారు. తొమ్మిదో సీడ్ పౌలా బడోసా, రెండుసార్లు వింబుల్డన్ ఛాంపియన్ పెట్రా క్విటోవా గాయాల కారణంగా వైదొలగడంతో నవోమి ఒసాకా, ఓన్స్ జబీర్‌లు రోమ్‌లో జరిగిన ఇటాలియన్ ఓపెన్ మూడో రౌండ్‌కు చేరుకున్నారు. 27 ఏళ్ల బడోసా వెన్నునొప్పి కారణంగా వైదొలిగిన తర్వాత జపాన్‌కు చెందిన ఒసాకా స్విస్ లక్కీ లూజర్ విక్టోరిజా గొలుబిక్‌ను 6-2, 6-3 తేడాతో ఓడించింది. ప్రపంచ నంబర్ 2 క్రీడాకారిణి లేకపోవడం ఫ్రెంచ్ ఓపెన్‌కు ముందు ఆమె ఫిట్‌నెస్‌పై మరిన్ని సందేహాలను లేవనెత్తింది. అదేవిధంగా కాలు సమస్య కారణంగా క్విటోవా వైదొలగాల్సి వచ్చింది, కాబట్టి మూడుసార్లు గ్రాండ్ స్లామ్ ఫైనలిస్ట్ జబీర్ వాక్ ఓవర్ ద్వారా ముందుకు సాగాడు. దీంతో తదుపరి ఆరో సీడ్, ఇటాలియన్ జాస్మిన్ పావోలిని లేదా క్వాలిఫైయర్ లులుసన్‌తో తలపడతాడు. 35 ఏళ్ల క్విటోవా, మొదటి రౌండ్‌లో ఇరినాకామెలియా బేగ్‌ను ఓడించడం ద్వారా ప్రసూతి సెలవు నుండి తిరిగి వచ్చిన తర్వాత తన తొలి విజయాన్ని సాధించింది.





## బిడబ్ల్యూఎఫ్ సెమీఫైనల్‌కు ఉన్నతి
### కెనడాతో తలపడనున్న ఆయుష్

**న్యూఢిల్లీ:** బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ (బిడబ్ల్యూఎఫ్) వరల్డ్ టూర్ సూపర్ 300 ఈవెంట్‌లో భారత్ యువ క్రీడాకారిణి ఉన్నతి హుడా సెమీఫైనల్‌కు చేరుకుంది. శుక్రవారం జరిగిన ఈ పోటీలో ఉన్నతి చైనీస్ తైపీకి చెందిన హంగ్ యిటింగ్‌ను ఓడించింది. గత సంవత్సరం సయ్యద్ మోడీ ఇండియా ఇంటర్నేషనల్ సెమీ ఫైనల్లో పివి సింధు చేతిలో ఆమె ఓడిపోయింది. ఉన్నతి తదుపరి ఫైనల్‌లో స్థానంకోసం జపాన్‌కుచెందిన టాప్‌సీడ్‌మరియు ప్రపంచ8వ ర్యాంకర్ టోమోకా మియాజాకితో తలపడనుంది. 2023 ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత అయిన 20 ఏళ్ల ఆయుష్, సీనియర్ కిదాంబి శ్రీకాంత్‌ను 21-16, 15-21, 21-17 తేడాతో తీవ్రంగా పోరాడిన రెండవ రౌండ్ పోరులో ఓడించాడు. తదుపరి పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో ఆయుష్ శెట్టి ఏడో సీడ్ కెనడా ఆటగాడు బ్రియాన్ యాంగ్‌తో తలపడతాడు.

## ఆర్చరీలో భారత్‌కు చేజారిన కాంస్యం



### రికర్వ్‌లో పురుషుల జట్టుకు నిరాశ

**న్యూఢిల్లీ:** ప్రపంచ కప్ ఆర్చరీ స్టేజ్-2 టోర్నమెంట్‌లో భారత్ రికర్వ్ పురుషుల, మహిళల జట్టు పతకం సాధించడంలో వైఫల్యం చెందారు. బొమ్మదేవర ధీరజ్, అతానుదాస్, తరుణ్‌దీప్ రాయ్‌లతో కూడిన భారత్ పురుషుల జట్టు తృటిలో కాంస్య పతకాన్ని చేజార్చుకుంది. దీపికకుమారి, అంకిత, అన్షిక కుమారిలతో కూడిన భారత్ మహిళల జట్టు మాత్రం రెండో రౌండ్‌లోనే వెనుదిరిగింది. కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో భారత్ ప్లేయర్లు మధుర, రిషబ్ యాదవ్ సెమీ ఫైనల్‌కు చేరుకుని పతకాల వేటలో నిలిచారు. అమెరికా జట్టుతో కాంస్య పతక మ్యాచ్‌లో భారత్ పురుషుల జట్టు 3-5 సెట్ పాయింట్లతోఓడింది. తొలిసెట్‌ను అమెరికా 57-56తో నెగ్గి 2 పాయింట్లు సాధించింది. రెండో సెట్ 56-52తో అమెరికా ఖాతాలోనే వెళ్లడంతో ఆధిక్యం 4-0కు పెరిగింది. మూడో సెట్‌ను భారత్ 55-54తో గెలిచి 2 పాయింట్లు సంపాదించింది. నాలుగో సెట్‌లో రెండు జట్లు 56-56తో సమంగా నిలిచాయి. దాంతో రెండు జట్లకు ఒక్కో పాయింట్ దక్కింది. దీంతో ఓవరాల్‌గా అమెరికా 5-3తో విజయాన్ని ఖరారు చేసుకుని కాంస్యం దక్కించుకుంది. అంతకు ముందు భారత్ జట్టు 5-4తో (53-51, 55-58, 55-56, 54-53, 29-27) కజకిస్తాన్‌పై గెలిచింది. నాలుగు సెట్‌ల తర్వాత రెండు జట్లు 4-4తో సమంగా నిలిచాయి. దీంతో షూట్ ఆఫ్ నిర్వహించగా, భారత్ పై చేయి సాధించింది. క్వార్టర్ ఫైనల్లో భారత్ 6-0తో (58-56, 57-56, 55-53)తో ఇటలీపై నెగ్గింది. అయితే సెమీ ఫైనల్లో టీమిండియా 4-5తో (51-54, 50-56, 56-55, 55-53, 25-26) షూట్ ఆఫ్‌లో ఫ్రాన్స్ చేతిలో ఓడిపోయింది. ఇక తొలి రౌండ్‌లో బై పొంది నేరుగా రెండో రౌండ్ మ్యాచ్ ఆడిన భారత్ మహిళల జట్టు 4-5 (49-50, 52-54, 52-45, 55-48, 26-27)తో షూట్ ఆఫ్‌లో మెక్సికో చేతిలో పరాజయం చెందింది.

## ఖేలో ఇండియాలో తెలంగాణ జోరు
### రెండు స్వర్ణాలు, రెండు కాంస్యాలు



**న్యూఢిల్లీ:** ఖేలోఇండియా యూత్ గేమ్స్‌లో తెలంగాణ ప్లేయర్ల పతక జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. బీహార్‌లోని గయా వేదికగా జరుగుతున్న వేర్వేరు ఈవెంట్లలో రెండు స్వర్ణాలు సహా రెండు కాంస్యాలు దక్కించుకుంది. పురుషుల 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లె ఈవెంట్‌లో సుహాస్ ప్రీతమ్ 2:11:00 సెకన్ల టైమిం గ్‌తో పసిడి దక్కించుకున్నాడు. అదే దూకుడు కొనసాగిస్తూ 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్‌లోనూ సుహాస్ 2:10:56 సెకన్లతో కాంస్యం ఖాతాలో వేసుకున్నాడు. మహిళల 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో శ్రీనిత్య 2:24:44 సెకన్లతో స్వర్ణం సొంతం చేసుకుంది. మరోవైపు సైక్లింగ్ కైరిన్ ఈవెంట్‌లో యువ సైక్లిస్ట్ తనీశ్ కుమార్ కాంస్యం దక్కించుకున్నాడు. కాగా ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీల ఐదవ రోజున బీహార్, జమ్మూ మరియు కాశ్మీర్ ఖేలో ఇండియా యూత్‌గేమ్స్ 2025 బీహార్‌లో తమ మొదటి బంగారు పతకాన్ని గెలుచుకు న్నాయి. సెపక్ తక్రా క్వాడ్ టీమ్ బాలుర ఫైనల్‌లో ఆతిథ్య రాష్ట్రం మణిపూర్‌పై విజయం సాధించగా, జమ్మూ మరియు కాశ్మీర్ బాలుర వాలీబాల్ టైటిల్‌ను గెలుచుకుంది. అలాగే బాలికల క్వాడ్ జట్టు మణిపూర్ చేతిలో వరుస గేమ్‌లలో ఓటమి చెందింది, కానీ హర్షిత్‌కుమార్, పార్థసారథి, తన్మయ్ రాజ్, అంకిత్ కుమార్, సిద్ధాంత్ కుమార్ మరియు అన్షు కుమార్‌లతో కూడిన బాలుర కలయిక 17-15, 15-11 తేడాతో వరుస గేమ్‌లలో విజయం సాధించడానికి ఎక్కువ సమయం పట్టలేదు. జమ్మూ కాశ్మీర్ బాలుర వాలీబాల్ జట్టు 35-33, 19-25, 25-17, 25-21తేడాతో సుదీర్ఘ పోరాటంలో విజయంసాధించింది. తొలి మ్యాచ్‌లో ఓటమి పాలైన తమిళనాడు పశ్చిమ బెంగాల్‌ను 31తేడాతో ఓడించిబాలికల కిరీటాన్ని కైవసం చేసుకుంది.

# డిఫెన్స్ స్టాక్స్ పరుగులు

**ముంబై, మే 9:** ఉగ్రవాదులను ఏరిపారేయడమే లక్ష్యంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను జీర్ణించుకోలేని పాకిస్థాన్ దుస్సాహసానికి ఒడిగడు తోంది. రెచ్చగొట్టే ధోరణిని ప్రదర్శిస్తోంది. జమ్మూ విమానాశ్రయంతోపాటు సరిహద్దుల్లోని పలు సైనిక కేంద్రాలను లక్ష్యంగా చేసుకొని గురువారం దాడులకు యత్నించింది. ఈ ప్రయత్నాలను భారత్ సమర్థంగా తిప్పి కొట్టింది. 8 డ్రోన్లను, 3 ఫైటర్ జెట్లను కూల్చేసింది. ఈక్రమంలో రెండు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈనేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లో డిఫెన్స్ సంబంధిత స్టాక్స్ రాణిస్తున్నాయి. భారత్ డైనమిక్స్ లిమిటెడ్ 9.73 శాతం, పరాస్ డిఫెన్స్ అండ్ స్పేస్ టెక్నాలజీస్ లిమిటెడ్ 5.89 శాతం, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ 4.88 శాతం, గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ లిమిటెడ్ 3.63 శాతం, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ 3.60 శాతం చొప్పున బీఎస్ఈలో రాణిస్తున్నాయి. డ్రోన్ల తయారీ సంస్థ ఐడియా ఫోర్జ్ టెక్నాలజీ లిమిటెడ్ ఏకంగా 18 శాతం మేర లాభాల్లో కొనసాగుతోంది. డ్రోనాచార్య ఏరియల్ ఇన్నోవేషన్స్ లిమిటెడ్ 4.99 శాతం లాభాల్లో కొనసాగుతోంది. మరోవైపు మన స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో కొనసాగుతున్నాయి. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఇంట్రాడేలో బీఎస్ఈ సెన్సెక్స్ 800 పాయింట్లు, నిఫ్టీ 250కి పైగా పాయింట్ల నష్టాల్లో ట్రేడవుతున్నాయి. ఐసీఐసీఐ బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్టీపీసీ, బజాజ్ ఫైనాన్స్ షేర్లు నష్టాల్లో ట్రేడవుతుండగా, టైటాన్, ఎల్అండ్‌టీ, టాటా మోటార్స్, ఎస్‌బీఐ షేర్లు మాత్రమే లాభాల్లో కొనసాగు తున్నాయి.



## సరిహద్దు రాష్ట్రాల్లోనే భారీగా బ్యాంకు డిపాజిట్లు

**న్యూఢిల్లీ, మే 8:** భారత్-పాకిస్థాన్‌ల మధ్య యుద్ధ పరిస్థితులు ఎప్పటికప్పుడు వేగంగా మారిపోతున్నాయి. పాకిస్తాన్‌పై ఓవైపు మెరుపుదాడులతో విరుచుకుపడుతూనే మరోవైపు సరిహద్దు వెంబడి ఆ దేశం చేస్తున్న దాడులను భారత్ సైనిక దళాలు తిప్పికొడుతున్నాయి. ఈ నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాల్లోనే గణనీయమైన డిపాజిటర్ బేస్ ఉండడంతో బ్యాంకింగ్ రంగం ఇక్కడ జరుగుతున్న పరిణామాలను నిశితంగా గమనిస్తుంది. జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో అత్యధిక బ్యాంకు డిపాజిట్లు ఉన్నాయి. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా తాజా గణాంకాల ప్రకారం, భారతదేశ మొత్తం బ్యాంకు డిపాజిట్లలో 12.81 శాతం అంటే రూ.26.21 లక్షల కోట్లు ఆ అయిదు రాష్ట్రాల నుంచే ఉన్నాయి. ఇక అప్పుల విషయానికివస్తే, మొత్తం అడ్వాన్సులలో 13.41 శాతం అంటే రూ.22.13 లక్షల కోట్లు ఆయా రాష్ట్రాల్లో ఉన్నాయి. జమ్ముకశ్మీర్‌లో ఘర్షణకు కేంద్ర బిందువైన కేంద్ర పాలిత ప్రాంతం జమ్ముకశ్మీర్ అస్థిర నియంత్రణ రేఖతో సహా పాకిస్థాన్‌తో 3,323 కిలోమీటర్ల సరిహద్దును పంచుకుంటోంది. జమ్ముకశ్మీర్ బ్యాంకుల్లో రూ.1.49 లక్షల కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. ఇవి దేశ డిపాజిట్లలో 0.73 శాతం. అడ్వాన్సులు రూ.73,879కోట్లు. మొత్తంఅడ్వాన్సులలో 0.45శాతం. భారత్‌లో మరో ముఖ్యమైన సరిహద్దు రాష్ట్రం పంజాబ్. ఇది పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌తో 547 కిలోమీటర్ల సరిహద్దును పంచుకుంటోంది. దేశంలోని మొత్తం డిపాజిట్లలో 3శాతం అంటే రూ.6.14 లక్షల కోట్లకుపైగా ఈ రాష్ట్రం నుంచి ఉన్నాయి. ఇక రూ.5.35 లక్షల కోట్ల మేర రుణాలను ఇక్కడి బ్యాంకులు వితరణ చేశాయి. పాకిస్థాన్‌లోని సింధ్, పంజాబ్ ప్రావిన్సుల వెంబడి 1,035 కిలో మీటర్ల ఎడారి సరిహద్దు కలిగిన రాజస్థాన్‌లో రూ.6.98 లక్షల కోట్లకు పైగా డిపాజిట్లు, రూ.6.25 లక్షల కోట్లు అడ్వాన్సులు ఉన్నాయి.




## ఇంధన కొరతపై ఇండియన్ ఆయిల్ స్పష్టత

**ముంబై, మే 9:** పాకిస్థాన్‌తో నెలకొన్న ఉద్రిక్తతల వేళ ఆన్‌లైన్ వేదికగా పలు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. యుద్ధ వాతావరణం నేపథ్యంలో దేశవ్యాప్తంగా చమురు నిల్వల్లో కొరత ఏర్పడినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రజలు త్వరితగతిన ఇంధనాన్ని కొనుగోలు చేయాలని పలువురు భావిస్తున్నారు. ఆయా ప్రచారాలపై ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ స్పష్టతనిచ్చింది. ఇంధన నిల్వల విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపింది. తమవద్ద తగినంత నిల్వలు ఉన్నట్లు ప్రకటించింది. దేశవ్యాప్తంగా తగినంత ఇంధన నిల్వలు కలిగిఉన్నాం. మా సరఫరా లైన్లు సజావుగా పని చేస్తున్నాయి. భయపడాల్సిన అవసరం లేదు. ఇంధనం, ఎల్‌పీజీ మా అన్ని అవుట్‌లెట్‌లలో అందుబాటులో ఉన్నాయి. ప్రశాంతంగా ఉండి, అనవసరమైన రద్దీని నివారించి మెరుగైన సేవలు అందించడంలో మాకు సహాయపడండి. మా సరఫరా లైన్లు సజావుగా నడుపుతుంటాం అని పేర్కొంది.




## వాణిజ్యం

## స్టాక్ మార్కెట్లకు 'సింధూర్' షాక్

**ముంబై, మే 9:** భారత్-పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు దేశీయ స్టాక్ మార్కెట్‌పై ప్రభావం చూపాయి. సరిహద్దు రాష్ట్రాలపై పాక్ దాడులకు యత్నించడంతో భారత్ వాటిని సమర్థంగా తిప్పికొట్టింది. ఇవి మరింత తారస్థాయికి చేరొచ్చన్న భయాలతో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నేడు క్షీ ణించాయి. దాదాపు అన్ని రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొ న్నాయి. దీంతో వరుసగా రెండో రోజూ మన సూచీలు నష్టపోయాయి. సెన్సెక్స్ 800 పాయింట్లకు పైగా నష్టపోయి మళ్లీ 80వేల దిగువకు చేరగా, నిఫ్టీ 24వేల కాస్త ఎగువన ముగిసింది. భారత్-పాక్ నడుమ ఉద్రిక్తతల వేళ విమానయానం, టూరిజం, రియాల్టీ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అదే సమయంలో డిఫెన్స్ సంబంధిత స్టాక్స్‌లో కొనుగోళ్ల ఉత్సాహం కనిపించింది. డ్రోన్ల తయారీ కంపెనీ ఐడియా ఫోర్జ్ షేర్లు ఏకంగా 18 శాతం మేర పెరిగాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ ఫ్లాట్‌గా ముగియగా, స్మాల్‌క్యాప్ సూచీ 0.61 శాతం మేర నష్టోయింది. మార్కెట్ ఒడుదొడుకులను సూచించే ఇండియా విక్స్ 2.98 శాతం పెరిగి 21.63కు చేరింది. ఇంట్రాడేలో 8 శాతం వరకు పెరిగింది.



సెన్సెక్స్ ఉదయం 78,968.34 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై రోజంతా నష్టాల్లోనే చలించింది. ఇంట్రాడేలో 78,968.34 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచి చివరికి 880.34 పాయింట్ల నష్టంతో 79,454.47 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 265 పాయింట్ల నష్టంతో 24,008.00 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 17 పైసలు బలపడి 85.41 రూపాయలుగా ఉంది. ఐసీఐసీఐ బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. టైటాన్, టాటా మోటార్స్, ఎల్అండ్‌టీ, ఎస్‌బీఐ, ఏషియన్ పెయింట్స్ షేర్లు రాణించాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 63 డాలర్ల వద్ద కొనసాగగా.. బంగారం 3,329 డాలర్ల వద్ద ట్రేడయింది.

# ఓయో లాభం రూ.623 కోట్లు

**ముంబై, మే 9:** హాస్పిటాలిటీ రంగ దిగ్గజం ఓయో 202425 ఆర్థిక సంవత్సరంలో రూ.623 కోట్ల లాభాన్ని అందుకుంది. దింతో ఓయో లాభాల పరంగా టాప్ భారతీయ స్టార్టప్‌గా అవతరించింది. ఓయో వ్యవస్థాపకుడు రితేష్ అగర్వాల్ గురువారం స్వయంగా ఉద్యోగులకు ఈ విషయాన్ని తెలియజేశారు. అయితే ఓయో ఐపీఓ ప్రారంభం ఆలస్యం అవ్వొచ్చు అని భావిస్తున్న సమయంలో ఈ వార్త వెలువడింది. ఒక్కో షేరుకు ఓయో ఆదాయం ఓయో ఆర్థిక సంవత్సరం 2025లో రూ.1132 కోట్ల ఎబిటాను సాధించింది, గత సంవత్సరం ఇదే కాలంలో చూస్తే రూ.889 కోట్లుగా ఉంది. అంతేకాక గత సంవత్సరంతో పోలిస్తే 27 శాతం పెరుగుదలను సూచిస్తుంది. ఓయో షేరు ఆదాయం (ఇపిఎస్) 2025లో రూ.0.93కి చేరుకుంటుందని అంచనా, అయితే 2024లో ఈ అంచనా రూ.0.36గా ఉంది. ఇంకా ఈసారి 158 శాతం పెరుగుదలను చూపుతుంది. గత ఆర్థిక సంవత్సరంలో ఓయో గ్రాస్ బుకింగ్ వాల్యూ (జిబివి)లో 54 శాతం వృద్ధిని నమోదు చేసింది. అంటే రూ.16,436 కోట్లకు పెరిగింది. దీని రెవెన్యూ రూ.6,463 కోట్లకు పెరిగి, గత సంవత్సరంతో పోలిస్తే 20 శాతం వృద్ధిని నమోదు చేసింది. 2024 ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 2025 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో ఓయో బితీజు 126 శాతం పెరిగి రూ.6,379 కోట్లకు చేరుకుంది. నాల్గవ త్రైమాసికంలో ఆదాయం గత సంవత్సరం కంటే 41 శాతం పెరిగి రూ.1,872 కోట్లుగా ఉంది. గత 12 నెలల్లో భారతదేశం, సౌదీ అరేబియా, యుఎఇ ఇంకా సౌత్ ఈస్ట్ ఆసియా సహా వివిధ ప్రాంతాలలో 30కి పైగా సండే హోటళ్లను ప్రారంభించడం ద్వారా కంపెనీ ప్రీమియం ఆఫరింగ్ పెంచింది. ఓయోకి ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం దాదాపు 22,700 హోటళ్ళు ఇంకా 1,19,900 ఇల్లులు ఉన్నాయి. తాజాగా ఓయో హోటల్స్ అక్టోబర్‌లో ఐపిఓకి లిస్ట్ కావాలనే ప్లాన్ వాయిదా వేసినట్లు తెలిపింది. రితేష్ అగర్వాల్ నేతృత్వంలోని కంపెనీ ఈ ఏడాది చివర్లో ఐపిఓను ప్రారంభించాలని యోచిస్తోంది. అయితే ఇన్వెస్టర్ సాఫ్ట్ బ్యాంక్ ఈ ప్లాన్‌తో విభేదించింది. ఆదాయం




పెరిగే వరకు ఐపిఓను ఆలస్యం చేయాలని సాఫ్ట్‌బ్యాంక్ ఓయోను కోరింది. ఓయోలో జపాన్ పెట్టుబడి సంస్థకు 40 వాటా ఉండగా, వ్యవస్థాపకుడు అగర్వాల్‌కు 30 వాటా ఉంది. ఈ అద్భుతమైన పర్ఫార్మెన్స్‌తో ఓయో లాభాలను ఆర్జించడమే కాకుండా సరైన ప్లాన్ ఇంకా ఆవిష్కరణలతో ప్రయాణ రంగంలో కూడా పెద్ద ఎత్తున లాభాలను సాధించవచ్చని భారతీయ స్టార్టప్ ఏకోసిస్టంలో ఒక బలమైన ఉదాహరణగా నిలిచింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps